భారతి

మార్చి 1973

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

వెల ఒకరూపాయి

భారతి

మాసపత్రిక

★

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938–1972)

★

మార్చి 1973

సంపుటము : 50 : సంచిక : 3 :

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

మార్చి 1973

జీవనౌక

శ్రీ సోమసుందర్

గాలివాన ముసరు కొనిన
చలి వజవజ వణికించిన
కాల స్పృహ లేదు హృదికి
మనసు నిండు కవిత పొంగు వరదగా
రసపయోధి తరంగాలు తరుమగా...

నడి వేసవి నడికి రేల
నిదుర బరువు నణగు మనసు
హటాత్తుగా మేలుకొనును
ఖంగుమనే మ్రోత లీను భేరిగా
చకత్ చకిత విద్యుత్ శిఖ మెరవగా...

ఇరుల జడలు కదిలిస్తూ
వాతాయన పూవల — పెను
భూత మొకటి భయపెడితే
హృదయాలయ పరంజ్యోతి కవితగా —
భయాల పోకార్చు నవిల సూతిగా !
చెవిలోనో కలలోనో
నవజీవన గాన రవళి
ఉర్వికురికి చైతన్యపు
రూప రేఖ తొడిగినట్లు తోచగా
భావ మయూఖాల జడులు వీచగా...

విను కరి కావలి దవ్వుల
కోనల కర్రలు ఢీకొని
ఛట్ ఛటా రవాల వీడవి
మొరటు గాలి కదలి మనసు నిండగా
జాలిగీతి ఎద పొలముల ముంచగా...

భా ర తి

మెదడు గూటి పలుకు చిలుక
కైత గుడ్లు పొదిగి లేప
ఎద రొమ్ముల కొత్త ఎరిక
లోక టొక్కటి తొడిగి కూన నడువగా --
అనుగడుగున కొత్త కలలు నుడువగా...

ఖగ కులాయ గుప్తధనము
ఒక్కసారి కలవరించి
తల్లి రెక్క కప్పు క్రింద
నక్కి సద్దుమణిగి, తిరిగి కూర్కగా
ఇరుల త్రుంచి వెలుగు మొలుచు రీతిగా...

ఆలోచన రెక్క విప్పి
మేఘ పత్రి జాల మందు
క్రొత్త కోర్కె తేరుకొనుచు
తారాపథమందు సుధల గ్రోలగా —
శారద నభమే వెలుగును మాలగా !

వీనుల విను వీధులందు
ఉరవడి చెలరేగిన ఝరి
లోకము దశ దిశల కురియు
కవితా హృది మ్రోగు జీవ సారముగా...
సుప్త బీజ మొలుకు జీవనాదముగా...

నిదుర ముదురు నలుపురంగు
చీల్చి చేతన మవతరించు
గాలి కోడి గొంతు కొసలు
ఎద ఎదలో కొత్త పాట నింపగా...
కొత్త రక్తి కొత్త శక్తి పండగా...

వేదన పడు సృజనోత్సవ
మొకటే భువికీ కవికీ
చిర యౌవన ప్రాప్త పథము,
ఎడద పడిన ఆరాటము ఫలించగా—
కడలి వంటి ఆనందమె జనించగా...

జీవనౌక

దూర దూర తీరాలను
తిమిర రాత్రి కుదించగా
నిశ్శబ్దపు తలముపైన
జీవ మురళి కళనళు పడు నుషస్సుగా...
కావ్యధార ఉచ్ఛలించు మహస్సుగా...

కవిత సముజ్జ్వల రూపము...
ప్రసవ పరీమళ రజమ్ము...
బయట తొడుగు వలువ కాదు
కనుకనె ఉదయించు గుండె చీఁగా
వత్తి కాల్చి వెడలు దీప కాంతిగా

వెన్నెల వెచ్చని కౌగిలి
నెచ్చెలి కొనవ్రేళుఁ వలె
నారికేళ శిరోజముల
లాలించును పాలించును రాత్రింతా —
నవ్య కావ్య ఫలము లిచ్చు యత్నంగా...

కొబ్బరాకు దోనెలలో
దోగిన సన్నని ఈనెలు
తాంబూరా తంత్రుల వలె
మొరయు నహర్నిశల మహాగానముకై
మెరయు గగన చిద్రూపము కావ్యము కై

నైరాశ్యపు దుర్ఘడియల
తల్లడిల్లు కవితా హృది
కంటి కొసల చెమ్మలలో
నవ్యాశల రాగరసము పొంగగా
కావ్య సాగరాల దుముకు నీదగా...

పాడు గుడిని గుడ్లగూబ
కాదు బ్రతుకు, భయ మెందుకు?
కిటికీ ఊచల ప్రేతం
కాదు భావి, భయ మెందుకు?...సాగరా!
సాగరాల జీవనౌక కవితరా!

ఆధునిక యుగము - గాంధీ సాహిత్యము

శ్రీ నిడుదవోలు వేంకటరావు

(గత సంచిక తరువాయి)

(2) మత స్వాతంత్ర్యము

కొక్కొండవారు మొదట ద్వైతులు—అనగా మాధ్వ మతస్థులు — వారి తండ్రి కొక్కొండ నరసింగరావు పంతులుగారు మాధ్వులైనను వారి తల్లి రావమాయమ్మ ఆరువేల నియోగులలో పద్ధతి నియోగము స్థాపించిన శ్రీ నందిరాజు లక్ష్మీనారాయణ దీక్షితుల దౌహిత్రి. నియోగులందరును స్మార్తులు. అయినను తండ్రి మాధ్వు డగుటచేత వేంకటరత్నము పంతులుగారికి బాల్యమునుండియు మాధ్వమత సంప్రదాయాను సారులై, ఆ మత ధర్మములను నిష్ఠతో నిర్వర్తించు చుండిరి. అంతేకాదు వారు లౌకికమైన యుద్యోగమున నున్నను, మాధ్వమత గ్రంథము లన్నింటిని ద్వైతమతాను సారియగు బ్రహ్మసూత్ర భాష్యమును అధ్యయనము చేసిరి. ఇందువలననే క్రీ. శ. 1884 వఱకు వారి రచనలలో—శ్రీహరి స్మరణము, ముఖ్యప్రాణదేవుని (ఆంజనేయుని) స్మరణము కను పట్టును. మాధ్వభాష్యమును తొలుత తెలుగు లిపిలో ముద్రించినవారు కొక్కొండ వారే.

ఇట్లొక్కవైపు ద్వైతమున్నను, మాతా మహాంశమునుండి సంక్రమించిన శాంకరాద్వైతమతమును విడనాడక — అద్వైతమునకు మూలాధారములైన ప్రస్థానత్రయమును, ముఖ్యముగా శాంకర సూత్ర భాష్యమును నభ్యసించి, అందు నిష్ణాతులైరి. దీనికి తోడుగా పంతులుగారికి వారి పదునాఱవ యేట (క్రీ. శ. 1838) శ్రీ తిరుమల క్షేత్రమున శ్రీ బిల్వేశ్వరుని యనుగ్రహమున—నపూర్వ కవితాశక్తి లభ్యమైనది. క్రమక్రమముగా వారికి శాంకరాద్వైతము నందభి నివేశము హెచ్చి, తన ద్వైతమతమును వీడి, అద్వైత మతాను యాయి యగుటకు నిశ్చయించు కొనిరి.

ద్వైతమునుండి అద్వైతమునకు మార్పు

ఆ కాలమున ననగా నిప్పటికొక శతాబ్దికి పూర్వము మతము మార్చుకొనుట యున్న నది యతి దుర్ఘటమైన కార్యము. పీఠాధిపతుల ఆమోదముద్ర నందుంటయే గాక, ఆ పీఠాధిపతుల యధ్యక్షత క్రింద సకల పండిత జన సమక్షమున వాదోపవాదములు చేసి, జయముగొన్నవారికే స్వీయమైన మతమును విడిచి, అన్యమతమును బేరుట కర్హతయుండెడిది. ఇందువలన మతము మార్చుకొనవలచి నప్పుడాతడు, తానవలంబించు నూతన మతతత్త్వమును సంపూర్ణముగా గ్రహించిన అధికారియై యుండవలెను — కొక్కొండవారు తమ కాలమున పై పరీక్షకు నిలిచి మతము మార్చుకొన్న వారిలో నగ్రగణ్యులు. ఆయుదంత మిది—

వారా కాలమున ద్వైతమత సంప్రదాయము ననుసరించి, మాధ్వ పీఠాధిపతులగు ఆచార్యులు వచ్చినపుడు వారికి ప్రతి యేటా కొంత ముడుపు చెల్లింపవలసి వచ్చెడిది. అప్పటికి వారికి జీతము స్వల్పమే యగుట చేతను, కుటుంబ భరణమునకు గూడ చాల నిదిగా నుండుటచేతను దానిని చెల్లింపలేక పోయెడివారు. ఆ ఆచార్యులు వచ్చినపు డేదో సాకుచెప్పి తప్పించుకొనెడివారు. ఇట్లు రెండు మూడేండ్లు గడచినవి. నాల్గవ యేడు వారు వచ్చి "నీవు మూడేండ్ల నుండి పీఠమునకు ద్రవ్యము చెల్లింప లేదు. ఏవో కారణములు చెప్పి తప్పించు కొనుచున్నావు. ఇక నే నూరకుండను. 'ఇదిగో నిన్ను ద్వైతమునుండి వెలివేయు చున్నాను.' అని మత బహిష్కార పత్రము వ్రాయ నాజ్ఞాపించిరి.

అంత వారి కీ క్రింది రీతిని సంభాషణ జరిగెను.

వేంక:—అయ్యా! ద్వైతమతము నుండి మీరు నన్ను వెలివేయుట యేమి? నేనే ద్వైత మతమును వెలివేసి—అద్వైత మతము స్వీకరించు చున్నాను.

స్వాములవారు:—ఏమి నీ ప్రత్యుత్తరము? ఇంతవఱ కెవ్వరును నా కిట్టివిధమున జవాబు చెప్పలేదే?— ఇది ఆచార్య పీఠమని యెఱుంగవా? ఇంతకు నీవు మతము మార్చుకొన గలిగిన అధికారమున్న పండితుడవా ?

వేంక —అది మన యిద్దఱిమధ్య నెట్లు నిర్ణయము కాగలదు? విద్వన్మహా సభలో వెల్లడి కావలెను— అని చెప్పి యిట్టి సభను నాహ్వానింప జేసిరి.

చెన్నపురి శృంగేరి పీఠ మహాసభ

ఆ కాలమున చెన్నపురిలో శృంగేరి శ్రీ జగద్గురు శంకరాచార్య పీఠమునకు వావిళ్ల ముద్రాసంస్థ వ్యవస్థాపకులు—ప్రసిద్ధ విద్వాంసులు నైన, వావిళ్ల రామస్వామి శాస్త్రుల వారు ప్రతినిధులుగా నుండెడి వారు. శృంగేరీ పీఠాధిపతులు ప్రతి సంవత్సరమును ప్రత్యేకముగా తమ ప్రతినిధిని వారి శ్రీముఖముతోను, శృంగేరీ పీఠ ధ్వజముతోడను —పంపి విద్వద్గోష్ఠీ సమావేశమున దానిని వెల్లడి చేసెడివారు.

మత సంబంధములైన సకల విషయములు, చర్చలు శ్రౌతస్మార్త కలాపముల నిర్ణయాదికములు సమస్తము సభలలో రామస్వామి శాస్త్రులవారి యధ్యక్షత క్రిందనే జరుగుచుండెడివి. అట్టి సభలలో నిర్ణీతములైన విషయము లందఱును శిరసాహించి, ఆచరణలో పెట్టుచుండెడి వారు.

రామస్వామిశాస్త్రులవారు, వేంకటరత్నము పంతులుగారి కోరిక ననుసరించి చెన్నపురిలో, నొక మహాసభను చేయించిరి. ఆ మహాసమావేశమునకు ఆ కాలమున చెన్నపురిలో ప్రసిద్ధులైన — ఓరుగలు సుబ్రహ్మణ్య సిద్ధాంతి—సిద్ధాంతి శివశంకరశాస్త్రి శతసహస్రావధాని మండయం కృష్ణమాచార్యులు[2] శ్రీ విద్యాపారంగతుడు, కనుపర్తి వేంకటరామ విద్యానంద నాథుడు మున్నగు మహాపండితులే కాక మాధ్వస్వాముల వారును—శృంగేరినుండి ఆ పీఠాధిపతులగు శ్రీ సచ్చిదానంద శివాభినవ నృసింహ భారతీస్వాములవారు విచ్చేసిరి. ద్వైతాద్వైత స్వాము లిరువురును శ్రీ రామస్వామి శాస్త్రులవారిని మాధ్యస్థము వహింపుడని కోరిరి. వారే అధ్యక్షులు గాన — కొక్కొండవారిని మొదట ద్వైతవాదమును గూర్చి చర్చ ప్రారంభింపు మనిరి. వారట్లే ద్వైతభాష్యము నెత్తుకొని ఖండనము చేయుచుండగా, మాధ్వస్వాముల వారు పూర్వపక్షము చేసిరి. దానిపై చర్చలు ప్రారంభమైనవి. వేంకటరత్నము పంతులుగారు ద్వైతమత స్వాముల వారి పూర్వపక్షమును ప్రతి పక్షముచేసి, ఆ వెనుక అద్వైతమత సిద్ధాంతములను, ప్రతిపాదించిరి.

అద్వైత మతమును గూర్చి ఖండన మండనములు జరుగునపుడు శృంగేరీ పీఠాధిపతులందు పాల్గొనిరి. ఈ విధముగా నేడు దినములు—సంస్కృత భాషలో నసాధారణ వాగ్ధోరణితో, వేంకటరత్నము పంతులుగారు, చర్చలకు —ప్రతిపక్షములకు సమాధానము చెప్పిన వెనుక, వారి యఖండ ప్రతిభ కాశ్చర్య పడి, సభాధ్యక్షులు, సభవారు నేక గ్రీవముగా, వారికి జయపత్ర మిచ్చుటేగాక—అద్వైత మతమును స్వీకరించుట కామోద ముద్ర నిచ్చిరి. ఆ సభలోనే శ్రీ శృంగేరీ పీఠాధిపతులు వారిని —అద్వైతమత ప్రవిష్టునిగా జేసి—'వేంకటరత్న శర్మ' అని నామకరణము చేసిరి. ఈ విషయమును వేంకటరత్నము పంతులుగారు, తమ బిల్వేశ్వరీయమున నిట్లు తెలిపినారు.

సీ. అందు శ్రీ సచ్చిదానంద శివాభిన
వ నృసింహ భారతీ స్వామి స్వగురు
ప్రీతి పాత్రుండని ప్రియముమై ద్వైత పం
జర బద్ధ ముక్తునిం జలువ సతనిం
దారణాషా ధాసిత వరపక్షంబునం
బంచమిన్బాను వాసరమున(7–7–1884)

---

1. క్రీ. శ. 1952 లో కీ. శే. వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రులవారి షష్టి పూర్తి మహోత్సవ సందర్భమున, శృంగేరీ పీఠాధిపతులు, పైరీతిగా ధ్వజమును, శ్రీముఖమును పంపిరి.

2. ఈయన చెన్నపురిలో చేసిన శతావధాన మత్యద్భుతము. అది క్రీ. శ. 1867 తత్త్వబోధిని పత్రికలో ప్రకటితము. ఆ విశేషములను సంపూర్ణముగా, శ్రీ వేంకటేశ్వరశాస్త్రిగారు తమ 'త్రిలింగ'పత్రిక (1950) లో తిరిగి ప్రకటించినారు.

నద్వైవ్రతి గావించె నాతఁ డై ద్విజరత్న
మంచి కాకర రత్నమయ్యె సాంఖ్య
గీ. ఖనిని నద్వైతమను రత్నమును గనుటను
ఘనత నద్వైత రత్న మీాయన యనఁదగె
నంత నా రత్నశర్మ రత్నాయనుఁడుగను
బుషిగ నాయెను మార్గదాయినినిఁ జేసి.
(బిల్వేశ్వరీయము షష్ఠబింబము—51 ప.)

ఏడు దినము లిట్లు పండితులతో హోరా హోరిగా శాస్త్ర చర్చలు చేసిన సంగతిని— కీర్తిశేషులు మండపాక పార్వతీశ్వర శాస్త్రులవా రొక పద్య కైవార మూలమున నిట్లు తెలిపినారు. ఒక సాహిత్య వివాద సందర్భమును పేర్కొని—

'మా కస్పన్నకు నైన వాదముల
చందంబుల్ విమర్శించినన్
నూా కావ్యంబు ఫలింపదే మఱియు
నన్మద్వాప్తిరుకస్థితిన్
శ్రీ కిం బూర్ణ నిదర్శనం బనుచు
దోచెం గాని, యద్వైత ర
క్షా కృచ్ఛంకర రూప శంకర
మతాచారంబుఁ జర్చించు చో
సాకుం బూనని వాఁడు సంకర
మతాచారంబులన్ వాదులన్
రేకెత్తింపడు; తత్కుమిత్రకృత మీా
కృత్యంబు సత్యంబు'—

అని సూచించినారు[3]

అద్వైతమత వ్యాప్తి

అద్వైతమతము స్వీకరించిన నాటినుండి దానిని వ్యాప్తము చేయుటకు బద్ధకంకణులై కొక్కొండ వారు 'శాంకరమత తత్త్వ ప్రకాశిక', 'శంకర విజయ ధ్వజము' అను గ్రంథములను రచించి యామత వ్యాప్తికి తోడు పడినారు. ఇందు శంకర విజయ ధ్వజము అనునది శంకరాచార్యుల జీవితము. మొట్టమొదట తెలుగున వెలువడిన శంకరాచార్య జీవితమిదియే.

పాశ్చాత్య నాగరత మూలమున దేశములో మన హైందవమత సంప్రదాయములనుగూర్చి ప్రచారము చేయుటకు—

"హిందూ శ్రేయోభివర్థనీసభ"

అను నొక సభను స్థాపించి, దాని మూలమున—నుప న్యాసము లిచ్చుచు గ్రంథములను ప్రకటించి, హైందవమత వ్యాప్తికి దోహదము నొనరించి[4] ఆనాఁటి ఆంగ్ల పాలకుల ననుసరించి, స్వదేశీయులలో కొందఱు పెద్దలు మన దేవాలయములను మతములను బాధ కలిగింపగా ఆ యలజడిని తమ వ్యాసముల మూలమున నుపన్యాస మూలమున— దానిని నివారింప జేసినట్లుగా నా కాలమునందలి కవులిట్లు వారిని ప్రశంసించి నారు.

'మ. ఘనులం గొందఱు గుఢ్లనున్
మతములన్ గారింపఁ బూనంగ న
ప్డానరన్ శంకరుడే సహాయుఁడు గాగ
నోహో వాఙ్ముఖంబున్ సులే
ఖినియున్నోయ మహాబలుండ షయి
యా క్లేశంబు మాయించి స
జ్జన సంస్తాప్యుడ వైతి గాదే
మును పో సంజీవనీ వల్లభా!
(బిల్వేశ్వరీయము—ప్రథమ బింబము 19 ప.)

పై పద్యమున 'వాఙ్ముఖము' అనగా ఉపన్యాసము.

ప్రత్యేక సభల మూలమున హైందవ మత పునరుజ్జీవనమునకు చెన్నపురిలో దోహదము చేసిన వారిలో ప్రథములు వేంకటరత్నము పంతులు గారే—

ఉపన్యాసకులు ఉద్యమ ప్రచారము

ఆ కాలమున ఉపన్యాసము లనగా ఆంగ్ల భాషోపన్యాసములే. వాని మూలమున, మన మత

3. అముద్రిత గ్రంథ చింతామణి (సం. 8. సం. 1. 1895 జనవరి). ఈ పద్యకైవార లేఖ 147 చరణములుగల శార్దూల మాలిక— పార్వతీశ్వర శాస్త్రులవారి మాలికా కవిత్వమున కొక మచ్చుతునక—(కకార ప్రాస)

4. ఇట్టి సభల మూలమున పూర్వమాంగ్ల పరిపాలనలో హైందవమత వ్యాప్తి ప్రచారము జరిగె డిది. విశాఖపట ణమున – 'ఆర్షమతసభ' యిట్టిదే. (వివరములకు నా ఆంధ్రవచనవాఙ్మయము చూడుడు. పుట. 72.)

సంస్కృతులను గూర్చి ప్రచారము జరుగుచుండెడిది. ఆ యుపన్యాసము లాంగ్లభాష రానివారికి నిరుపయోగము లైనవి. ఈ సంగతి గ్రహించి, మాతృభాషలో నుపన్యాసము లిచ్చి, ప్రజల నుద్బోధించిన వారిలో ప్రథములు కొక్కొండ వారే. వారు, సంస్కృతాంధ్రము లందే గాక, తమిళమున కన్నడమున పండితులు. ఆ భాషలలో పండితు లుపన్యాసములు చేసిన వానిని తెలుగులో (సహాయ నిరాకరణోద్యమమున — ఆంగ్ల భాషోపన్యాసములను వెంటనే ఆంధ్రభాషలోని కనువదించునట్లు) ననువదించెడివారు.

ఉపన్యాస ధోరణిలో నా కాలమున తెలుగు దేశమున నిద్దఱే. మహోపన్యాసకులుగా ప్రసిద్ధి కెక్కినవారు. ఒకరు మహామహోపాధ్యాయ పరవస్తు రంగాచార్యులుగారు రెండవవారు కొక్కొండ వారు[5] కొక్కొండవారు గ్రాంథికభాషలో నను ప్రాసలతో, అలంకారములతో గంటలకొలది ప్రసంగములు చేసెడి వారు—'ఉపన్యాసము' అనగా 'ఆంగ్లభాషోపన్యాసమే' అన్న ప్రథను, పూర్తిగా విస్మరింపజేసి 'ఆంధ్ర భాషోప ్యాసము' అను నామమును వ్యాప్తిచేసి ఉపన్యాస పీ మున కాదిపురుషులైన వారు కొక్కొండ వారు[6] ఈ సందర్భమున నీ కాలమునాటి స్వాతంత్ర్య సమరమున — ప్రచారమంతయు ఆంధ్రభాషోపన్యాసముల మూలముననే జరిగినదనియు నట్టిదానికి కొక్కొండ వారే మూలపురుషులనియు గ్రహింపవలెను.

భాషా స్వాతంత్ర్యము

ఆధునిక యుగమున, మతము మార్చుకొని, తన స్వతంత్రతను వ్యక్తము చేయనచ్చును గాని, భాషా స్వాతంత్ర్యము చూపుట అంతకంటె బహుకష్టమైన కార్యము. స్వాతంత్ర్యము ననుభవించుచున్న మన మీనాడు తెలుగును రాజభాషగా చేసి, ఆంగ్లభాషను విసర్జించుటకు తలపెట్టినాము. కాని యిప్పటికి నొక శతాబ్దికి పూర్వమే ఆంగ్లభాషా విసర్జనోద్యమమునకు పూనుకొని దానిని సాధించిన మహావ్యక్తి వేంకటరత్నము పంతులు.

ఆంగ్లభాష . .రాజభాషయై, జీవనాధారమై తెలుగువారిని నిత్యజీవితముపైని సాహితీ సంస్కృతులపైని, తన యఖండ ప్రభావము చూపుచున్న దినములలో, తన జీవిత కాలములో నాంగ్లభాషా పదము నుచ్చరింపక నిత్యవ్యవహారమునందును. రచనలందును, ఆంగ్లభాషా పదములకు పారిభాషిక పదములను మొదట నిర్మించి, వానిని వ్యాప్తిలోనికిదెచ్చి యీనాటి వారికి మార్గదర్శకుడైన మనీషి కొక్కొండ యే.

గ్రాంథిక భాష - నిత్యవ్యవహారము.

పంతులుగారు దైనందిన వ్యవహారమున— సంభాషణల లోనూ, వ్యావహారిక భాషమాని గ్రాంథిక భాషలోనే మాట్లాడుచుండెడివారన్న విషయము యావదాంధ్రలోక మెఱిగినదే. ఇట్లు స్వభావసిద్ధమగు వాడుకభాష విసర్జించి గ్రంథికభాష మాట్లాడుటయు నొక విశిష్టతయే. కొక్కొండవారి రీతి గ్రాంథిక భాషలో వ్యవహరించుటయు నా కాలమున గ్రంథస్థమైన విషయము. శ్రీ మండపాక పార్వతీశ్వర శాస్త్రులవారివంటి విద్వన్మహాకవులును దీని కాశ్చర్యపడుచు నిట్లు పూర్వోక్త లేఖలో ప్రశంసించిరి;

> 'మీ కల్యాణ గుణ ప్రతిజ యి పుడే మే
> ధావికిం గల్గ బో దో
> హో' కబ్బంబలయందు బోలె
> నపశబ్దోచ్చారణం బెన్నడున్
> లేకుండంబలు ఎంతగాఁ బలుకుట
> ల్మీ యందె నిత్యవ్రతం
> బై కానంబడు చుండె నిట్టి నియతం బౌ
> పూన్కి నిక్కంబగా
> మీకే చెల్లును చెల్లదెల్ల ప్రజకున్
> మిమ్మెన్నఁగా శక్యమే'

దీనినిబట్టి నాటికిని నేటికిని నిత్యవ్యవహారమున నాయన యొక్కడే గ్రాంథికభాషనే యుపయోగించుటచేత తెలుగున వ్యావహారిక భాషనే గ్రాంథికముగా చేసిన తెలుగు పండితులలో, ఆయనే మొదటివాడని, చివరవాడని చెప్ప వచ్చును. ఇంత

---

5. చూడుడు—ఆంధ్రవచనవాఙ్మయము. పుట 76.

6. చూడుడు. నవ్యాంధ్ర సాహిత్య వీథులు పుట 25.

వఱకు మన సాహిత్య చరిత్రలో గ్రాంథిక వ్యవహారమునకు కొక్కొండ తప్ప వేఱొక యుదాహరణము లేదు.

కాని యింతవఱకు పట్టుబట్టినట్లుగా సమకాలిక వ్యవహారమునకు విరుద్ధముగా నెందులకు చేసినాడో యెవ్వరును వివరింపలేదు.

తనకాలమున నొక వెల్లువవలె క్రమక్రమముగా తెలుగు భాషను ముంచివేయుచున్న ఆంగ్లభాషా ప్రవాహము నరికట్టుటకే ఆయన గ్రాంథిక భాషను వాడుక భాషగా చేసికొన్నాడు. ఆయన ఆంగ్లభాష బాగా వచ్చినవాడే. అయిన తెనుగున వ్యావహారిక భాషలో మాట్లాడుటకు ప్రారంభించిన అప్పటికే ఇంగ్లీషు భాషా పదములు దొర్లకుండ మాట్లాడుట అసంభవ మయ్యేడిది. నిత్యవ్యవహారమున తెలుగులో నెన్నో పదములు కలిసిపోయి వానిని వాడుక చేయవలసిన యావశ్యకతను నిరూపించినవి. అట్టి పరిస్థితులలో 'ఇంగ్లీషుభాష విసర్జించుటకు, తొలుత ఆంధ్రాంగ్ల సమ్మిశ్రితమైన వ్యావహారికాంధ్ర భాష విసర్జింపవలెను. అట్లయిననే తన ప్రయత్నము ఫలించును'—అన్న మహోద్దేశముతో, నాంగ్లభాష నరికట్టుటకు గ్రాంథిక వాగ్మియై యీ భాషా నవీనోద్యమము ప్రారంభించినాడు.[7]

ఆయన గ్రాంథిక సంభాషణములు నాటకములలోని పాత్రల సంభాషణమువలె నుండెడిది. మచ్చునకు కొన్ని యుదాహరించెదను.

ఇంటికి బిచ్చగాడు వచ్చియున్నచో భార్యను చూచి

'మచ్చెకంటి! బిచ్చగాడు వచ్చినాడు
బిచ్చము నిచ్చి పంపుము'

అనెడివారు. ఒకవేళ బియ్యము లేకున్న

'తండులంబులు నిండు కొన్నవి
పొండు పొండు'

అనెడివారు.

'తరుణీ! దంత ధావనమునకు సిద్ధము చేసితివా'
'పడతీ! పాదప్రక్షాళనకు పానీయంబులు దెమ్ము'

ఇత్యాదులు, వారి నిత్య గ్రాంథిక వ్యవహారమునకు నిదర్శనములు.

వారు చెన్నపురిలో రాజధాని కళాశాలలో (Piecidency College) తెలుగు పండితులుగా నున్నప్పు డెవ్వరైన మీ కే యుద్యోగము అని అడిగిన నేను—

'దివాణమువారి పెద్దపాఠశాలలో పండితుడను' అని బదులు చెప్పెడి వారు—

చెన్నపట్టణమునుండి, రాజమహేంద్రవరము ప్రభుత్వ కళాశాలకు వారు వీరేశలింగముగారి స్థానమునకు బదిలీ చేయబడిరి. వారా కళాశాలలో నున్నప్పుడు Mark Hunter అను నతడు కళాశాలాధ్యక్షుడుగా నుండెడి వాడు. ఆ కాలమున నిప్పటివలె గాక, కళాశాలాధ్యక్షులు ప్రతిదినము అన్ని తరగతులకు వచ్చి పర్యవేక్షణ చేసెడివారు. ఒకనాడు హంటరు గారు, వెంకటరత్నముగారున్న తరగతికి రాబోవు సమయము వచ్చినది. పంతులుగారది గ్రహించి,

"'బాలులారా! సద్దు సేయకుడు. సద్దుసేయకుడు. మూటియగు (Mark) పోటు వేటకాడు (Hunter) వచ్చుచున్నాడు'—

అని హెచ్చరించెడి వారు. అతడు వచ్చి తరగతి ప్రారంభమగుచున్నప్పుడు తెలుగు పండితు డేమి చేయునో చూతమని నిలువబడెను. కొక్కొండవారు, సేవకునితో

'ఓరి సేవకా! నీవు పోయి రాకపోకల పట్టీ
నిటుదెమ్ము' అన్నారు. రాకపోకల పట్టి

అనగా Attendence Register. హంటరు నవ్వుకొనుచు వెళ్లిపోయెను.

---

7. ఇది క్రీ. శ. 1860–70 ప్రాంతము నాటిమాట—క్రీ. శ. 1909 లో కూడ, నిత్య వ్యవహారమున—నింగ్లీషు భాషాపదములకెట్టి ప్రాముఖ్యత యుండెడిదో—కన్యాశుల్క నాటకమున గిరీశము సంభాషణను బట్టి గ్రహింపవచ్చును—'తెలుగు పుస్తకము, చదువుచున్నప్పుడు నాయనా తెలుగెందుకు ఇంగ్లీషు పుస్తకము చదువు' అన్నరోజులవి—

8. క్రీ. శ. 1940 ప్రాంతములవఱకు ఒక్క కాకినాడలో పిఠాపురము మహారాజావారి కళాశాలలోతప్ప సహవిద్య (Co-Education) ఏ కళాశాల యందులేదు—

అప్పుడు వారి శిష్యుడగు నొక విద్యార్థి లేచి వినయముతో గురువర్యా! దీనికి హాజరు పట్టీ అని కొందరందురు. మీరు రాకపోకల పట్టీ అని వాడినా రేమి అని అడిగెను. ఆయన—'ఏమది: నీవు వచ్చిన యెడల వచ్చినట్లు గుఱుతుండును. లేనిచో లేని యట్లు చిహ్నముండును. అట్టిచో నిది రాకపోకల పట్టీ గాక మఱేమి' అని యుత్తర మిచ్చిరి

ఒకమాఱు, Mr. Stone అను మదరాసు రాజధానీ విద్యాశాఖాధికారి తనిఖీకై రాజమహేంద్రవరము కళాశాలకు వచ్చెను. అతడు M. A (Cantab). M. R. A. S; F. R. G. S., F. M. U. మున్నగు సాంకేతిక పట్టములతో నున్నవాడు. ఈ సంగతి విద్యార్థులకు తెలుపుటకు, అధ్యక్షు డొక—ఉత్తరువు తరగతికి పంపినాడు. ఆంగ్లభాషలో నున్న దానిని తమ పండితు లెట్లు చదివి తమకు విని పింతురో అని కుతూహలులై యుండిరి. కొక్కొండ వారు, తడుము కొనకుండ—

'బహు మహాంగ్లేయాక్షర సాంకేతిక పట బిరుదావళీ విరాజమానులైన—పాషాణనామక ప్రభుత్వ విద్యాశాఖాధికారి[9] వచ్చుచున్నారు' కావున జాగరూకు లరై యుండుడు—అని హెచ్చరించిరి. విద్యార్థు లందరి చమత్కారము గ్రహించి యానందించిరి.

హంటరుగారు, వీరిని తీసికొనివచ్చి—ఈ తెలుగు పండితుని కాంగ్లభాష వచ్చినను, ఆయన ఆంగ్లభాష మాట్లాడడు—అని ఆ విద్యాశాఖాధికారితో చెప్పినాడు.

ఆతడు సరియే మనము Science Laboratories చూతము అని హంటరు గారితో ననెను. కొక్కొండ వారు వెంటనే 'మీరు' 'వైజ్ఞానిక కర్మాగారమునకు వెడలుదురా' అనిరట. స్టోను దొరగారు కొంచెము సంస్కృత వాసనగల వారగుటచేత—నెంతో మెచ్చుకొన్నాడు. మచ్చునకు మాత్రమే యీ ముచ్చటలు.

పారిభాషికపద నిర్మాణము

ఈ నాడు మనము తెలుగు భాషలో ఉన్నత విద్యలో బోధన చేయుచున్నప్పు డావశ్యకత గలిగిన పారిభాషిక పదములను—నూఱేండ్ల క్రిందటనే ప్రచారము లోనికి దెచ్చిన విద్యావేత్త వేంకటరత్నము పంతులు

ఆయన—'ఆంధ్రభాషా సంజీవని' అను తన మాసపత్రికలో రాజకీయ విషయములు ప్రకటించినను, ఆంగ్లభాషా పదములు వాడక, వానికి పారిభాషిక పదములను వాడి వృత్తాంతములు ప్రకటించెడివారు. వారే తొలు దొలుత పత్రికా సంబంధమైన రాజకీయ సంబంధమైన పారిభాషిక పదములను క్రీ. శ 1870 లో సృష్టిచేసి నారు. అవియే నేటికిని వాడుకలలో నున్నవి.

పత్రికా పారిభాషిక పదములు

Editor=సంపాదకుడు
Editorial=సంపాదకీయము
Monthly Magazine=మాసపత్రిక
News paper=వార్తాపత్రిక
News Correspondent=వార్తాపత్రికా విలేఖరి
Public opinion=ప్రజాభిప్రాయము
Readers opinion=పాఠకాభిప్రాయము
Subscription (Monthly)=మాసభృతి
,, (Yearly)=సాలుచందా
Weekly News paper=వారపత్రిక

ప్రభుత్వ కార్యస్థానములు - విద్య

Vice Roy=రాజప్రతినిధి
Governor=రాష్ట్రపాలకుడు
High Court=ఉన్నత న్యాయస్థానము
University=[10]సర్వకళాశాల

---

9. 'అధికారి' అనగా—'అధిక+అరి' అని వారి వ్యుత్పత్తి, అధిక=అధికమైన—అరి=అనగా శత్రువని యర్థము. అది అధికృతే—శబ్దమని వారికి తెలియును. ఆంగ్లాధికారులు దేశభాషల కధికారులే యని ధ్వని.

10. 'పూర్వము యూనివర్సిటీలకు 'విశ్వవిద్యాలయములు' అను వాడుక లేదు. చూ. ఆంధ్ర సర్వకళాశాల వ్యాసము—కట్టమంచి రామలింగా రెడ్డి—ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక—1923.

Inspector of Police=ఆ రక్షక శాఖాధిపతి
Board of Revenue=ద్రైవిన్యాసక సభ
District=మండలము
Collector=కర గ్రాహి
Treasury = కోశాగారము
Treasurer=కోశాధ్యక్షుడు
Cabinet=రాజకీయ సమాలోచన సభ
Translator=భాషాంతరీకరణోద్యోగి
Gezettee=రాజ్యతంత్రవాదిని
District Munsiff = మండల ప్రాడ్వివాకుడు
Pension=ఉపకార వేతనము
Director of Public Instruction=విద్యా విచారణాధికారి

ఇట్టివే గాక యీనాటికి ప్రచారములోనున్న కొన్ని పారిభాషిక పదములు వేంకటరత్నము పంతులు గారివే.

President=సభాధ్యక్షుడు
Secretary=కార్యదర్శి
Meeting=సమావేశము
Speech=అభిభాషణము
Oration=ఉపన్యాసము
Native Citizens=దేశీయ మహాజనులు
National Congress=దేశీయ మహాజనసభ
Museum=చిత్రవస్తు ప్రదర్శనశాల
Welcome address=స్వాగత పత్రము
Widows Home=వితంతు శరణాలయము
Insurance Policy=భీమా పత్రము
Traning School=బోధనాభ్యసన పాఠశాల
Local Boards=స్థానిక సంఘములు
District Boards=మండలస్థ సంఘములు
Municipality=పురపారిశుద్ధ్య విచారణ సంఘము.
Train=ధూమ శకటము; పొగబండి
Railway=అయోమార్గము
Steamer=ధూమనౌక; పొగయోడ
Aeroplane=విమానము

Post Office=పత్రికా ప్రేషణాలయము
Telegram=తంతివార్త

ఇట్లు నిత్యవ్యవహారములో నున్నవానికేగాక మరి కొన్నింటికి, ఆయన పారిభాషికములు నిర్మించి నాడు.

Tennis Court=చత్వరము
Billiards Table=దంతగోళ క్రీడాఫలకము
Military Band=సైన్యవాదిత్రము
Training=క్రమశిక్షణ
Resignation=పరిత్యాగపత్రము
Park=జనోద్యానము
Forester=వనపాలనోద్యోగి
Director of Agriculture=సీతాధ్యక్షుడు
Pump=నీటిగొట్టము
Sea Customs Superintendent=సముద్రశుల్క పర్యవేక్షకుడు
Stamp Offiice=ముద్రాపత్ర కార్యస్థానము
Town Hall=పురమందిరము

పై వానిలో కొన్ని నేడు ప్రచారమున నున్నవి.

పత్రికలలో, ఆంగ్లభాషా పదములు వాడకుండ, పారిభాషిక పదములను, వాడిన కీర్తి కొక్కొండ వారిదే యని క్రీ. శ. 1880 అక్టోబరులో వెలువడిన చింతామణి పత్రిక[11] యిట్లు తెలుపుచున్నది. ఈ నెలలో, వావిలాల వాసుదేవ శాస్త్రిగారు వ్రాసిన 'ఆంధ్రభాష' అను నుపన్యాసమునుండి యీ క్రింది భాగము ప్రకటించుచున్నాము.[12]

---

11. ఈ చింతామణి పత్రిక—రాజమహేంద్ర వరము నుండి ఆంధ్ర భీష్ములు కీ. శే. న్యాపతి సుబ్బారావు పంతులుగారు ప్రకటించెడివారు. కందుకూరి వీరేశలింగముగారు, వావిలాల వాసుదేవశాస్త్రిగారు సహాయులు.

12. మొట్టమొదట తెలుగుభాషలో ఆధునిక భాషాశాస్త్ర పద్ధతులపై వ్యాసము–'ఆంధ్ర భాష' అనునది. వావిలాల వాసుదేవశాస్త్రిగారిది. (1851—1897) వారు భాషాత్రయ విశారదులు. పానుగంటి వారికి గురువులు.

"ఇక్కాలంబున సర్వేసర్వత్ర సమస్త వ్యవహారములయందు ఆంగ్లోపదముల వాడుక దినదినాభివృద్ధి జెందు చున్నది. ఇందువలన తెలుగు భాషకు గలిగెడు ముప్పును మన మింకను గ్రహింప కున్నాము. కవితలలో నీ హూణ భాషా పదములు చోటు చేసికొనుచున్నవన్న ముందెట్లుగా పరిణమించునో తెలియరాదు.

'నియతి ఫస్టెగ్జామినేష నినార్ట్సిచ్చి
బి. ఏ పరీక్షకు వెడలు వాడ'
'ఫస్టాడిటునకునై వచ్చి యకౌంటెంట్లు
స్ట్రిక్టుగా కంపేరు జేయుచుండ'

అను నిట్టిరచనలు చూడ నీ యింగ్లీషు భాషా వ్యామోహము మితిమీఱి పోవుచున్నదని తలంప వచ్చును. ఇకముందీ యాంగ్ల భాషా ప్రవాహము నరికట్టుటకు మనము మహాప్రయత్నము చేయవలసి యున్నది.

ఇట్టి మహాయత్నమును మొట్టమొదట నారంభించి యీ నిమేషము వఱకును 'అహమస్మి'యని పూనుకొను చున్నవారు 'శ్రీయాంధ్ర భాషా సంజీవని' యను మాసపత్రికాధిపతులగు కొక్కొండ వేంకటరత్నము పంతులుగారు. వారు కొన్ని యాంగ్లో పదములకు—సాంస్కృతికములె వాడుచున్నారు. ఆ పర్యాయములు సామాన్యముగా వ్యవహారములో లేని హేతువు చేతను ప్రథమమున దుర్జ్ఞేయములుగాఁ దోచినను రానురాను అవే వ్యవహారములోనికి రావచ్చును. రాజకీయ శాసనములు తెలిఁగించుటలోగూడ నీ పర్యాయ పదములే వాడవలయునని ప్రదేశ ప్రభుత్వమువారి యాంధ్ర భాషాంతరీకర్తగారును గోరబడదగి యున్నారు.

ఈ పర్యాయ పదముల సారస్యము నీ క్రింది వాక్యరచన తేటపఱుపఁగలదు.

మండలములోని సాధారణాంతరిత కరగ్రాహి గారి యధికారము క్రింద యనుగత దండవిధాయి యొకానొక సమాజములో గౌరవ కార్యదర్శిగా నుండి ధన మపహరించినాఁడని, ఆ సభాగ్రాసనాసీనుఁడు గారు విజ్ఞాపనము చేసికొనఁగా, మండల దండవిధాయి యా యనుగత దండవిధాయి నుద్యోగభ్రష్టునిఁ జేయఁగా, నాతండు రాజధానికింబోయి రైవిన్యాస సభికులకుఁ దనపాటు విన్నవించుకొనియె. అంతట వారు మండల కరగ్రాహి చేసిన తీర్పు యుక్తిబద్ధమని యా దండవిధాయికి మరల నుద్యోగ మిప్పించిరి. ఇట్లు విజయ మొందిన యాతండు సర్వకళాశాల పట్టమందిన నేనిటు యవమాన మొంది యూరకుందునా' అని మండల న్యాయాధికారి కార్యస్థానములోఁ గరగ్రాహి మీఁద వ్యాజ్యము వేసి రాజధానినుండి తగు న్యాయవాదిని దెప్పించుకొనియెను. అందులో నుపకార వేతనము గొనుచున్న ఆ రక్షక శాఖాధికారి, వార్తా పత్రికా విలేఖకుఁడు, అసామయిక రాజసేవకుఁ డొక్కఁడు, అయోమార్గ స్థానోద్యోగి, లేఖ్యా రూఢాధికారితోఁ గలిసి యైదుగురు సాక్ష్య మిచ్చి న్యాయము నిలిపిరి.'

ఈ పదములలో గొన్ని వాడుకలోనికి వచ్చుచున్నవి. తక్కినవి కూడ రానే వచ్చును. కాని శాస్త్రీయమైన పదములను గుఱించి, యే మార్గ మవలంబింపవలసినది నిష్కర్షింపవలసి యున్నది.'

పై యుదాహృత భాగమున కొన్నింటి కాంగ్ల పదములను దెల్పిన గాని యర్థము గాదు.

సాధారణాంతరిత కరగ్రాహి=General interim Collector
అనుగత దండవిధాయి=Submagistrate
సమాజము=Association
గౌరవ కార్యదర్శి=Honorary Secretary
సభాగ్రాసనాసీనుడు = President
మండల దండ విధాయి=District Magistrate
ఉద్యోగ భ్రష్టుని జేయు=Suspended from Service
రాజధాని=Capital (Madras)
రైవిన్యాస సభికులు=Members of the Board of Revenue
మండల కరగ్రాహి=District Collector
సర్వకళాశాలా పట్టము=University Degree.
మండల న్యాయాధికారి కార్యస్థానము=District Court

ఉపకార వేతనము=Pension
ఆ రక్షక శాఖాధికారి = Police Department Official
వార్తా పత్రికా విలేఖకుడు=News Correspondent
అసామయిక రాజసేవకుడు=Un Covenanted Civil servant
అయోమార్గ స్థానోద్యోగి=Railway Station Clerk
లేఖ్యారూఢాధికారి=Registar
లేఖ్యారూఢము=Registration

పంతులుగారి ఆంధ్ర భాషా సంజీవనిలో రాజకీయ ప్రభుత్వ సంబంధములైన విషయములన్నియు పై రీతిగానే—ఆంధ్ర పర్యాయ పదములతో నుండెడివి.

ఆంధ్రభాషా సంజీవని పత్రికయందేగాక ఆగాన 'ప్రిన్సువు వేల్సు హిందూస్థాన సందర్శనము' (The Prince of wales visit to India) అను వచన గ్రంథమున నెన్నో ఆంగ్ల పదములకు పారిభాషిక పదములు వాడియున్నారు.

ఈ గ్రంథము 1877 లో ఏడవ ఎడ్వర్డు యువరాజుగా నున్నప్పుడు, మన హిందూదేశము సందర్శించిన సందర్భమున రచితమైనది. ఇది తెలుగున యాత్రా వాఙ్మయము (Tourist Literature) నకు సంబంధించిన మూడవ గ్రంథము. మన వాఙ్మయమున ఇంగ్లండు, లండను మున్నగువాని వర్ణనమీరాయొక్క గ్రంథముననే గలదు. ఇందలి వచన రచన ప్రశస్తమైనది. మదరాసు విశ్వవిద్యాలయమున 1877 లో, ప్రథమశాస్త్ర పరీక్షకు (F. A.) పఠనీయ గ్రంథము. నేడు పునర్ముద్రణము చేయదగినది. (చూడుడు నా పీఠిక 'మా మహారాజావారితో దూరతీరాలు' అను గ్రంథము; కురుమేటి వేంకటరావు గ్రంథకర్త.

కొక్కొండవారి పారిభాషిక పదములు, క్రీ. శ. 1910 వఱకు వ్యాప్తిలో నున్న ట్లీ క్రింది విషయమును బట్టి గ్రహింప వచ్చును.

ఆ సంవత్సరమున — కందుకూరి వీరేశలింగము గారు స్వీయచరిత్ర రచించి, అందుపై పారిభాషిక పర్యాయ పదము లన్నింటిని నుపయోగించి యున్నారు. తెనుగుభాషలోనున్న ఆ పదము లర్థము కాకపోవునను హేతువుచే, వారు—ఆంగ్ల పదములను—రేఖాంకితము గావించినారు—ఉదాహరణకు కొన్ని

వ్యావహారికోన్నత పద పరీక్ష=Civil Higher Grade
దండ శాసనోన్నత పద పరీక్ష=Criminal Higher Grade
రైవిన్యాసోన్నత పద పరీక్ష= Revenue Higher Grade
దండ శాస్త్ర లేఖ్య రక్షకుడు=Criminal Record Keeper
అధికార పత్రము=Warrant
ఆచ్ఛాదన పత్రము=Sealed Cover
దేశ భాషా పర్యవేక్షకుడు=Superintendent of Vernacular Studies.

ఆ కాలమున కళాశాలాధికారు లందఱు ఆంగ్లేయులే—అందువలన కళాశాలలో, దేశ భాషల పర్యవేక్షణకై ఒక ఉపన్యాసకుడు నియమితుడై యుండెడివాడు. ఆతడు సంస్కృతాంధ్రాంగ్ల భాషలు మూడింటియందు ప్రవీణుడై యుండవలెను. సంయుక్త దండవిధాయి (Joint Magistrate) రక్షణ నిధి పుస్తకము (Savings Bank Pass Book.)

వేంకటరత్నము పంతులుగా రిట్లు పారిభాషిక పద నిర్మాణమే గాకుండ, ప్రభుత్వమువా రాంగ్ల భాషలో ప్రకటించిన—(Standing Orders of the Board of Revenue) అను గ్రంథమును—'రైవిన్యాస సభవారి స్థిరాజ్ఞలు' అని తెనుగున కనువదించినారు.

ఇంత విపులముగా నీ విషయమై ప్రస్తావించుటకు హేతు వున్నది. ఈనాడు నవ్యాంధ్ర సాహిత్య చరిత్రలలో గాని, పత్రికలలో గాని—భాషా విషయిక చర్చలందు గాని కొక్కొండవారిని గూర్చిన పై విషయము లేనే లేదు.

అన్నింటికన్న వింత—కందుకూరి వారినిగూర్చి విశ్వవిద్యాలయములలో జరిగిన పరిశోధనా గ్రంథమున గూడపైని నేను వ్రాసిన విషయములు మృగ్యములు.

కొక్కొండవారి జీవిత చరిత్ర గాని ఆంధ్ర

భాషా సంజీవని, చింతామణి పత్రికలను గూర్చి గాని[13] యీనాటి వారి కెవ్వరికి తెలియదనుటలో నతిశయోక్తి లేదు. ప్రాచీనతను విస్మరించిన నవ్యత ప్రతిపాదించిన వీరేశలింగము గారికే ఆంగ్లభాష వచ్చుననియు, ప్రాచీనాచార పరాయణులగు కొక్కొండవారికి—అస లాంగ్ల భాషయే రాదనియు నీనాటి వారి యభిప్రాయము.

ఇప్పటికి నూరేండ్ల క్రిందటనే—ఆంగ్లభాషకు తిలోదకము లిచ్చిన కొక్కొండ యీనాడు విస్మృతుడగుటలో వింత లేదు. మన కీనాడు కావలసినది—ప్రాచీనతతో ప్రసక్తి లేని నవ్యత—కందుకూరికి ముందు ప్రాచీన నవీనతలను సమన్వయము చేసిన కొక్కొండ ప్రత్యేక యుగ కర్తృత్వము గ్రహింపజాలక—గురుజాడ అప్పారావు కన్యాశుల్కము పీఠికలో కేవలము వ్యావహారిక భాషను పురస్కరించుకొని—

'The only exception is Mahamahopadhyaya Kokkonda Venkataratnam, who cannot with stand two things in this other wise perfect world-Social Reform & Spoken Telugu.' అని వ్రాసి యున్నాడు. ఇక ముందైన నవ్యాంధ్ర సాహిత్య, చరిత్రకారులు పై విషయములను గుర్తించి, ఆ చరిత్రను నవనవోన్మేషము చేయుదురు గాక.

ఆంధ్రపత్రిక — కొక్కొండవారు

కైలాసవాసి కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారు క్రి. శ. 1909 లో ఆంధ్రపత్రికను స్థాపించునపుడు కొక్కొండవారి 'ఆంధ్రభాషా సంజీవనియే' ఆదర్శమైనది.[14] తెలుగున—'ఆంధ్ర' అను పేరుతో వెలువడిన మొదటి పత్రిక—ఆంధ్రభాషా సంజీవని—అదియు గాక నవ్యయుగ సాహిత్యశాఖలో నొకటియైన పత్రిక — కేవలము రాజకీయముగా ప్రచారమగుచున్నప్పుడు, దానియందు, మత సాంఘిక భాషా సాహిత్య వ్యవస్థలకు సమాన స్థానము గల్పించి—ఆంధ్ర జాతీయతకు ప్రతీకముగా నొనర్చినది ఆంధ్రభాషా సంజీవనియే—అందలి భాష సలక్షణమగు గ్రాంథికభాషయగుటచే నా పత్రిక సాహిత్య స్థాయి నందుకొన్నది.

నాగేశ్వరరావు పంతులుగారు సంజీవని పత్రికా పద్ధతులలో రాజకీయ సాంఘికార్థిక సారస్వతాది సకల వ్యవస్థలకు స్థానము గల్పించి—సలక్షణ గ్రాంథిక భాషలోనే పత్రిక ప్రారంభించినారు. ఆంధ్రపత్రిక పత్రికగా మారుటవరకును—కాశీనాథునివారు, గ్రాంథిక భాషకు ముఖ్యచిహ్నములైన అర్ధానుస్వార శకట రేఫలను చక్కగా పాటించుచు సలక్షణ గ్రాంథికభాషనే సంపాదకీయములను వ్యాఖ్యలను వ్రాసిరి. అంతే కాదు సంవత్సరాది సంచికలయందు ప్రస్తావనలలోను, వ్యాసములలోను—అరసున్న శకటరేఫలను వాడిరి.

వ్యావహారిక భాష

గిడుగు పంతులుగారి వ్యావహారిక భాషా వాదమును కొక్కొండవారివలె, నాగేశ్వరరావు పంతులు గారును నంగీకరింప లేదు. గిడుగువా రాంధ్రపత్రిక సంపాదకీయముల భాష మార్చుమన్నను వారు మార్చ లేదు. గ్రాంథిక భాషలోని అర్ధానుస్వారములు, శకట రేఫలు తీసివేసి, ప్రసన్న గంభీరము, సలక్షణమునగు గ్రాంథికభాషను పత్రికా భాషగా రూపొందించి, కేవల జాతీయ వ్యవస్థలనే గాక జాతీయ, అంతర్జాతీయ, వైజ్ఞానిక, సకల వ్యవస్థలను, నిరూపింపజాలిన, రచనా రీతిని సృష్టించినది నాగేశ్వరరావు పంతులు గారే. పత్రికలయందు నైతికాధ్యాత్మిక విషయములకు ప్రాధాన్య మిచ్చిన పత్రికా భాషా పితామహులు పంతులు గారే—భారత స్వాతంత్ర్య సమర ఫలితమగు గాంధీ సాహిత్యమును, ఆంధ్రపత్రిక మూలమున వా రెట్లు ప్రపంచితము చేసినది ముందు చదువుదము.

---

13. తెలుగున గల సాహిత్య పత్రికలను (Literary Journalism) గూర్చి యీ క్రింది నా ఆంగ్ల వ్యాసమును చూడనగును.

Studies in the History of Telugu Journalism V. R. Narla Shashtyabda purti Commemoration Volume. 1968.

14. ఈ విషయము ఆంధ్రపత్రిక ప్రథమ సంవత్సరాది సంచికలో వివరింపబడినది. కొక్కొండవారి ఆంధ్రపత్రికా పద్య ప్రశంసతో నది ప్రారంభము—నాగేశ్వరరావు గారికి కొక్కొండవారి యందు భక్తి ప్రపత్తులు గలవు. వారు 14-1-1915 నాడు చనిపోయినపుడు నాగేశ్వరరావు గారు సంపాదకీయము వ్రాసినారు. వాని నిట విస్తరించుటకు వీలులేదు.

పేరు లేని పాప

శ్రీ వి. మోహన ప్రసాద్

ఈ వేకువ మెత్తని వేగంలో
చేతుల మీద ఓ చలి పంచె కప్పుకొని
చివరికి బుల్‌డాగ్ కూడా లేని ఎవరి
నిర్జన ముఖద్వారం ముందో
విసర్జించి వస్తానీ పొత్తిళ్ళ పాపాయిని
ప్రేవుల వస్త్రాల మూటని
కక్కుటిల్లి ఏడ్వగలదేమో
నా కన్నీటి స్వప్నాల వేకువ
'నా పుట్టుక దూసి పోను' !

ఈ వేకువ మంచుకి తడిసిన మామిడి చివురాకు జార్చిన వెలిసిన వెన్నెలలో
కాలు జారిన కవి
ఈస్ట్‌లాండ్స్ రోడ్డు మీద రాలిపడిన పాపీ పువ్వు కంటుకున్న తారు మరకని
ముక్కుకి రుద్దుకొంటూ
ప్రాతః సాగర సంగీతాలాలపిస్తున్న ట్రాన్సిస్టర్‌ని లాల కొడ్తూ
తొలి వేకువలోనే పొగలు గక్కుతున్న తేనీటి వాసన పీల్చుకొంటూ
ఫ్లాస్క్‌లో పోసుకొన్న విస్కీని కస్కీగా నములుతూ
రాస్తున్న వ్యాసార్థం మధ్యలోంచి పద్యం పరిధిలోకి పడుతూ
సర్రియావస్థలో – రాయనన్న ఎర్ర సిరా పెన్ను
నోమాన్స్ ల్యాండ్‌లో ఒక్కసారే కక్కి
ఎన్నాళ్ళగానో కవితా భ్రూణ హత్యల్ని చేస్తూ వస్తున్న నాకు
జోష్ నట్టాల్, విలియం వాంట్లింగ్, ఎలన్ జాక్సన్ లాంటి
రౌడీ కవులు నడిబజారు గాడిదలు ఏడుస్తున్న ఏడ్పుల
పుస్తకాలలోంచి ఎప్పుడో కన్పిస్తే
ఓర్నాయనోయ్
నే నొక్కడ్నే గాదు నాలాంటి వాళ్ళు ఇంకా ఎందరోనని —
మైసూరు ప్రకాశవంత బృందావనంలా
గుంటూరు పుగాకు కంపెనీలు
ఇరవై ఐను వసంతాల స్వాతంత్ర్య కాడలుగా కన్పించి
ఈ కని పారేసిన శిశువుని
ఏ అచ్చాఫీసు గుమ్మానో ఉంచి వస్తాను.
వచ్చే అచ్చు సమయానికి
ఈ పద్యం పాలకోసం ఏడుస్తుంది.

'వచన పద్యం' పద్యమే

శ్రీ సంపత్కుమార

వచన పద్యంయొక్క ఛందస్త్వాన్ని గూర్చి ప్రస్తుతం సాగుతున్న చర్చలో* శ్రీ చేకూరి రామారావుగారూ, నేనూ విభేదిస్తున్న అంశం ప్రధానంగా వచన పద్యం యొక్క పాద బద్ధత. వచన పద్యం పద్యం కావటానికీ, గద్యం కాక పోవటానికీ నేను ప్రతిపాదించిన అంశాల్లోనూ, శ్రీ రామారావు నిరాకరిస్తున్న అంశాల్లోనూ—ఆయన—అన్నట్టుగానే—'వచన పద్యానికి ప్రతిపాదించిన పాద బద్ధత అనేది కేవలం ఒక అంశం మాత్రమే కాక, చాలా కీలకమైనది కూడా.' అందుకే వచన పద్యాన్ని 'పద్య' మంటున్న నేనూ, కాదు, 'గద్య' మంటున్న శ్రీ రామారావూ ఆ 'పాదబద్ధత'ను గూర్చే విశేషంగా చర్చించటం. అయితే, ఈ పాద బద్ధతను గూర్చి మళ్లీ వివరించి, శ్రీ రామారావు నన్ను నిగ్గదీసిన అంశాలను విశదీకరించటానికి, కొన్ని అంశాల విషయంలో నాపై మోపిన బాధ్యతను నిర్వర్తించటానికి ముందు, 'పాదం'యొక్క 'అంతర్నిర్మాణం' గూర్చి ఆయన చెప్పిన అంశాలను పరిశీలిస్తాను.

అసలు, పద్యం అనగానే, ఆ 'పద్యపాదానికి అంతర్నిర్మాణమూ, బాహ్య పరిమితి ఉండాలనీ రామారావుగారి వాదం. ఆయన తన మొదటి వ్యాసంలోనే ప్రస్తావించిన ఈ రెండంశాల్లో బాహ్యపరిమితి విషయం అట్లా ఉండగా, అంతర్నిర్మాణం గూర్చి నా జూలై '72 వ్యాసంలో కొంత వివరించి '—గణాల దృష్ట్యా పాదానికి అంతర్నిర్మాణమంటూ ఏదీ ఉండదు' అని తేల్చి చెప్పటం జరిగింది. ఇక్కడ 'గణాలదృష్ట్యా' అనటానికి కారణం, శ్రీ రామారావు తమ మొదటి వ్యాసంలో— 'పాదం అక్షర సముదాయం కాదు, గణ సముదాయం. అంటే, పాదానికి అంతర్నిర్మాణం ఉన్నదన్నమాట' అని గణాల దృష్ట్యా ఈ 'అంతర్నిర్మాణం' ప్రతిపాదించటం. అయితే శ్రీ రామారావు తమ రెండవ వ్యాసంలో మళ్లీ ఈ అంతర్నిర్మాణాన్ని గూర్చి విస్తారంగా వ్రాసి' 'గణాల దృష్ట్యా పాదానికి అంతర్నిర్మాణమంటూ ఏదీ ఉండదు' అన్న సంపత్కుమార వాక్యం వృత్తాలకు మాత్రమే అన్వయిస్తుంది' అన్నారు. అన్నారు.† అంటే, వృత్తాలకు సంబంధించినంతవరకు నాతో శ్రీ రామారావు ఏకీభవిస్తున్నారన్న మాట. కాగా' జాతులకు, మాత్రా పద్యాలకు ఇది (గణ నిర్మాణం) అవసరమని' అంటున్నారు. కాని వాటికికూడా అవసరంలేదు. వివరిస్తాను.

రామారావుగారు వివరించిన రీతినిబట్టి 'అంతర్నిర్మాణం' అంటే, ఒక పద్యపాదానికి విహితమయిన గణాలను, విహితమయిన సంఖ్యతో, విహితమైన క్రమంలో కూర్చటం. అంటే, ఉదాహరణకు, గీత పాదంలో సూర్యేంద్ర గణాలే ఉండటం, వాటిలోనూ

---

* ప్రస్తుత చర్చకు మూలమయిన వ్యాసాలివి.

1. వచన పద్యం : ఆభాస లక్షణ నిరాకరణం' శ్రీ చేకూరు రామారావు (ఆంధ్రపత్రిక పరీధావి ఉగాది సంచిక) ఇది రామారావుగారి మొదటి వ్యాసం. వచన పద్యాన్ని గూర్చిన నా పూర్వపు వ్యాసాల రెఫరెన్సులు ఈ వ్యాసంలో ఉన్నాయి.

2. వచన పద్యం : లక్షణ నిరూపణం— శ్రీ సంపత్కుమార. (భారతి జూలై' 72)

3. 'వచన పద్యం' ఛందోవిభాగం కాదు— శ్రీ చేకూరి రామారావు. (భారతి, నవంబరు' 72) ఇది రామారావుగారి రెండవ వ్యాసం.

† ప్రత్యేకంగా చెప్పబడినప్పుడు తప్ప, ఉటంకింపులన్నీ రామారావుగారి రెండవ వ్యాసానికి సంబంధించినవి.

సూర్యగణాలు మూడూ, ఇంద్రగణాలు రెండు మాత్రమే ఉండటం, అవికూడా 1 సూర్య + 2 ఇంద్ర + 2 సూర్య—అన్న క్రమంలో కూర్చబడటం—ఇది గీత పాదపు అంతర్నిర్మాణ మన్నమాట. మరి వృత్తాల విషయంలోనూ ఇంతేగదా! భ—ర—న—భ—భ ర—ల గ—అన్న గణాలను అదేక్రమంలో కూర్చటం ఉత్పలమాలా పాదపు 'అంతర్నిర్మాణం' అన్నమాట గదా! (వృత్తాలకు గణనిర్మాణం అక్కరలేదనటం తరువాతిమాట. ఉంటే ఇంతేమరి) కాని 'గణపద్ధతి' రాకపూర్వం ఉత్పలమాలా పద్యరచన సాగటం, దానికి అక్షరాల సాయంతో లక్షణం చెప్పటం జరిగింది. (ఇక్కడ ఉత్పలమాల వృత్తాలకు ఉపలక్షకం.) భరతాదు లిట్లాగే చెప్పినారు. కాగా అనాడది గణ సముదాయం కాదు. అక్షర సముదాయమే. (ఈ అంశం నా జూలై 72 వ్యాసంలో వివరింపబడింది.) మరి ఈ పద్ధతిలో జాతులకు లక్షణం చెప్పటం కుదురదా! కుదురదని రామారావుగారి అభిప్రాయం. ఎందుకంటే, వృత్తాల్లోని పాదాలన్నిటిలోనూ (విషమవృత్తాల్లో తప్ప) అక్షరసంఖ్య, గురు లఘుక్రమమూ సమంగా ఉంటుంది కాని, జాత్యాదుల్లో ఉండటం నియతం కాదు. అందువల్ల—'జాతుల్లో పాదాల అంతర్నిర్మాణాన్ని బాహ్యపరిమితిని అక్షరాల సాయంతో ఏకైక పద్ధతితో చెప్పలేము' కాబటి సూర్యేంద్ర చంద్ర గణాలు జాతుల అంతర్నిర్మాణం...లక్షణం చెప్పటానికి తప్పనిసరి—ఇది రామారావుగారి వాదం.

మరి జాతుల్లో ఉపయోగానికని చెప్పబడుతున్న గణాల పరిస్థితిని చూద్దాం. ఈ చెప్పబడుతున్నవి సూర్యేంద్ర చంద్రగణాలు. వీటిని 'మాత్రా గణాలు' అంటారు. అంటే, వీటిలో గురు లఘు క్రమం నియతం కాదు. సూర్య—ఇంద్ర—చంద్ర అన్నవి మూడు గణ వర్గాలు. ఈ వర్గాల్లో వరుసగా 2—6—14 గణా లుంటయి. అయితే ఆయా వర్గాల్లోని ఆయా గణాలన్నీ సమం కావు. ఉదాహరణకు ఇంద్రగణా లారింటిలో రెండు (నల—భ) చతుర్మాత్రా గణాలు కాగా, నాలుగు (నగ—సల—ర—త) పంచమాత్రా గణాలు. అట్లాగే మూడు (భ—ర—త) మూడక్షరాల గణాలు కాగా, మిగిలిన మూడు (నల—నగ—సల) నాలుగక్షర గణాలు. అంటే, ఈ ఆరింటికీ మాత్రా సంఖ్యలో కానీ, అక్షర సంఖ్యలో గానీ సమత్వం లేదన్న మాట. మిగిలిన వర్గాల స్థితి కూడా దీనికి భిన్న మేమీ కాదు.

మరి ఈ గణాల స్వరూప స్వభావాలను బట్టి చూస్తే, ఈ అసమగణాల కూర్పుతో అంతర్నిర్మాణం కలిగించు కొంటాయని చెప్పబడుతున్న ఈ పద్యాల 'గతి' ఏమిటో, దురూహ్యం. ఎందుకంటే, ఉదాహరణకు గీత పాదంలో త్ర్యస్ర, చతురస్ర, ఖండగతులకు చెందిన మాత్రాగణాల కలగలుపు నిర్దిష్టమయింది. ఇదయినా ఒక వరుసలో కాక, ఆద్యంతాల్లో త్ర్యస్ర గతి (సూర్య) గణాలు, మధ్యలో చతురస్ర, ఖండగతి (ఇంద్ర—ఈ గణాల్లో రెండు గతుల గణాలు కలిసి ఉన్నయి) గణాలు. కాగా వీటిలో గతి కానీ, లయ గానీ నిర్దేశింపబడలేదని చెప్పవలసి ఉంటుంది. మరి ఈ నిర్దేశం లేనప్పుడు—(ఉన్నప్పుడు గణాల అవసరం గూర్చి రామారావు గారు మాత్రాపద్యాల సందర్భంలో చెప్పినారు. అక్కడ ఆ విషయం పరిశీలిస్తాను.) ఈ గణాల ప్రయోజనం ఏమిటి? ఏమిటంటే—రామారావు గారి మాటల్లో 'అంతర్నిర్మాణ బాహ్య పరిమితుల'ను 'ఏకైక పద్ధతి'లో చెప్పటమే. మరి అంతర్నిర్మాణ మంటే, ఈ గణాల కూర్పే కదా! కాని ఆ గణాల పరిస్థితి అట్లా ఉన్నది. ఆలోచిస్తే, లక్షణ కథనంలోని సౌలభ్యం కోసమే ఈ 'గణ పద్ధతి' అని స్పష్టం. మరి ఈ గణాల సాయం లేకుండా లక్షణం చెప్పవచ్చు. అప్పుడీ గణాల ద్వారా అంతర్నిర్మాణం ప్రసక్తి ఉండదు. గణ సహాయ విరహితంగా లక్షణం చెప్పవచ్చుననటానికి ఉదాహరణగా గీత పద్యానికి చూపిస్తాను.

గీత పాదంలో 17 నుండి 19 దాకా మాత్రా సంఖ్య ఉంటుంది. అంటే, 17—18—19 మాత్రా సంఖ్యతో ప్రస్తుత గీత పాదాలు మూడు విధాలుగా రూపొందుతాయన్న మాట. (పాదానికుండే మూడు సూర్య గణాల మాత్రా సంఖ్య $3 \times 3 = 9$. వీటికి, ఉండవలసిన రెండింద్ర గణాల మాత్రా సంఖ్య $4+4=8$ కానీ, $4+5=9$ కానీ, $5+5=10$ కానీ మాత్రలు చేరటంవల్ల ఈ మూడు రకాల పాదాలు. 4+5

అన్నది 5+4 కూడా కావచ్చు) 18 మాత్రా సంఖ్యతో ఏర్పడే గీత పాదం రెండు రకాలుగా ఉంటుంది. కాని మొత్తం నాల్గువిధాలు. అవి ఇట్లా ఉంటాయి.

1 వ విధం పాదం	11+6=17	మాత్రలు
2 వ విధం పాదం	13+6=19	మాత్రలు
3 వ విధం పాదం	12+6=18	మాత్రలు
4 వ విధం పాదం	12+6=18	మాత్రలు

(11+6 అంటే 11 మాత్రల తరువాత యతి చెల్లించవలసి ఉంటుంది. మరొకటి. 11 వ మాత్ర, దాని తరువాతి మాత్రతో కలిసి గురువు కారాదు. 13+6, 12+6 ఉన్నప్పుడుకూడ ఇంతే.)

ఈ నాలుగు విధాలకూ సామాన్య లక్షణాలు :

(1) పాదం ఎప్పుడూ గుర్వంతం కారాదు.

(2) ఏ పాదంలోనూ 2+3, 3+4, 5+6 ఈ మాత్రలు కలిసి గురువు కారాదు. వివిధ పాదాలకు ప్రత్యేక లక్షణాలు:—

1 వ విధం పాదం—

(1) 7+8, 9+10, 13+14, 14+15 ఈ మాత్రలు కలిసి గురువు కారాదు.

(2) రెండు గురువులు వరుసగా ఉండరాదు.

2 వ విధం పాదం—

(1) 8+9, 10+11, 15+16, 16+17 ఈ మాత్రలు కలిసి గురువు కారాదు.

(2) 4+5 కానీ, 9+10 కానీ మాత్రలు కలిసి గురువయితే, దాని తరువాత వరుసగా మూడు లఘువు లుండరాదు.

(3) 4 నుండి పదమూడు మాత్రల వరకు వరుసగా 5 లఘువు లుండరాదు.

3 వ విధం పాదం—

(1) 7+8, 9+10, 14+15, 15+16 ఈ మాత్రలు కలిసి గురువు కారాదు.

(2) 1 నుండి 7 మాత్రల దాక వరుసగా రెండు గురువు లుండరాదు.

4 వ విధం పాదం—

(1) 8+9, 10+11, 14+15, 15+16 ఈ మాత్రలు కలిసి గురువు కారాదు.

(2) 9+10 కలిసి గురువైతే, 11+12 కలిసి గురువు కారాదు.

గీతపద్యం ఇట్లా నాలుగు విధాలు కాగా, పద్యంలోని అన్నిపాదాలూ ఏదో ఒకే విధానికి చెందినవి కావలసి ఉంటయి. కాని గీతపద్యాలిట్లా ఉండటం లేదు. అందువల్ల నీటి కలగలుపుతో 'గీత' పద్య ముంటుం దనవచ్చు. కలగలపు రూపానికి 'గీతం' అని పేరుంటే, కలగలుపులేని రూపాలకు నాల్గు వేరు వేరు పేర్లు గుర్తింపుకోసం సంకేతించితే స్పష్టత అధికమయితుంది. నాల్గు విధాలకూ ఒకే చోట చెప్పటంవల్ల దీర్ఘంగా ఆభాసిస్తున్నది లక్షణం. కాగా ఈ 5 విధాలను (కలగలుపు రూపంతో సహా) మనం 'గీతం' అని ఒక పేరుతోనే వ్యవహరించటం జరుగుతున్నదన్న మాట.

వృత్తాల్లో గురు లఘువుల్ని ప్రధానీకరించటం వల్ల, వాటిని పేర్కొని (గణ సహాయం లేకుండా) లక్షణం చెప్పటం జరిగింది. మరి ఈ పద్యాల్లో మాత్రల్ని ప్రధానీకరించటంవల్ల, వాటి ఆధారంతో చెప్పటం జరిగింది. మాత్రల కలయికల నిషేధం లేని చోట్ల, కలిసి గురువు కావచ్చు, కాకపోవచ్చు.

గణ సహాయం లేకుండా ఈ పద్యాలకు కూడా లక్షణం చెప్పటానికి వీలున్నదని చూపటానికే పయి పద్ధతి ప్రదర్శింపబడింది. మరి ఈ పద్ధతి సరి క్రొత్త దేమీ కాదు. వైతాళీయ పద్యాలకు పింగళుడు ఈ ధోరణిలోనే లక్షణం చెప్పటం జరిగింది. వైతాళీయ లక్షణం ఇది—

i బేసి పాదాల్లో 14 మాత్రలు, సరి పాదాల్లో 16 మాత్రలు.

ii పాదాలు గుర్వంతం కావలసి ఉంటుంది.

iii సరి పాదాల్లో సరి+బేసి మాత్రలు కలిసి గురువు కారాదు.

iv సరి పాదాల్లో ఆరు లఘువులు వరుసగా ఉండరాదు.

v బేసి పాదాల్లో 6 మాత్రల, సరి పాదాల్లో 8 మాత్రల తరువాత యతి చెల్లింపు.

కొన్ని మాత్రలు కలిసి గురువు కావటం అనే అంశంలోని వ్యత్యాసాన్నిబట్టి వైతాళీయ భేదాలు కొన్ని ఏర్పడ్డాయి. అట్లాగే ఈ భేదాల పాదాల కల గలుపుతో మరికొన్ని భేదాలు. అన్ని భేదాలకూ, ప్రాచ్య వృత్తి, ఉదీచ్యవృత్తి, చారుహాసిని ఇత్యాదిగా వేరు వేరు పేర్లు. (వివరాలకు చూ. పింగళుని 'ఛంద శ్శాస్త్రమ్' అధ్యా. 4. సూ. 32—41) పైన గీత పద్యానికి లక్షణం చెప్పిన పద్ధతి ఈ ధోరణి లోదే. భ—ర—తేత్యాది గణాలను రూపొందించిన పింగళుడే ఈ విధంగా గణ సహాయం లేకుండా ఈ పద్యాలకు లక్షణం చెప్పినాడు. అందువల్ల గీతాదుల కీ పద్ధతిని అన్వయింప జేయవచ్చు. చేస్తే ప్రస్తుత గీతాదుల్లో వైవిధ్యం అధికమయితుంది. కలగలుపు లేని రూపాలు కూడా ఏర్పడతయి.

ఇక రామారావు గారు అంటున్న మాత్రా పద్యాలకు కూడా ఈ పద్ధతిని అన్వయింప చేయవచ్చు. గీతాదుల ఉపయోగానికి చెప్పబడ్డ వాటిని 'మాత్రా గణాలు' అన్నట్టుగా వీటిలోని వాటిని 'మాత్రా సంఖ్యా గణాలు' అంటారు. అంటే వాటిలోని మాత్రా సంఖ్యా వైషమ్యం వీటిలో ఉండదు. 3–4–5–7 మాత్రా సంఖ్యతో ఈ గణాలు ఏర్పడుతయి. ఒకే పాదంలో ఉండే గణాలన్నీ సమమాత్రా సంఖ్య కలవయితయి.ఉదాహరణకు మధురగతి రగడలో పాదానికి నాల్గు చతుర్మాత్రా గణాలుంటాయి. నాలుగు మాత్రలుండటమే తప్ప గురు లఘు క్రమంతో వీటికి నిమిత్తం లేదు. ఇట్లాగే అన్నీ. 7 మాత్రలగణమంటే 3+4 లేదా 4+3 మాత్రాసంఖ్యా గణాల—అంటే—త్ర్యస్ర—చతురస్ర గతిగణాల సమ్మేళనం. అందుకని దీన్ని మిశ్రగతి అన్నారు. కాని ఈ మిశ్రత్వం మిగతా వాటిలోనూ ఉన్నది. ఉదాహరణకు పంచమాత్రా గణాల్లో 2+3 లేదా 3+2 గా కూడా ఉండవచ్చు. అయితే మూటి కన్నా తక్కువ సంఖ్యలో మాత్రలున్నప్పుడు వాటికి గణ పరిగణనం లేదు. అందువల్ల వీటిని 'మిశ్రగతి' అనలేదు. అయితే. ఈ మిశ్రత్వం దృష్ట్యాచూస్తే, పాదం మొత్తంమీద ఉండే మాత్రా సంఖ్య ప్రధానమై అవి అచ్చంగా ఏ సంఖ్యలో విరుగాల్సన్నది పాక్షికమయి తున్నది.

అయితే, 'మాత్రా ఛందస్సుల్లో లయ ప్రధానం. ఈ లయ మాత్రాగణానుసారి. లయ ననుసరించి మాత్రాపద్యాల అంతర్నిర్మాణాన్ని చెప్పలంటే, మాత్రా గణాలను గుర్తించక తప్పదు' అంటారు రామారావు గారు. అంతేకాదు. పాదం మొత్తానికైన మాత్రా సంఖ్యనుబట్టి లక్షణాన్ని చెప్పిన వారిని ప్రస్తావించి 'ప్రాచీనులు కొందరు మాత్రా పద్యాలకు లయ విరహితంగా లక్షణం చెప్పారు. అంటే మాత్రా పద్యాల్లో అంతర్నిర్మాణాన్ని గూర్చి వాళ్లు పట్టించుకోలేదన్న మాట. ఆ మేరకు వాళ్ల లక్షణం అసమగ్రం' అని తీర్మానించి నాను. ఈ తీర్మానాన్ని అనుసరించి, గణ సహాయం లేకుండా లక్షణం చెప్పటం, 'లయ విరహితంగా' చెప్పటమయితుందన్న మాట. ఎందుకంటే, 'లయ మాత్రాగణానుసారి'. అయితే వెనుక చూపిన వైతాళీయాలు మాత్రా ఛందస్సులే. వాటికి గణాలను చెప్పలేదు కాబట్టి, లయ దృష్టి వారికి లేదనటం కుదురుతుందా? లయమీది దృష్టి లేకుంటే, ఫలానా మాత్రలు కలువ రాదు; వరుసగా ఇన్ని లఘువులుండ రాదు. ఇత్యాదిగా చెప్పటమెందుకు? నిజానికి ఇట్లా చెప్పటం లయను ఉద్దేశించి మాత్రమే. మాత్రాగణాలను చెప్పినంతమాత్రాన 'లయవిరహితం'కాదు. లయ, మాత్రల కలుపు—విడుపులవల్ల వస్తుందికాని కేవలం మాత్రాగణాలుండటంవల్లనే కాదు. ఇంకో గమనించవలసిన అంశమేమిటంటే, మాత్రాగణాలను చెప్పటంవల్ల ఎదురునడిచే—అంటే, విలోమగతిక (లగ—జ-య) గణాలను నిషేధించవలసి వచ్చింది. గణాల ప్రమేయం లేకుంటే ఈ నిషేధింపు అవసరం లేదు. పాదగమనంలో విలోమగతి వెంటనే పట్టిస్తుంది. విలోమగతి అవసరమనుకుంటే, కవి సాధిస్తాడు, కాదనుకుంటే వదిలివేస్తాడు. గణాలను చెప్పినా గూడా, పాదంలోని ప్రత్యేక సంఖ్యామాత్రలు కలిసి గురువు కావటంవల్లనే విలోమగతి కానీ, అనులోమగతి కానీ వచ్చేది. గణాలను చెప్పటంవల్ల విలోమగతి సాధించాల్నుకొన్న కవి లక్షణాతి క్రమణం

చేసిన వాడయి తున్నాడు. 'నేటి కవుల్లో శ్రీ శ్రీ పద్యాల్లో ఇల్లాంటి వ్యతిక్రమణలు కనిపిస్తై' అని గణాల దృష్టితో అనవలసి వచ్చిందితప్ప, పాదమాత్రా సంఖ్యా దృష్ట్యా అనవలసిన అవసరం లేదు. అందుకే లాక్షణికుల గణాలెట్లాఉన్నా, కవులు విలోమగతిని సాధిస్తూనే ఉన్నారు. ఇదిట్లా ఉండగా, అనులోమగతికమయిన 'నల'మునకు విలోమ గతికమయిన 'జ' గణగమనం సాధించవచ్చునని, ఇట్లాంటి 'నల'మును 'జగణతుల్య నల' మనవచ్చునని శ్రీ గిడుగు సీతాపతి గారు సూచించినారు. (చూ. తెలుగులో ఛందోరీతులు. పు. 141) అంటే, గతిసాధన కవికి సంబంధించిందే కాని, అచ్చంగా గణాలకు సంబంధించింది కాదని స్పష్టమయితుంది.

మరొకటి. విలోమగతిని లాక్షణికులు నిరాకరించలేదు కూడా. దీనికి ప్రత్యక్షసాక్ష్యం కంద పద్యం. కందపద్యంకూడా మాత్రా ఛందస్సే ఒక విధంగా. (కందం పూర్వార్ధాన్ని 3/5 గణాలుగా కాక 4/4 గణాలుగా విభజించి రెండు పాదాలనుకుంటే—మాత్రా ఛందస్సే.) గీతాదుల్లోని మాత్రా గణాల్లోని మాత్రా సంఖ్యా వైషమ్యం కందగణాల్లో లేదు. కందగణాలు చతుర్మాత్రాగణాలు. గగ—నల—భ—జ—స లనుమించి చతుర్మాత్రా గణాలు లేవు. అన్నీ చతుర్మాత్రా గణాలు కావటంవల్ల కందం చతురస్ర గతిపద్య మని స్పష్టం. మరికందగణాల్లో విలోమగతికమయిన జగణాన్ని లాక్షణికులు విధించినారు. ఆరవ గణంగా నలమైనా, లేక జగణమైనా ఉండాల్ననని నియమం చేసినారు కూడా. అంటే నాలుగు లఘువులయినా వరుసగా ఉపయోగించాలె, లేదా విలోమగతి నయినా సాధించాలె నని స్పష్టం చేసినారు. సరిగణంగా జగణోపయోగాన్ని అంగీకరించి నారు. మరీ నియమాలన్నీ దేన్నిబట్టి? కవి ప్రయోగాలను బట్టే ఇదిట్లా ఉండగా, చతురస్ర గతికమయిన కందాన్ని తదితర గతుల్లో నడిపిన కవులు బోలెడు మంది. చతురస్రేతర గతుల్లో నడచిన కంద పద్యాలకు ఉదాహరణలు శ్రీ సీతాపతి గారు చూపించి నారు. (చూ. తెలుగులో ఛందోరీతులు. పు. 138) మరి ఈ అంశా లిట్లా స్పష్టపడుతుండగా,—'ఖండగతిలో 'య' గణాన్ని మిగతా గణాలతోబాటు ప్రసిద్ధులయిన తెలుగు కవు లెవరూ వాడిన ఉదాహరణలు లేవు' అంటారు రామారావు గారు. ఇక్కడ 'ఖండగతి' 'యగణం' అన్నవి ప్రధానం కాదు. విలోమగతికమైన గణాలను వాడలేదనటం ప్రధానం. ఖండగతి విషయం ఎట్లా ఉన్నా, చతురస్ర గతికమైన 'మధురగతి' రగడలో పింగళి సూరన్న కళా పూర్ణోదయంలో—

'అహంక్రి — యాత్మక—మగుశం — ఖంబును' (8—238) అన్న చోట 'అహంక్రి' అన్న జగణం ఉపయోగించి నాడు. శ్రీనాథుని ప్రసిద్ధమైన 'మణికర్ణిక' రగడ (కాశీఖండం)లో లాక్షణికుల గణాల దృష్ట్యా సరిపడని పాదాలు చాలా ఉన్నాయి. కాని అవన్నీ మాత్రా సంఖ్యా దృష్ట్యా సరిపడుతయి.

ఇదిట్లా ఉండగా, — 'ఆధునిక కవులు ఒకే గతి ఉండాల్సిన పద్యాల్లో భిన్నగతులు పాటించిన ఘట్టాలున్నై. ఉదాహరణకి 10 మాత్రల బాహ్య పరిమితి గల పద్యాల్లో కొన్నిచోట్ల ఖండగతిని, కొన్ని చోట్ల మిశ్రగతిని (3+4+3) పాటించారు. 12 మాత్రల బాహ్య పరిమితిగల పద్యాల్లో కొన్నిచోట్ల త్రిశ్ర గతి (3+3+3+3) ని, కొన్నిచోట్ల చతురస్ర (4+4+4) గతిని పాటించారు. 16 మాత్రల బాహ్యపరిమితిగల పద్యాలో కొన్నిచోట్ల చతురస్ర గతిని, కొన్నిచోట్ల మిశ్రగతి (5+3 లేక 3+5) ని పాటించారు. ముత్యాలసరాన్ని మాత్రం (3+4+3+4) క్రమంలోనే నడిపారు' అన్నారు రామారావుగారు. అయితే. ఈ 'భిన్నగతులు పాటించిన ఘట్టాలు' ప్రాచీనుల పద్యాల్లోనూ ఉన్నయి. రామకృష్ణుడు ఘటికాచల మాహాత్మ్యంలో

'బొండు-మల్లెలకె పొలతిలో—ముచ్చట
మిండ—తుమ్మెదలు మెలగెడు—నచ్చట'
(2—114)

3+5 గా ప్రయోగించినాడు. మరి 10—12—16 మాత్రల బాహ్యపరిమితి గల పద్యాల్లో వరుసగా ఖండ—త్ర్యస్ర—చతురస్ర గతులుండటం సహజం. మిగిలిన గతులు, 'మిశ్రగతులు' సాధ్యం మాత్రనే. మరి ఈ 3+4+3 అన్న మిశ్రగతి

లయ సూచకమే అయితే, గీతపద్యంలోనూ 3+4+4+3+3 (4+4 కు బదులు 4+5 కానీ, 5+4 కానీ 5+5 కానీ ఉండవచ్చు) ఉన్న పద్ధతిని 'మిశ్రగతిగా' చెప్పవచ్చు. లయ సాధించవచ్చు. గీతాదులకు సూర్యేంద్ర గణాలని చెప్పబడిన కారణంగా మాత్రా సంఖ్యాగణాలు లేవన్న కారణంగా లయ నిర్దిష్టం కాదనటానికి పై పద్ధతిలో వీలు లేదు. కాని వీటిలో లయ అప్రధానమని రామారావు గారు 'మాత్రాపద్యాల్లో లయ ప్రధానం' అని మాత్రా పద్యేతర విని వర్తకంగా చెప్పిన దానివల్ల స్పష్టమయితుంది. ఇక 'ముత్యాలసరం విషయంలో 3+4+3+4 అన్నక్రమం నియతమేమీ కాదు. ఉదాహరణకు ఆరుద్ర రచించిన 'ఎర్రరోజా మొగ్గ' (ఎంచిన పద్యాలు—సంకలనంలో) లో—

'అతడు—తీసిన— బాట—లోనే
అడుగు—వేయుచు—సాగు— చున్నా
అజ్ఞా - తముగ—అతని— కెంద
రభిమాను లున్నారో

మూడవపాదం 4+3+4+3 గా విరుగుతుంది. నాల్గవపాదం 3+4 గా విరగదు. 3+4 మాత్రలు కలిసి 'మా' గురువయింది. ఈ ఖండికలోని ముత్యాలసరాల్లో 'గగం'తో ప్రారంభమయ్యే 4 వ పాదాలు చాలా ఉన్నయి.

'మాత్రా పద్యాలకుమాత్రం లయ నిర్దేశం ఎందుకు చేయాలి?' అని ప్రశ్నించుకొని శ్రీ రామారావు, దానికి సమాధానంగా—'లయ నిర్దేశించక పోతే మాత్రా పద్యాల్లో అంతర్నిర్మాణం ఉండదు. అక్షరక్రమాన్ని నిర్దేశిస్తే, ఇవి వృత్తాలతో సమానమవుతై. ఇంద్ర చంద్రగణాలను నిర్దేశిస్తే అవి జాతుల్లో భాగమవుతై. మాత్రాపద్యాలు ప్రత్యేక ఛందస్సుగా నిలబడాలంటే, వాటి నిర్వచనం మాత్రా గణాల్లోనే జరుగాలి' అని నిశ్చయించినారు. ఈ సమాధానంలో ఒకటి రెండంశాలు గమనించవలసినయున్నయి. అంతర్నిర్మాణం ఉండాలె కాబట్టి లయ నిర్దేశం అన్న భావం పై సమాధానంలో ఉన్నది. కాగా అంతర్నిర్మాణం ప్రధానమై లయ అప్రధానమయితున్నది. కాని లయ ప్రధానం కదా! మరి వీటి నిర్వచనం 'మాత్రాగణాల్లో' కాకుండా చెప్పటానికి వీలున్నదని ఇదివరకే వివరించటం జరిగింది. ఇక 'అంతర్నిర్మాణం' ఎక్కడ? తరువాత, మాత్రా పద్యాలకు అక్షరక్రమాన్ని, ఇంద్రచంద్రగణాల్ని నిర్దేశించటానికి వీలున్నదినీ, అయినాగూడా అట్లా నిర్దేశిస్తే 'మాత్రా పద్యాలు ప్రత్యేక ఛందస్సు' నిలబడలేవనీ స్పష్టం చేసినారు. అంటే వీటి ప్రత్యేకత కోసమే అట్లా నిర్దేశించ గూడదన్నమాట. మాత్రాగణాల నాశ్రయించటం ఇందుకే మరి. లయానుసారిగా, మాత్రా గణ విరహితంగా నిర్వచనం చెప్పితే, అవి 'అంతర్నిర్మాణ' విరహితమయితయి. అదీగాక, వృత్తాలతోనో, 'జాతుల'తోనో ఈ మాత్రా పద్యాలు సమానమయితే మునిగిపోయేదేమిటి? నిజానికి మాత్రాపద్యాల్లో పాదాలన్నిటిలోనూ మాత్రాసంఖ్య సమంగా ఉంటుంది. 3—4—5—7 ఈ అంకెల్లో ఏ ఒకదానితోనో నిశ్శేషంగా విభక్తమయితుంది. వృత్తాల్లోగానీ, గీతాదుల్లోకానీ ఇట్లాకాదు. దీన్ని గమనించి లాక్షణికులు లక్షణ కథనంలో సౌకర్యంకోసం మాత్రాసంఖ్యా గణాలను కుదిరించుకొన్నారు. దీనికి 'రగడ'లను ఉదాహరణలుగా చూడవచ్చు. ఆధునికు లుపయోగిస్తున్న 'మాత్రా ఛందస్సు'లన్నీ రగడ భేదాలే. (ఈ అంశం నా 'తెలుగు ఛందో వికాసం' అధ్యా. 12 లో సోదాహరణంగా ప్రదర్శించి నాను.) ఆ రగడల పద్ధతే వీటికి అనుసృతమయింది. కాని కవులు ఈ గణాలను పట్టించుకోకుండా స్వేచ్ఛగా, పదపు మొత్తం మాత్రా సంఖ్యను మాత్రమే చాలావరకు దృష్టిలో పెట్టుకుని మాత్రలను రకరకాలుగా (3—4—5—7 పద్ధతుల్లోనేకాక) విభజిస్తూ రకరకాల గతుల్ని, తద్వారా లయల్ని సాధిస్తున్నారు. ప్రసిద్ధగేయ కావ్యాల్లో వీటికి బోలెడు ఉదాహరణలు దొరుకుతయి. అందుకని ప్రత్యేకించి చూపటం లేదు.

అసలు ఈ గొడవ అంతా, పాదానికి 'అంతర్నిర్మాణం' ఉండాల్సన్న ప్రీకన్సీవ్డ్ నోషన్‌తో ముందుకు సాగటంవల్లా, ఆ అంతర్నిర్మాణం గూడా గణాలవల్లనే అని నిర్ధారించుకోవటంవల్లా కలుగుతున్నది. చెప్పబడిన గణాల నుపయోగించినంతమాత్రాన

‘గతి’ కలుగదు. శ్రీ వేంకట పార్వతీశ్వరకవుల ‘భావ సంకీర్తనం’లోని సీసపద్యాల్లో, సీసగణాలే ఉపయోగింపబడ్డా కూడా ‘సీసగతి’ వాటికి కలుగలేదు. అట్లాగే లయ సర్వత్రా సిద్ధిస్తుందనటానికి వీల్లేదు. ఇదీ గాక, ‘మిశ్రగతి’ని అంగీకరిస్తున్నప్పుడు ఇక లేనిదేమిటి? అందువల్ల ఏ విధమయిన పద్యపాదానికి గూడా అంతర్నిర్మాణమంటూ ఏదీ ఉండదు. జూలై 72 వ్యాసంలో నేను చేసిన ఈ నిర్ణయాన్ని మార్చుకోవలసిన అవసరాన్ని రామారావుగారు చేసిన అంతర్నిర్మాణం గూర్చిన వివరణ కలిగించటం లేదు. ప్రస్తుతం అమల్లో ఉన్న లాక్షణికుల ‘గణపద్ధతి’నే పాదపు ‘అంతర్నిర్మాణం’గా రామారావుగారు చెప్పుతున్నారు తప్ప వేరేమీ లేదు.

ఇక, ‘వచనపద్య సామాన్య లక్షణాలుగా నేను ప్రతిపాదించిన అంతర్నిర్మాణ బాహ్య పరిమితులను శ్రీ సంపత్కుమార ఎక్కడా స్పష్టంగా నిరాకరించలేదు. అంతర్నిర్మాణం గణాల దృష్ట్యా మాత్రమే లేదన్నారు. పైగా ఆయన, ‘అంతర్విభజన’ అనే మాట, నేనుపయోగించిన అంతర్నిర్మాణం అనే మాటకు సమానార్థకంగానే కనిపిస్తున్నది. ఆయన ప్రతిపాదించిన భావ గణాలకు ఇంతకన్నా వేరే ప్రయోజనం లేదు’ అంటారు రామారావుగారు. బాహ్య పరిమితిని నేను నిరాకరించలేదు. నిజమే. కాని అంతర్నిర్మాణం గూర్చి స్పష్టంగానే చెప్పినాను. ‘గణాల దృష్ట్యా (మాత్రమే) లేదన్నా’నంటే, ప్రతిపాదన ఏ దృష్ట్యా జరిగితే, నిరాకరణ కూడా ఆ దృష్ట్యానే జరగటం సమంజసం కాబట్టి. ఇక, వారి కనిపించినట్లుగా, నేననే ‘అంతర్విభజన’, వారనే అంతర్నిర్మాణం ‘సమానార్థకాలు’ కావు. ఈ అంతర్విభజన, ‘భావ గణాలను గూర్చి చెప్పట మెందుకంటే, వచన పద్యపాద విభజనను క్రమబద్ధం చేయటానికే...భావాంశాన్నిబట్టి పాద విభజన చేసేప్పుడు భావ గణం ఒక పదంగా గానీ, పద సమూహంగా కానీ ఉండేట్లయితే, దాన్ని రెండు పాదాల్లోకి వ్యాపింప చేయకూడదు...’ అని జూలై 72 వ్యాసంలో స్పష్టం చేసినాను. ఒక భావాంశం ఉభయ పాదాల్లోకి అభివ్యాప్తం కాకుండా చూడటానికి పాదంలోని భావాంశాల విభజన—అంటే అంతర్విభజన—సహకరిస్తుంది. కాగా, ఇది వచన పద్య పాద బాహ్య పరిమితి నిరూపణకు సంబంధించింది. భావాంశంతో గానీ, భావాంశాలు లేని భావంతో గానీ పాదం ఏర్పడ్డప్పుడు ఈ అంతర్విభజనకు అస్కారం లేదు. ఎందుకంటే, బాహ్య పరిమితి వీటిలో స్పష్టమే. మరొకటి. నేను ‘భావగణ’ మన్నది భావాంశాన్నే కాని, పూర్తి భావాన్ని కాదు. ‘భావగణం’లోని ‘గణ’ పదం ఔపచారికమన్న అంశం నా వ్యాసంలో స్పష్టపరచబడింది. ఇదిట్లా ఉండగా, భావం కానీ, భావాంశం (భావాంశాలు) కానీ పూర్తికావటం వచన పద్య పాదం యొక్క బాహ్యపరిమితి అని, గరిష్ఠ—కనిష్ఠ పరిమితులంటూ గుర్తించి గూడా రామారావు గారు, ‘...నిర్దిష్టమైన ‘అంతర్విభజన’ని కానీ, బాహ్య పరిమితిని గానీ ఆయన సూచించలేదు...అంతర్నిర్మాణ బాహ్య పరిమితులను నిర్దిష్టంగా చెప్పలేదు కాబట్టి వచన పద్య పాదాల కివి లేవని అనుకోవాల్సి వస్తున్నది’ అనటం ఎందుకో మరి! అంతర్నిర్మాణం విషయం జూలై 72 వ్యాసంలోనే స్పష్టం చేయటమయింది గదా! ఇక, గరిష్ఠ—కనిష్ఠ పరిమితులు ‘బాహ్య పరిమితి’కి భిన్నమేమీ కావు.

ఇంతకీ, వచనపద్య పాదవిభజనకు పద్ధతి ఏమిటి? అన్నది రామారావుగారి ప్రధానమైన ప్రశ్న. దీనికి, భావం లేదా భావాంశం పూర్తికావటం అనేది వచన పద్య పాద విభజనకు ఉపయోగించే పద్ధతి అని సమాధానం. ఈ పద్ధతిని మొదటినుంచే ప్రతిపాదిస్తున్నాను. నా ప్రతిపాదనకు ప్రమాణంగా, ఋక్కులలోని పాదవ్యవస్థకు సంబంధించిన

‘తేషాం ఋక్, యత్రార్థవశేన పాదవ్యవస్థా’

అన్న జైమినీయ మీమాంసా న్యాయసూత్రం (2—1—35) కూడా ఉదహరించటం జరిగింది. ఋక్కుల్లో పాదవ్యవస్థ అర్థాన్నిబట్టి కాగా, ఇక్కడ వచనపద్యంలో భావాన్నిబట్టి, ఈ అంశాలను నా వ్యాసంలో వివరించినాక గూడా, మళ్ళీ ఈ ప్రశ్న రామారావుగారు వేయటం—‘భావ, భావాంశాలను గుర్తుపట్టటానికి గాని, పరిగణించటానికిగాని, ప్రమాణీకరించటానికి పద్ధతులేమీలే’వనీ, ‘భావానికిగానీ

భావాంశానికి గానీ భాషలో అస్తిత్వం వ్యాకరణ సంబంధాల వల్లనే సాధ్యం' అనీ చెప్పటానికే ననుకుంటాను. అంతేకాదు. 'వ్యాకరణ నిమిత్తం లేకుండా భావ భావాంశాలను ఎట్లా పరిగణిస్తారో నా ఊహకు అందటం లేదు. వ్యాకరణాతీతంగా భావ, భావాంశాలను పరిగణించే సూత్రమేమిటి?' అని 'సూటిగా' ప్రశ్నించటానికి గూడా.

ఇక్కడ స్పష్టం చేయవలసిన అంశం ఒకటున్నది. ఎక్కడ కూడా నేను భావ, భావాంశాల అభివ్యక్తి విషయంలో వ్యాకరణ ప్రాధాన్యాన్ని నిరాకరించలేదు. పైగా 'వచనపద్యంలో భావాన్ని ప్రధానంగా స్వీకరిస్తున్నాం కాబట్టి, భావస్ఫూర్తిని కలిగించే పదాలకూర్పు, వాక్యనిర్మాణరీతి—వీటికిందులో ప్రవేశం ఉండకతప్పదు' అనీ 'వచనపద్య నిర్మాణంలో భావస్ఫూర్తి ప్రముఖంగా వాక్యనిర్మాణరీతికి ప్రవేశం ఉంది కాబట్టి, వాక్యనిర్మాణానికీ వ్యాకరణానికీ సంబంధం ఉంది కాబట్టి, వ్యాకరణ రూపైకత అక్కడక్కడా భావగణ విభజనలో కనిపించటం సహజమే' అనికూడా నా వ్యాసంలో చెప్పినాను. అందువల్ల భావస్ఫూర్తి విషయంలో వ్యాకరణం యొక్క అవసరాన్ని నేనేమీ కాదనలేదన్నది స్పష్టమే. ఈ 'కాదనలే'దన్న అంశాన్ని రామారావు గారు గమనించక పోలేదు. మరి గమనించికూడా, 'వ్యాకరణాంశాలకీ, పరిగణిస్తున్న భావాంశాలకీ ఏకైక సంబంధం ఉంది కాబట్టి వ్యాకరణ విరహితంగా భావగణ విభజన సాధ్యంకాదని నా నమ్మకం సాధ్యమని నిరూపించాల్సిన బాధ్యత శ్రీ సంపత్కుమారమీదే ఉంది' అనటం ఎందుకో, అర్థంకాదు.

ఇంతకూ అసలు విషయమేమిటంటే, ఒక భావం— అదెట్లాంటిదైనా — భాషలో అభివ్యక్తం కావాల్నంటే, ఆ భాషా పదాల ఒకానొక విధమయిన కూర్పు అవసరం. ఆ కూర్పులోని స్థితిని, అంటే, ఆ కూర్పులో ఒదిగిన పదాలకు కలిగిన పరస్పర సంబంధాలను వింగడించి చూపేది వ్యాకరణం. వ్యాకరణం వింగడిస్తున్నది కాబట్టి, ఆ సంబంధాలను వ్యాకరణ సంబంధాలంటున్నాం. మరి దీన్నే తిరగేసి చెప్పితే వ్యాకరణ సంబంధాలవల్ల భావస్ఫూర్తి కలుగుతున్న దనటం. మరి, భావస్ఫూర్తి అనేది ఎక్కడ ఉద్దిష్టమయినా కూడా, అక్కడ ఈ వ్యాకరణ సంబంధాల ప్రసక్తి, అవసరం ఉండనే ఉంటుంది. రామారావు గారు నాపై మోపిన బాధ్యతలోని చమత్కార మేమిటంటే, ఈ ఉండేదాన్ని ఉండదని చెప్పమని నిగ్గదీయటం. అయితే, ఇక్కడ గమనించవలసిన అంశ మేమిటంటే, భావం ఆధారంగా చెప్పే ప్రతి అంశాన్నీ, ఆ భావస్ఫూర్తి వ్యాకరణ సంబంధాలవల్ల కలుగుతున్నదన్న కారణంగా, వ్యాకరణ విషయమేనని చెప్ప నవసరంలేదు. ఉదాహరణకు— ఆలంకారికులు అర్థాలంకారాలు పేర్కొన్నారు. అంటే, ఆ అలంకారాలు అర్థస్ఫూర్తిని ఆధారం చేసుకుని చెప్పబడినయన్న మాట. మరి, భాషలో అర్థస్ఫూర్తి ఎట్లా కలుగుతుంది? రామారావు గారి మాటల్లో చెప్పాల్నంటే, 'వ్యాకరణ సంబంధాలవల్లనే'. అయినప్పుడు 'వ్యాకరణాతీతంగా అర్థస్ఫూర్తి కలుగటం లేదు' కాబట్టి, రామారావు గారి దృష్ట్యా వాటిని 'అర్థాలంకారాలు' అనకుండా, 'వ్యాకరణాలంకారాలు' అనవలసి ఉంటుంది. ఎందుకంటే, 'వ్యాకరణ విరహితంగా భావస్ఫూర్తి కలిగే పద్ధతి ఒకటుంటే, అది చూపించేవరకూ వారి భావ గణాలను వ్యాకరణ గణాలనే అనాల్సి ఉంటుంది—అన్నారాయన. కాని, ఆలంకారికు లందరూ వాటిని అర్థాలంకారాలనే అన్నారు. 'వ్యాకరణ విరహితంగా' అర్థస్ఫూర్తి కలిగే పద్ధతిని వారు దేన్నీ చూపించలేదు మరి. అసలు విషయ మేమిటంటే, అర్థస్ఫూర్తికి (భావస్ఫూర్తికి) వ్యాకరణ సంబంధాలు ముఖ్యమే. కాని ఆ స్ఫూర్తి కలిగిన తరువాత, ఆ కలిగిన అర్థం లేదా భావం ఆధారంగా ఏర్పడేవన్నీ, ఆ అర్థం లేదా భావం బట్టి చెప్పబడుతాయే కాని వ్యాకరణాన్ని బట్టి కాదు. అందుకని నేను 'ఆధారపడ్డ భావస్ఫూర్తి' కలిగిన తరువాత, ఆ భావం యొక్క పరిమితులను బట్టి ఏర్పడే అంశాలు భావానికి సంబంధించినవే అవుతయి. భావం అనేది భాషలో అభివ్యక్తమయినాక గాని, ఇది భావం, లేదా ఆ భావం లోని ఒక అంశం అని చెప్పటానికి వీలుపడదు. ఋక్కుల పాద వ్యవస్థ విషయంలో నేను ఉదహరించిన అంశం కూడా ఇదే. అర్థాన్ని బట్టి పాద

వ్యవస్థ అంటే ఆ అర్థం వ్యాకరణాతీతంగా ఉంటుందని కాదు. కాగా పాద విభజనకు అర్థాన్ని ఆధారంగా తీసుకోవట మయిందన్న మాట. అక్కడ అర్థస్ఫూర్తి ఎట్లా కలుగుతున్నదని కాదు, కలుగుతున్న అర్థస్ఫూర్తి ననుసరించి పాదాన్ని ఎట్లా విభజిస్తున్నా మన్నది ప్రధానం. భావ, భావాంశాలను బట్టి పాద విభజనకు ఉదాహరణగా నేను చూపిన శ్రీ మాదిరాజు రంగారావు గారి వచన పద్యాన్ని ('అనలతోరణం') రామారావుగారు 'మాటల కూర్పు' అంటూ— పైన ఉదహరించిన భాగంలో పాద విభజన వాక్యనిర్మాణంలో వాక్య ఉపవాక్య విభజన జరిగే పద్ధతి ననుసరించి జరిగిందని స్పష్టం' అన్నారు. ఈ లెక్కన 'అర్థవశేన పాదవ్యవస్థా' అన్న ఋక్పాద విభాజక లక్షణం 'వాక్యవశేన పాద వ్యవస్థా' అని ఉండవలసి ఉండేది. కాని 'అర్థవశేన' అనిమాత్రమే ఆ సూత్రం. ఇంతకూ వాక్యోపవాక్య విభజనకు ఆధారం ఏమిటి? కలిగే భావస్ఫూర్తి మాత్రమే. అందువల్ల ప్రధానమయింది భావస్ఫూర్తి మాత్రమే కాని, 'వాక్యోపవాక్య విభజన పద్ధతి' కాదు. వ్యాకరణ విరహితంగా భావస్ఫూర్తిని గురించి ఇంతగా పట్టుబడుతున్న రామారావుగారు భావస్ఫూర్తి విరహితంగా వ్యాకరణం యొక్క ఉనికి నిర్ధారించే సూత్రమేమిటో వివరించవలసి ఉంటుంది. నిజానికి వ్యాకరణం భావస్ఫూర్తిని వదిలితే, దాని అవసరంలేదు. మరొక అంశమేమిటంటే, భావస్ఫూర్తికి వ్యాకరణ సంబంధాల పరిజ్ఞానం తోడ్పడినంతమాత్రాన, స్ఫురించే భావం వ్యాకరణ భావంకాదు. భావస్ఫూర్తికి వ్యాకరణం సహాయకంగా వచనపద్యపాద విభజనకు భావస్ఫూర్తి సహాయకం. భావగణ విభజనలో, పాద విభజనలో వ్యాకరణాంశాలు తోడ్పడినంతమాత్రాన అవి భావగణాలూ. వచనపద్య పాదాలూ కావటంలో క్షతి ఏమీ లేదు. 'ఏకాక్షర వృత్తాంతర్నిర్మాణాన్ని సమర్థించేందుకు గణిత శాస్త్రంలోని Set Theory తోడ్పడినంతమాత్రాన రామారావుగారంటున్న అంతర్నిర్మాణం గణితశాస్త్రీయమయితుందా? ఇదిట్లా కాగా, 'భావగణాలైన ఈ భావం, భావాంశాల స్వరూపాన్ని శ్రీ సంపత్కుమార ఇప్పటి వ్యాసంలోనైనా వివరించక పోవటం విచారకరం.' అన్నారు రామారావు గారు. నేను వివరించకపోవటమేమిటి? ఉదాహరణ పూర్వకంగా ('అనలతోరణం'లోని వచనపద్యం) వివరించినాను. అయితే 'విచారకరం' ఏమిటంటే, నేను వివరించిన భావ, భావాంశాలను వ్యాకరణ సంబంధాల పరంగా ఉన్నయించి మరోరకమైన వివరణ ఇయ్యటానికి రామారావుగారు ప్రయత్నించటం. ఇక— 'భిన్నభిన్న వచనపద్య పాదాల్లో అక్కడ భావాన్ని స్ఫురింపచేసే పదాల స్థితినిబట్టి 'భావగణ విభాజక రీతి ఉంటుంది' అన్న సంపత్కుమార వివరణ చాలా అసంతృప్తికరంగా ఉంది. ఆ 'స్థితి' ఏమిటో నిరూపించేవరకూ భావగణాలస్థితి (Exestence) ని అంగీకరించలేదు' అన్నారు. భావగణం ఏకపదంగా ఉంటుందా, బహుపదంగా ఉంటుందా అన్నప్పుడు, అక్కడ ఉపయుక్తమయిన పదాలస్థితి, అంటే, ఏక పదం భావాంశ స్ఫోరకమైతే, ఏక పదమే భావగణం. బహు పదాల సమిష్టి భావాంశ స్ఫోరకమైతే, ఆ సమిష్టే భావ గణం. 'భావాన్ని స్ఫురింపజేసే పదాల స్థితి' అంటే ఇది. అక్కడి పదాలు పూర్తి భావాన్ని స్ఫురింప చేస్తున్నాయా? భావాంశాన్ని స్ఫురింప చేస్తున్నాయా?—ఇవన్నీ భావ గణ స్వరూపంలో, (ఏక పద–బహు పద స్వరూపంతో) భేదాన్ని కలిగించవచ్చు. అందుకే పై ఉదాహృత వాక్యం తరువాత నా వ్యాసంలో—'భావగణ స్వరూపంలో భేదం ఉండవచ్చు గాని, భావగణం మాత్రం ఉంటుంది.' అన్న వాక్యం ఉంది. అంతే కాదు,—'భావాన్ని ఆధారం చేసుకుని పదాల స్వరూపంలో వాటి కలయికల్లో ఎన్ని తేడాలున్నా గూడా అది భావగణమే. అది ఏకైకం' అని వివరించినాను. ఈ సందర్భంలో - భగణాన్ని ఒక ఉదాహరణగా చూపిస్తూ, భగణం ఆదిలో ఉండే గురు వర్ణ స్వరూపంలో 4 విధాల మార్పులు (దూరము, దుంపలు, దుఃఖము, దుర్గతి) ఉన్నా కూడా అది భగణమే అయినట్లు, ఈ మార్పులు కారణంగా ఆ గణానికి నాల్గు పేర్లు లేనట్లు, భావగణ స్వరూపంలోని మార్పులను బట్టి కూడా దానికి వేరువేరు పరి

గణనం లేదన్నాను. ఇక్కడ ఉదాహరణలో గమనించ వలసింది మార్పులు ఉన్నా కూడా భగణానికి వేరు వేరు పేర్లు లేవనేదే కాని మరొకటి కాదు. నేను ఉదాహరించిన గురువర్ణ స్వరూపంలో తేడా ఉన్నా, 'సామ్యం కూడా ఉందని' 'ఆ సామ్యాన్ని హేతు బద్ధంగా నిరూపించవచ్చు'నని రామారావుగా రన్నారు. నిజానికి ఆ తేడాను హేతుబద్ధంగా నిరూపించ వచ్చునా లేదా అన్నది ప్రస్తుతం కాదు, తేడా ఉన్నదా లేదా అనేది. పైగా, గురు స్వరూప విషయంలో 'హేతుబద్ధత' కూడా నిజానికి లేదు. ఎందుకంటే వారు వివరించిన పద్ధతిలో, 'పూర్వ వ్యంజనంతో సంబంధం లేకుండా దీర్ఘాచ్చుగానీ, పరవ్యంజనంతో మూతబడిన హ్రస్వాచ్చు గాని గురువు అవుతుంది'. కాని అంతే కాదు. ఇంకా ఉన్నది. పూర్వవ్యంజనంతో సంబంధంకల దీర్ఘాచ్చు కూడా గురువై ఉందని 'C V' అన్న గుర్తులతో వారే తేల్చినారు. కాని, పర వ్యంజనంతో మూతబడిన దీర్ఘాచ్చు V C కూడా (ఆన్) గురువే అయితుంది. ఇంకా పూర్వ వ్యంజ నంతో సంబంధం కలిగి, పరవ్యంజనంతో మూత బడిన దీర్ఘాచ్చు C V C కూడా (కాన్) గురువయి తుంది. (రామారావు గారు C ని కేవల వ్యంజనానికి V ని దీర్ఘాచ్చుకు V హ్రస్వాచ్చుకు సంకేతించినారు.) ఆ – కా – కాన్ అనే ఈ మూడు గురువుల 'అక్షర పరిమాణం' ఒకే విధంగా ఉన్నదనటానికి వీలులేదు. (దీనికి సంబంధించిన చర్చ డా. పాటిబండ మాధవ శర్మ గారి 'ఆంధ్ర మహాభారతము' ఛందశ్శిల్పము— పు. 61–80 చూడవచ్చు.) నిజాని కిక్కడ అచ్చంగా గురు లఘు క్రమంతో భావగణాన్ని నిరూపించటం కాదు, గురు లఘువులతో ఏర్పడే గణాల్లో తేడా లున్నట్లే, ఈ భావగణాల్లోనూ ఉంటుందని సూచించ టమే ప్రధానం.

ఇట్లాగే మరొక చోటగూడా నేనుదాహరించిన అంశాన్ని రామారావుగారు సాగదీసినారు. ఒక పద్య పాదాన్ని భిన్నలాక్షణికులు రెండు పద్యాలకు చెందిన పాదాన్నిగా నిరూపించే వీలు ఒకప్పుడు కలుగవచ్చు అనే అంశాన్ని చెప్పటానికి సీసంగానూ, ఆటవెలది గానూ విభక్తమయ్యే విధంలో ఒక ఉదాహరణచూపి, ఇట్లాగే భిన్నలాక్షణికులు వచనపద్య పాదాన్నిగూడా వేరు వేరు పాదాలుగా విభజించే అవకాశమున్న దన్నారు. ఇక్కడ కూడా ఒక పాదాన్ని ఒకటికన్నా ఎక్కువ రకా లుగా విభజించే అవకాశం ఉండటమే ప్రధానం. కాని 'కవి ఉద్దేశించిన పాదవిభజన మనకు ఎందుకు ప్రమాణం కావాలి? నిజమే, అక్కరలేదు' అంటూనే, 'కవి ఉద్దేశించిన పాదవిభజన, లాక్షణికుడు చేసిన పాదవిభజన ఒకటే ఎందుకవుతున్నై? ఇద్దరూ ఒక సూత్రాన్నే అనుసరించటంవల్ల. అనుసరించటానికి ఒక సూత్రం ఉండటంవల్ల' అన్నారు రామారావు గారు. కాని నేను చూపిన ఉదాహరణలో, కవి, లాక్ష ణికుడు పాదాన్ని ఒకే విధంగా విభజించలేదు. కవి ఆట వెలదిగా భావిస్తే, లాక్షణికుడు సీసపాదంగా భావించినాడు. ఎవరికి వారికి ఆ విధంగా పాదవిభజనలో 'సూత్రం' ఉన్నది. అట్లాగే వచన పద్య పాదం విష యికంగాకూడా. నిజానికి ప్రస్తుత ప్రస్తావన కవి— లాక్షణికుల మధ్యదికాదు. ఇద్దరు లాక్షణికుల మధ్యది. ఇద్దరు లాక్షణికులు పద్యపాదాన్ని వేరు వేరుగా విభజిస్తున్నారు. వచనపద్య పాదాన్ని ఇద్దరు లాక్షణికులు వేరువేరు విధంగా విభజిస్తున్నారు. ఈ విభజనకు 'సూత్రం' లేదంటారు రామారావుగారు. కాని ఉంది. అది భావ, భావాంశాలనుబట్టి విభ జించటం. భావాంశాలంటే, భావగణాలుగదా! ఈ భావగణాల స్వరూపంలో తేడాలుంటాయని వివరించి నానుగూడా. ఈ తేడాలో ఇద్దరు లాక్షణికులు వచన పద్యపాదాన్ని వేరువేరుగా విభజించటానికి అవకాశం కలిగిస్తున్నది. ఒక వరుసగాఉన్న గురు లఘువులను వేరువేరు గణాలుగా విభజించటానికి అవకాశం ఉండ బట్టేగదా, ఆ వరుస వేరువేరు పాదాలయితున్నది! అట్లాగే వచనపద్య పాదంలోకూడా. ఇక్కడ వేరు వేరుగా విభజించేందుకు గల 'అవకాశం' మాత్రమే ప్రధానంకాని, రెండువిధాలుగానా, మూడు విధాలుగానా అన్నది ప్రధానంకాదు. ఇక, 'కవ్యుద్దిష్టంగా లాక్షణి

కుడు వచనపద్య పాదాన్ని విభజిస్తాడా అన్నది రామారావు గారి మరో ప్రశ్న. ఆ పాదాన్ని కవి ఎట్లా ఉద్దేశించినాడో తెలియనప్పుడే గదా లాక్షణికుని కీ విధమైన ప్రశ్న! 'మధుర...' అన్న నీ ఉదాహరణలో, కవి ఆ పాదాన్ని ఆటవెలదిగా ఉద్దేశించినాడని తెలిసినప్పుడు, లాక్షణికుడు మరో విధంగా విభజించటానికి—అవకాశం ఉన్నా—పూనుకోడు. అది తెలియ నప్పుడు, సీస పాదంగాకూడా విభజించే అవకాశం అతని కున్నది. అట్లాగే, వచనపద్య పాద విషయంలోనూ. కవి ఉద్దేశించింది తెలియనప్పుడు లాక్షణికుడు వచనపద్యపాద విభాజకసూత్రాన్ని అనుసరించి మరో రకంగా విభజించే అవకాశం అతనికున్నది. ఈ అంశాన్నే ప్రధానంగా ఇక్కడ గమనించవలసి ఉంటుంది.

ఈ సందర్భంలోనే, '... పాద బద్ధతకు లొంగనివి కూడా ఆధునిక కవిత్వంలో 'కొన్ని' ఉన్నాయి' అంటూ రామారావుగారు తమ మొదటి వ్యాసంలో శ్రీ తిలక్, శ్రీ కె. వి. రమణారెడ్డిగార్ల రచనలను చూపి, తిలక్ రచనల విషయంలో 'ఇందులో పాద విభజన కాధారాలేమిటో ముఖ్యంగా మూడోపాదం 'ఆకాశ'ంతో అంతంకావటానికి హేతువెవరైనాచెప్తే సంతోషిస్తాను' అనీ, రమణారెడ్డి రచన విషయంలో 'పై దాంట్లో రమణారెడ్డి అచ్చులోకూడా పాదబద్ధత పాటించలేదు' అన్నారు. ఇచ్చిన ఉదాహరణలు పాద బద్ధతకు లొంగని 'కొన్ని'లోవి. ఆ కొన్ని వచన పద్యాలేగదా! అందుకని ఉదాహరించిన రీతిలో ఆ రచనల్లో ఉండే లోపాలను చూపించి నాను. ఎట్లా ఉండాల్నో చూపినాను. దీనికి వచనపద్య పాదవిభాజక సూత్రమే ఉపయోగించి నాను. అయితే, నేను విభజించిన రీతినిగూర్చి రామారావుగారేమీ అనలేదు కాని నా విభజన సరిగానే ఉందనుకోవాలె మరి కాని, తమ రెండవ్యాసంలో— 'కె. వి. రమణారెడ్డిగారి 'బాధాగాథము' అనే ఖండికలోనుంచి నేనుదాహరించిన భాగాన్ని శ్రీ సంపత్కుమార మళ్లీ ఉదాహరించి 'కొంచెం లోపం ఉండవచ్చుగాక' అందులో పాదవిభజన జరిగిందని నిరూపించటానికి ప్రయత్నించి నారు. రమణారెడ్డిగారి అంగారవల్లరి అనే అచ్చుపుస్తకాన్ని శ్రీ సంపత్కుమార చూచి ఉండలేదను కుంటాను. చూస్తే 'బాధాగాథము'లో . పాదవిభజన జరిగిందని పొరపాటుపడే అవకాశం ఉండేదికాదు' అన్నారు రామారావుగారు. వారన్నట్లుగానే, 'అంగారవల్లరి'ని నేను చూడలేదు. 'రమణారెడ్డిగారు' 'బాధగాథము'లో పాద విభజన ఉద్దేశించ లేదని, రామారావుగారుదాహరించిన భాగంలో నాలుగు పాదాలు కనిపించటం 'యాదృచ్ఛిక'మనీ నాకు తెలియదు. రమణారెడ్డిగారు తాను పాదవిభజన ఉద్దేశించలేదని రామారావుగారికి వ్రాసినారనికూడా నాకు తెలియదు. అయితే, ఈ చూడక పోవటం, తెలియక పోవటంవల్ల నేను పొరపాటుపడే అవకాశము ఏమీ పొందలేదు. ఇది ముఖ్యం. రామారావుగారు పరీక్ష వ్రాసేవాడికి ప్రశ్న లిచ్చినట్లుగా, ఆ రెండు రచనలనిచ్చి పాదవిభజన చేయుండన్నట్లుగా వ్రాసినారు. మరీ స్థితిలో నేను 'అంగారకవల్లరి'ని కానీ, తిలక్ 'అమృతం కురిసిన రాత్రి'నికానీ చూడ నవసరం లేదు. ఒక విధంగా చూడకూడదు కూడా. తిలక్, రమణారెడ్డి పాద విభజనను ఉద్దేశించినారా లేదా అన్నది కాదు కావలసింది. అది వచన పద్యం కాబట్టి, పాద విభజన జరిగిందా, జరిగితే ఏసూత్రం ప్రకారం అన్నది ముఖ్యం. (ఆ భాగాలు, వచన పద్యాలనే ఉదాహృతాలు. వచన పద్యాలు కాకపోతే వాటి ప్రసక్తే ఇక్కడ ఉండేది కాదు.) పాద విభజన అక్కడ ఉన్నదనీ, కాని ఉదాహరించిన రీతిలో వచన పద్యం దృష్ట్యా దోషం ఉన్నదనీ చూపించినాను. అట్లా ఉంటే అది ఛందోదోషం అన్నాను. దీనిపై—'ఏ అప్పకవినో జ్ఞాపకం చేసేట్లుగా 'ఛందోదోషాల్ని' ప్రస్తావించటంలో శ్రీ సంపత్కుమార కొంచెం తొందర పడ్డారనుకుంటాను' అంటారు రామారావు గారు. కాని, ఛందోదోషాలు అప్పకవిని ఎందుకు జ్ఞాపకం చేసినయో నా కర్థం కావటం లేదు. ఎందుకంటే, అప్పకవి ఎక్కడా ఛందోదోషాల్ని చెప్పినట్లు లేదు. ఇంతకూ ఒక దోషాన్ని దోష మనటానికి అప్పకవి ఎందుకు? తెలిసిన ఎవరయినా అనవచ్చు. ఛందో వ్యాకరణ దోషాలను ఆలంకారికులు కావ్యదోషా లన్నారు. వ్యాకరణం దృష్ట్యా వాక్యంలో లోపం ఉంటే, రామారావు గారు మాత్రం దాన్ని వ్యాకరణ దోషం అనరా! నిజానికి దోషాన్ని దోష మనటంలో తొందరపాటు లేదు. కాని దాన్ని అనటంలోనే తొందరపా టున్నట్లు.

'అమృతం కురిసిన రాత్రి' తిలక్ మరణించిం తరువాత అచ్చయిందనీ, * అందులోని - "పై ఖండికలో

పాద విభజన ఉద్దేశించినాడో, ఎక్కడ ఉద్దేశించలేదో తెలుసుకోటానికి అచ్చయిన పుస్తకమే ఆధారం. ఈ ఆధారంతో చూస్తే ఇక్కడ కవి పాద విభజన నుద్దేశించినట్లు తోచదు. ఇప్పుడు కనిపించే పాద విభజన తిలక్ పద్యాలు కాపీ చేసిన వారో, అచ్చువేసిన వారో చేసి ఉండవచ్చు. అసలు కవి పాద విభజనను ఉద్దేశించినాడో లేదో పూర్తిగా తెలుసుకోకుండా అనిర్దిష్ట ప్రతిపాదనల ఆధారంగా ఏ అప్పకవినో జ్ఞాపకం చేసేట్టుగా 'ఛందోదోషాల్ని' ప్రస్తావించటంలో నేను తొందరపడ్డానంటారు రామారావుగారు. ఇక్కడ ఒక విషయం. 'అనిర్దిష్ట ప్రతిపాదన లాధారంగా' కాక, నిర్దిష్ట ప్రతిపాదన లాధారంగానే నేను తిలక్ రచనలో పాద విభజన చేసినాను. మరొకటి. 'అమృతం కురిసిన రాత్రి' లోనివి అసలు, వచన పద్యాలేనా? వచన పద్యాలయితేనే ప్రస్తుత చర్చ, లేకపోతే వాటిని ఉదాహరించవలసిన అవసరం లేదు. కవి పాద విభజన ఉద్దేశించిందీ లేనిదీ నిర్ణయించటానికి అచ్చుపుస్తకమే గదా ఆధారం. దాన్ని వదిలి ఉద్దేశించిందీ లేనిదీ, తిలక్ మరణించినాడు కాబట్టి మరో ఆధారం లేదు. ఆయన బ్రతికుండగా అచ్చయిన వచన పద్యాల్లో పాద విభజన ఆయన ఉద్దేశించిందే అని చెప్పవచ్చు గదా! మరి ఉదాహరించేప్పుడు తమకే నిర్ధారణ లేని వాటిని ఉదాహరించి, నేను తెలుసుకోకుండా తొందరపడ్డాననటం ఎందుకు? ప్రస్తుతం అచ్చులోని పాద విభజనలో దోషం ఉంటే, అది తిలక్ 'పద్యాల్ని' కాపీ చేసినవారి, లేదా అచ్చువేసినవారివల్ల వచ్చిందే కాని, తిలక్‌వల్ల కాదని రామారావుగా రంటున్నారు గదా! మరి నేను కూడా, తిలక్ రచనకు పాద విభజనచేసి చూపించి తరువాత, '—ఆ పాద విభజన అస్తవ్యస్తంగా జరిగింది. ఇది వ్రాతలోనూ, అచ్చులోనూ జరిగే వీలుంది' అన్నాను నా వ్యాసంలో. ఇక నేను తొందరపడిందేమిటో నా కర్థం కావటం లేదు. నిజానికి తిలక్ వచన పద్య ప్రయోక్తల్లో చాలా ప్రముఖుడు. వచన పద్య పాద విభజన విషయంలో నా ప్రతిపాదనలను తిలక్ హర్షించిన సంగతి నా వ్యాసంలో వ్రాసినాను కూడా. అయినా, రామారావు గారు తిలక్ విషయికంగా ఇంత వ్రాయటం, నేను 'పూర్తిగా తెలుసుకోకుండా' ప్రవర్తించినానటం విచారకరం.

ఇదిట్లా ఉండగా, 'భావస్ఫూర్తి ఆధారంగా విభక్త మవుతయ్యని సంపత్కుమార అంటున్న భావ గణాలు అన్నిరకాల భాషా వ్యవహారాల్లోనూ ఉంటై. అయినప్పుడు ఆయన పద్ధతి ననుసరించి ఒక వ్యాసంలోని వాక్యాలను గూడ భావ, భావాంశాల పద్ధతిలో పాద విభజన చేసి, వచన పద్యంగా నిరూపించ వచ్చు. అచ్చులో గాని, రాతలో గాని కవి పాద విభజనను సూచించటం ప్రమాణంగా తీసుకుంటే, ఆ పని వ్యాసకర్త కూడా చెయ్యవచ్చు. ఈ నాటి కొన్ని ప్రకటనల్లో కూడా పాద విభజన కనిపిస్తున్నది. భావ, భావాంశ నిరూపణ అక్కడా చెయ్యవచ్చు. ఇక పోతే, వచన పద్యంలో ఉండే కవితా పదార్థం దాన్ని వ్యాసాల నుంచి, ప్రకటనలనుంచి వేరు చేస్తుంది కదా అంటే, కవిత్వానికి గద్యంలో స్థానం లేదని అనాల్సి ఉంటుంది. రసహీనమైన పద్యాలు, రసవంతమైన గద్యం ఉంటయ్యని అందరూ ఒప్పుకుంటారు. కవిత్వం ఉన్నదల్లా ఛందో విభాగం అనీ, ఛందస్సులో ఉన్నదల్లా కవిత్వం అవుతుందని శ్రీ సంపత్కుమార అంటారనుకోను' అన్నారు రామారావు గారు. నేను అనను. నిజమే. కాని ఇక్కడ కవితా పదార్థం ప్రసక్తి ఎందుకు? వచన పద్యం పద్యం కావటానికి, అందులో కవితా పదార్థం ఉండటానికీ, లేకపోవటానికీ సంబంధం లేదు. ఉండవచ్చు, ఉండక పోవచ్చు. రసహీనమైన పద్యాలు ఉంటాయని వారూ అంటూనే ఉన్నారు. వచన పద్యం అందుకు భిన్న మేమీ కాదు. గణితం, వైద్యం పద్యాల్లో వ్రాసిన వారున్నారు. వ్యాసాలను పద్యాల్లో వ్రాసినవారు కూడా ఉన్నారు. 'పోప్' అట్లా వ్రాసినాడంటారు. అందువల్ల వ్యాసకర్త తన వ్యాసం వచన పద్యంలో వ్రాస్తే మునిగిపోయేదేమీ లేదు. ప్రకటల్ని వచన పద్యాలుగా నిరూపించ వచ్చు. ప్రకటల్ని సాంప్రదాయిక పద్యాల్లో మాత్రం వ్రాయటానికి వీల్లేదా! ఎందరు వ్రాయరు! 'వచన పద్యం' పద్యం. పద్యం బాహ్య స్వరూపం. కవితా పదార్థం, రసం మొదలయినవి ఆంతరికాలు. ఇవిలేని సాంప్రదాయిక పద్యాలున్నట్లే, వచనపద్యాలూ ఉండవచ్చు. అందువల్ల కవితా పదార్థం ఉన్నా, లేకున్నా వచన పద్యం వచన పద్యమే, కానిది కానిదే. వచన పద్యం ఒక ఛందోరూపం. అంతే.

'శ్రీ సంపత్కుమార ఇప్పటి వ్యాసంలోనైనా వచన పద్యాన్ని అంతర్నిర్మాణమూ బాహ్యపరిమితి ఉన్న

పాదాలుగా విభజించటానికి స్పష్టమైన ప్రతిపాదన ఏదీ చెయ్యలేదు. ఆయన ఉన్నయ్యంటున్న భావగణాలు వ్యాకరణాంశాలమీదనే ఆధారపడ్డై గనుక, అవి వ్యాకరణగణాలే అవుతై. ఆయన భావగణ పద్ధతికి పద్యాన్ని గద్యంనుంచి వేరుచేసే శక్తి (లేదు)' అన్నారు రామారావుగారు. దీనికి సమాధానాలు నా పూర్వ వ్యాసంలోనూ ఉన్నయి. ఈ వ్యాసంలో ఇంకా స్పష్టపరచటమయింది. అంతర్నిర్మాణంగూర్చి మొదటినుంచీ నా అభిప్రాయం స్పష్టమే. బాహ్యపరిమితి గరిష్ఠ—కనిష్ఠ పరిమితి అన్న ధోరణిలో వారూ గమనించారు. నేనూ స్పష్టం చేసినాను. నిజానికి బాహ్య పరిమితి కాదిది. పాదపరిమితి. భావ, భావాంశాల సమాప్తి పాదపరిమితి. భావగణా (భావాంశా)లను వ్యాకరణ గణాలనగూడదనీ, భావగణాలే అనాల్నని స్పష్టం. ఈ వ్యాసంలో 'ఒక వ్యాసంలోని వాక్యాలను గూడ భావభావాంశాల పద్ధతిలో పాదవిభజనచేసి వచనపద్యంగా నిరూపించవచ్చు'నని వారే అంటున్నారు. మరి భావ భావాంశాల పద్ధతిలో 'పాద విభజన' చేసినప్పుడు, అది గద్యంనుండి వేరుకాక ఏమయితుంది? గద్యానికి పాదవిభజన ఉండదు. ఉండేది పద్యానికే. ఇక్కడ ఒక విషయం. వ్యాసాల్ని 'వచన పద్యం'గా నిరూపించవచ్చు నన్నారు. మరి సాంప్రదాయిక ఛందస్సుల ననుసరించి, వ్యాసాన్ని 26 అక్షరాలుగా (అంతవరకుకూడా) విభజించి విషమ వృత్తాలుగా నిరూపించ వచ్చు. ఈ విధంగా ఈనాటి! 'వచన పద్యాన్ని' 'విషమవృత్తం'గా పరిగణించవచ్చునని ఒక మిత్రుడు సూచించినారు. మరి దీనికి ఏమనాలె? కాబట్టి అనువైన పద్ధతిని నిష్పన్నం చేయటం అవసరమైంది.

తమ వ్యాసాంతంలో రామారావు గారు వచన పద్య పాదబద్ధత నిరూపణంలో నేను పడ్డ చిక్కులన్నిటికీ (నిజానికి అవి చిక్కులైతే)—'కారణం మనకు ప్రసిద్ధంగా ఉన్న ఛందస్సంప్రదాయంలో ఎక్కడో చోట వచన పద్యానికి చోటు కల్పించటం కోసం ప్రయత్నించటం. ఏదో రకమైన ఛందస్సూ, గణ విభజనా ఉన్నయ్యంటే వచన పద్యానికి ఏదో గౌరవం అదనంగా వస్తుందనుకోవటం' అన్నారు. వచన పద్య పాదబద్ధతకు ఋజువైన మార్గాన్నే అనుసరించినాను తప్ప, చిక్కు లేమీ పడలేదని స్పష్టం. గమనించవలసిన అంశ మేమిటంటే వచన పద్యానికి ఛందస్సంప్రదాయంలో నేనుగా చోటు కల్పించటానికి ప్రయత్నించలేదు. మాత్రా ఛందస్సులను దాటివచ్చి, తనంతట తానే వచన పద్యం ఛందస్సంప్రదాయంలో చోటు చేసుకున్నది. ఛందః ప్రయోక్తలే దాన్ని ప్రయోగించి, ఛందస్స్వరూపంగా దానికి వ్యాప్తి తెచ్చినారు తప్ప గద్యప్రయోక్తలు కాదు. కాగా నేను చేసింది ఛందస్సంప్రదాయంలో వచన పద్యం తానుగా చేసుకొన్న చోటుయొక్క స్వరూపాన్ని స్పష్టం చేయటమే. ఇక పోతే, ఛందస్సూ, గణ విభజనా ఉన్నంత మాత్రాన ఏ 'పద్యా'నికీ 'అదనపు' గౌరవం రాదు. ఆ పద్యంలో శక్తి ఉంటే వస్తుంది. ఇక వచన పద్యం యొక్క ఛందస్స్వరూపాన్ని నేను స్పష్టం చేయటం వల్ల దానికి 'అదనంగా' గౌరవం వస్తే దానికి అభ్యంతరం ఎందుకుండాలె?

కాగా నేను వచన పద్యానికి నిరూపించిన, లక్షణం చెప్పిన పాదబద్ధత, పాద విభజనరీతి ననుసరించి, 'వచన పద్యం' పద్యమే అయితుందనీ, పాద బద్ధత లేని గద్య విభాగంలో చేరదనీ 'వచన పద్య' పరిశీలకులకు మనవి చేస్తున్నాను.

అరవిందార్చన

శ్రీ పోచిరాజు శేషగిరిరావు

ఓ శతాబ్దము జీవనమై ఇవతరించిన పూర్ణపురుషుఁడు
ఆశ లన్నిట దివ్యపరిమళ మలరఁ జేసిన రమ్య కుసుమము
ఆర్త లోకము చూచి కుందియు ఆర్ద్రమైన మనస్వి చంద్రుఁడు
చిత్తవేణువు నూఁదుటకునై చెంత నిల్చు కుమార కృష్ణుఁడు
దివ్య విజ్ఞానావతరణము తీర్చి తెచ్చిన ద్రష్ట, ఈ కవి
దివ్య పరివర్తనము జనతకు తే, శ్రమించిన మౌని వృషభుఁడు
దివ్య మానవ జనన సిద్ధికి స్థితప్రజ్ఞను నెఱపె యోగము —

నాత్మ సంథ కతీంద్రియమునౌ యత్న మొనరించిన కృషీవలుఁ
డున్నతోన్నత పథములకనై ఉగ్రసాధన చేసె, ధీరుఁడు
నిన్న రేపులు కలుపుటకునై నిల్పె నొక్క సువర్ణ సేతువు :
తూర్పు రేఖలు పడమటింటను తొంగలింపగఁ జేయు భానుఁడు.

నంప్ర లోకమునుండి త్రోయగ నడుము కట్టిన జ్ఞానకిరణము :
వెలుగులు వెల్లిన పారుటకునై విశ్వయత్న మొనర్చె నీ ఋషి :
‘నవ్యయోగ’ ప్రవర్తనమ్మున భవ్య లీ ‘అరవిందయోగుల’
పుదుచ్చేరియె పుణ్యతీర్థము పుడమి కంతకునై వెలింగెను

నిస్స్వరవ్యలు రేపి విప్లవ నిమ్నగను పొంగించి నాతఁడె
‘దివ్యజీవన’ గంగ ధరణికి తెచ్చియిచ్చిన నేలవేలుపు :
దేశసేవకు మీఁదుకట్టి ప్రతీపశక్తుల తా నెదిర్చెను
ఆస కోసలను గూడ త్యాగమె అతని మనసున నిల్చె నిరతము.

జీవితమ్మును పిండి *కావ్య క్షీర మొసగిన కామధేనువు
శత శతమ్ముల కిరణమాలలు జల్లె, విశ్వమునన్ హొరంగులు
వంగదేశమె కాదు భారత వర్షమే ఒక మెట్టు నెక్కెను
ప్రీణితమ్మయి విశ్వ మీ ‘అరవింద’ మౌనికి మోకరిల్లెను.

నడచి వచ్చిన పాల కడలియొ !!
పుడమిపైన సుధా ప్రపూరమొ !!
లలిత కాంత పదావళీ రస
చారితమ్మవు మహా కావ్యము !

---

* ‘సావిత్రి’ మహాకావ్యము.

తెలుగు నాటకము

శ్రీ నేలటూరి రామదాసయ్యంగారు

[ఆంధ్ర యూనివర్సిటి పిలుపున 1932 వాల్తేరులో నా యొసంగిన యుపన్యాసములయు, 1938 డిసంబరులో ఆంధ్రనాటక కళాపరిషత్తు నెల్లూరులో సమావేశమైనప్పుడు నా యొసంగిన యుపన్యాసము యొక్కయు తలఁపోత ఈ వ్యాసము నాకారముం దాల్చినది. ఇందలి విషయములు కాల దోషము చెందునవి కావని ఇపుడిట్లు ప్రకటింప జతన పడితిని. — నేలటూరి రామదాసయ్యంగారు.]

ఏలొకో తెలుఁగున ప్రాచీనులు నాటకములు రచింపరైరి! పురాణములను ఇతిహాసములను అట్లే నానా కావ్యములను రచించిరి కాని, కావ్యవిశేషమైన నాటకమును—ఒకటి రెండు వీథులపాట యుండఁగాక—రచింపరైరి. ఈ పురాణేతిహాస కావ్యముల కనేకములకు సంస్కృతమున మూలము సిద్ధముగా నుండినది. అన్నిటికిని మార్గమును సిద్ధముగా నుండినది. అట్లే నాటకమునకును సంస్కృతమున లక్ష్యములు పెక్కులును, వాని మార్గమును సిద్ధముగా నుండియు కవులు వానిం దొఁకరైరి. మఱి యిందుల కారణము ఏమో ఒకరును చెప్పినారుకారు. సంస్కృతమున నాటకములు వ్రాసినవారు వాని ప్రయోగములం జూడఁ గోరిన జనులు పలువురు ఆ కాలమున ఉండినందునం గాని, వారి రాజాస్థానులయందు ఆయా రాజులు నాటకములు ఆడింపను చూడను గోరి తదర్థమై ప్రోత్సహించినందునంగాని వ్రాసిరి. అట్టికోరికయు ప్రోత్సాహమును ఆంధ్రులకు లేకపోయెను కాఁబోలు, దానంజేసి వ్రాయరైరి అని యూహింతుమా యన్న ఏల? ఆ వంక యశోవర్మ భోజముంజ హర్షదేవ విక్రమాదిత్యాదులున్న, ఈ వంకను రాజనరేంద్ర కృష్ణరాయ సర్వజ్ఞ సింగమాదులు కలరు. కావున తెలుగును తెలుఁగు కవులను గీర్వాణీ గీర్వాణ కవులతో తుల్యయోగక్షేమము కలవారే. అట్లే ఆ పౌర జానపదులును, ఈ పౌర జానపదులును. మఱి యట్లు గాకున్న నాటకమునకు ఏ కారణము చేతనేని నిషేధము కలిగియుండెనా? వేదవేదాంతములను, షడ్దర్శనములను ఇంకను నానింబోలిన శాస్త్రములను సంస్కృతము నుండి తెలుఁగున అనువదింపమి వానియందలి దివ్యత్వాభిమానముచేతను అంతయెత్తున మడిగా నున్న వానిని ఇంతక్రిందికి, దేవభాషనుండి దేశభాషకు దింపి మైలపడఁజేయరాదను వాని గౌరవము చేతను, సంప్రదాయముచేత పదిలముగా నున్నవానిని సంరక్షింపక సర్వజన సులభము సేయుట యపచారమగునను తలంపుచేతను. ప ఱి యిట్టి కారణములు కావ్యవిశేషమాత్రమే యగు నాటకమునెడ పొసఁగవు. మఱి యక్షగానములు, కూచిపూడి భాగవతముం బోలినవి ఆంధ్రులకు చాలి యున్నందున వారికి నాటకపుటక్కఱతోఁపదయ్యెను అని యూహింతుమా యన్న కూచిపూడి భాగవతము పుష్కల భరతనాట్యముగల దగుటచే ఎంతయు రసవంతము కాఁగా, ఆంధ్రుల తలంపు నాటకమువీఁదికిం బోలేదు అనఁజెల్లదు. అట్టి నాట్యమున కన్న నాటకము ఎంతయు రసవత్తరమని కాళిదాసాది మహాకవులు సూచించినారు. కాళిదాసు పలికిన నాట్యశ్లాఘ నాటకమునకును జెల్లును— ఇదె అది.

> దేవానా మిద మామనన్తి మునయః
> కాన్తం క్రతుం చాక్షుషం
> రుద్రే ణేద ముమాకృత వ్యతికరే
> స్వాఙ్గే విభక్తం ద్విధా
> త్రైగుణ్యోద్భవ మత్ర లోక చరితం
> నానారసం దృశ్యతే

నాట్యం భిన్నరుచే ర్జనస్య బహు ధా
ప్యేకం సమారాధనమ్. మాళ—1.

మఱి కాళిదాసు నాటకములు రచించినాఁడు. మఱియు తనకుం బూర్వులు భాస సౌమిల్లి కవి పుత్రాదులు నాటకములు వ్రాసి ప్రసిద్ధి కన్నారనియు సూచించి నాఁడు. తాను మాళవిక కాక మఱియు రెంటిని విక్రమోర్వశీయ శాకుంతలముల రచించి నాఁడు. మాళవికలో నాట్యాచార్యులను ఇరావతీ మాళవికలను దచ్ఛిష్యలును, మాళవిక నాట్యప్రయోగమును 'దుల్లహో పి ఓ, తస్సిం భావ హిఅఅ ణి రాసం' ఇత్యాది క్షేత్రలయ సుప్పగోపాల పదముం బురణించు పదమును, దాని యుపగానమును, సుష్రాణి నయమును, దాని నిర్గమనమును నాట్యాంతమున 'వృత్తా దస్యాః స్థిత మిలి లరాం కాన్త మృజ్వాయ తార్థమ్.' అని మాళవిక నిల్చిక హొయలును అద్భుతముగా వర్ణింపఁబడినవి. నాట్యారంభ సూచకముగు మద్దెల మ్రోతఁయే ప్రేక్షకుం నాకర్షించు ననియు—'అథవా మృదఙ్గ శబ్ద ఏవ న ఉత్థాపయిష్యతి'—'వినాయుక తాళవు' మద్దెల ధ్వనియే జనము నాకర్షించు కూడిపూడి వెంపటి వారి ఆటను మించిన మేజువాణి చెప్పఁబడినది. మఱి నాట్యము బ్రహ్మానందముం గూర్చునదే. ఐనను దానిని కాళిదాసు నాటకమున అంగముగా అడంచినాఁడు. మాళవిక నాటక కాలమున మాళవిక నాట్యములు బోనివి పెల్లుగా కలవు. మఱి నాటకము 'అనయునిగా పుట్టనే పుట్టినది. విక్రమోర్వశీయము నను ఉర్వశీ రంభాదులు అతినిపుణలు. నిత్య నృత్య ప్రదర్శనములు గావించు స్వర్గమున 'లక్ష్మీ స్వయం వరము'ను నాటకమును, సాక్షాత్సరస్వతి రచించిన దానిని భరతముని యొజ్జనమునసే వారిచే ప్రయోగింపించి నాఁడు. దానికి కొన్నిదినములు ముందే, ఇందు లక్ష్మివేషము వేసిన యుర్వశి అలకలో కుబేరుని యోగాగమున—

'ఊరుగా ద్భవా నరసఖస్య మునేః సురస్త్రీ
కైలాసనాథ 'ముపనృత్య' నివర్తమానా'

అని మేజవాణి జరిపి వచ్చినదఁట. కాళిదాసు కన్నం బ్రమాణ ముండుగా, నృత్య నాటక తారతమ్య నిర్ణయమునకు? ఇది యున్నదని అది మానుదురా? ఒకటి యున్నదని యొకటి మానుదురా?

ఇంగ్లధమున నాటకములు ఇటీవలివఱకు రచింపఁబడమికి శ్రీ వేదము వేంకటరాయ శాస్త్రులవారును కారణముల నూహించుచు 1901—గ్రామ్య భాషా ప్రయోగ నిబంధనమను పేర గ్రంథమున ఇట్లు వ్రాసిరి. (కావ్యాలంకార సంగ్రహ కావ్యాలంకార చూడామణి ప్రభృతులైన) లక్షణకారులచే లను గృహీత మయ్యును నాటకము తెనుఁగు కవులచే పరిగృహీతము కాలేదేమి? కానందులకు కారణ మొకటి—మనవారు మేకలమంద స్వభావముగా రగుట. 'గతాను గతికో లోకః'. మఱి యెంతమాత్రమున వీ రాచరించిన దెల్ల నంగీకృతమనియు, అంగీకృత మెల్ల వీరు వ్రాసిరనియుఁ దలంపఁదగదు.........మన వారు మేఁకదాఁటుగా చిరకాలము పురాణముల నాంధ్రీకరించి తద్వాతం ప్రబంధంబుల విరిగి ఇప్పుడు అన్యమౌం దొడంగినారు. మఱియు గీర్వాణ నాటకముల నెఱింగియు, హూణ నాటకములం జదువు వఱకు నాటకముల వ్రాయరైరి. గీర్వాణ కథల నెఱింగియు హూణ నవలలం గాంచిన దనుక నవలల పయిం బడరైరి మఱియు గద్యకవిన మొక ప్రస్థ కాదఁట. ఆ భావముచే నవలలు లేకపోయినవి. నాటకములు వ్రాయమికిని అట్టి కారణమే యొకానొకటి గలదు. కావ్యాలంకార చూడామణి—

చ. వినుత యశంబునం గలుగు
విశ్రుత నాక నివాస, మయ్యశో
జననము శ్రవ్యకావ్యముల సంగతి
నొప్పగు; శ్రవ్యకావ్యముం
దనరుఁ గవి ప్రభావమునఁ;
దత్కృతి నమ్మతిలేని రాజు లే
పున విహరింప; దవ్విభులు
పోయిన జాడ లెఱుంగఁ బోలునే?

మ. కవి సంసిద్ధ పదంబు భావ రస
విఖ్యాతంబు లోకోచిత
వ్యవహారంబు నుదాత్త నాయకము
శ్రవ్యంబుం చతుర్వర్గ సం

భవ సద్మంబగును నైన కావ్య మిల
నా పద్మోద్భవ స్థాయియై
కవి సంస్ఫూర్తియు దాత్తకీర్తియుఁ
దాం గల్పించు నెల్లప్పుడున్.

ఈ ప్రకారం జూడఁగా మనవారు శ్రవ్యకావ్యము మాత్రమే సప్త సంతానములలో చేరినదనియు, ఆముష్మికాభ్యుదయ ప్రదమనియు, దృశ్య కావ్య మట్టిది కాదనియు తలంచిరని యొక రహస్యము వెలువడు చున్నది. మహాకవు లెవరును రూపక లక్ష్య రచన సేయమి కిది ప్రథమ కారణము కానోపు. ఈ రెండును బాహుళ్యమునకు లక్షణ రచనకు అడ్డమైనవి. 'సా హి నా టలి ! విస్తారం వివిక్తే వ్యాఖ్యాస్యాగతమ్.'

మఱియు పూర్వులు రూపక రచన సేయనే లేదనుట యొప్పదు. శ్రీనాథుఁడు వీధినాటకమును రచించెనని ప్రసిద్ధము గదా. అతఁడు బూతులు చేర్పక యుండిన అప్పటినుండియే నాటకము లల్లుకొనియే యుండును. అన్యులను పూర్వులు నిజ సత్త్వాను సారముగ నాటకములను రచించియే యున్నారు; దృష్ట బహు ప్రయోజనంబు గావునను ముఖ్యముగ ఆనంద నిష్యంది గావునను, పెద్దనాది లక్షణకారులచే ఆను జ్ఞాతంబు గావునను, మఱియు ప్రబంధము నతోఁ ప్రాణము విసిగి పోయినది గావునను నాటకము మనకు ఉపాదేయమే' అని.

పాశ్చాత్య నాటక చరిత్రను ఆలోడించిన షేక్స్పియరు యుగపు నాటకాలకును వాని ముందువి కాని, వాని తర్వాత క్రమముగా ఎక్కువ తక్కువలతోను ఎగుడు దిగుడులతోను ఒడుదుడుకులతోను పలు తెఱంగుల నేటి వఱకు వచ్చిన సకల నాటకములకుఁగాని కల తారతమ్యమును పరిశీలించిన, ఎంత తలపోసినను, ఆ నాటి నాటకాల ఘనత 'నభూతో న భవిష్యతి.' అనియే తోఁచును. షేక్స్పియరు షేక్స్పియ రగుటకుం గారణము ఎవరు చెప్పఁగలరు? అది యింగ్లండు నదృష్టము! షేక్స్పియరు నాటకముల పెక్కువయు వైవిధ్యమును మఱి యేకవి యొడను కానరాదు. అతని సృష్టిలో లేని తరహా మానిసి మఱి బ్రహ్మ సృష్టిలో లేఁడు. అసామాన్య ప్రతిభ అతి కాదా

చిత్కమును అతిక్వచిత్కమును. షేక్స్పియరు నాటకములలో హామ్లెట్టు తల్లితప్ప మఱి పతి ద్రోహము చేసిన స్త్రీ లేదు. మానవులలో ఎందేని అట్టిదియు నుండును గాన ఆ ప్రతిభకు గోచరించినది, సకృన్నిర్దిష్టమైనది.

తెలుఁగున నాటకము ఆధునికము కాని ప్రాచీనము గాదు; మఱియు ఇతర లక్ష్యములచే ప్రతిబద్ధమే గాని స్వతంత్రమును క్రొత్తమార్గమువియు గాదు. కావుననే ఒకప్పుడు ఒకానొక యాంధ్రమనీషి నెవ్వగతోనుం బోలె ఇట్లు ఎచ్చరించెను. 'నాటకములలో ఇది తెలుఁగుది అని చెప్పఁదగిన వైలక్షణ్యము లేదుగదా తెలుఁగు నాటకమునకు!' అని. ఉండునేని ఆ తెలుఁగు భాగ్యమునకు సంతసింప వచ్చును గాని, లేమికై వగవ నేల? ఆ రామాయణమే ఈ రామాయణము, ఆ పురాణమే ఈ పురాణము, ఆ నైషధమే ఈ నైషధమును. అందులకు వగపు లేదు గదా. అట్లే ఆ నాటకమే ఈ నాటకమును. అలంకార సంగ్రహాలంకార చూడామణులును గీర్వాణ సాహిత్య మీమాంసా ప్రకృతికములుగాని స్వయం వికారములు గావు. పాశ్చాత్య సంపర్కము అంకురించి క్రమముగా ఎదిగి ఆంగ్లపాలనయు, దాన విద్యాస్థానములలో ఆంగ్లము దేశభాషలమించిన ప్రాధాన్యము పొందుటయు, ఆంగ్లులకు నాటక ప్రయోగములు వాడుకలో నుండుటయు, అప్పుడే పార్సీ నాటకముల ప్రయోగములును రాజధానులం గలుగుటయు, భారతదేశ భాషలందును, అందు ఆంధ్రమందును అనుకారము గాను సొంతము గాను నాటకమును తత్ప్రయోగమును మొలకెత్తుటకు కారణమయ్యెను.

అయినను నాటకము ఇప్పుడు ఉత్పన్నమగుటచే శాకుంతలాదుల దైన స్వదేశమార్గమున మాత్రమే కాక షేక్సుపియరు ప్రభృతుల దైన విదేశమార్గమునను నడచుచుండుటయు, అటుపోవుదునా ఇటుపోవుదునా అని గందరగోళపడి ఎటునుం బోఁజాలక విమార్గమునం గుంటువడుటయు కలుగు చున్నది. స్వదేశ విదేశ మార్గములకు స్పష్టమైన భేదములు ఏమి కలవు అన్న, ఏ కావ్యమునకును ఏ భాషలోని దానికైనను 'రసాత్మకత్వమే' లక్షణము. నాటకము విశేషమగుటచే దానికిని ఎల్లెడలను అదే. ఇందు భేదము లేదు. కాని రచనలలో గురుతైన భేదమే గలదు. గీర్వాణ నాటకమునకు అంకములే విభాగములు. గాని అంకమునకు అవాంతర విభాగములు లేవు. కావున దేశకాల క్రియైక్యములు సుఖ ఘటితము లగును. ఆంగ్ల నాటకమున అంకములకు ప్రాయికముగా అవాంతర విభాగములు 'సీన్' అని వ్యవహ్రియమాణములు గలవు. వానిచే దేశ కాలైక్యములు నష్టమైనను, క్రియైక్యము వస్త్వైక్యము సుఘటిత మగును. ఈ భేదమునకు కారణము ఆయా జనమునకు అలవడిన ప్రేక్షాగృహ యవనికా రంగ పరికర సన్నాహ ప్రకారము గాని, అంతకన్న ప్రధానమైనది మౌలికము మఱేదియు గాదని పెద్దలు చెప్పుదురు. గీర్వాణ నాటకములు 'మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతాని' అను మర్యాదకు ఎడయకున్నవి. మఱి యన్యములలో అమంగళాంతములు నాయక మరణ పర్యవసానములు గలవు. ఇందుల కారణము స్వదేశీయులకును విదేశీయులకును ఐహికాముష్మిక దృష్టియందు గల భేదమును, దేశాచార భేదమును, చిత్తపరిపాక భేదమును ఇంకను ఇట్టిది ఊహింపఁదగును. (కిరణావళి అని యొక నాయక మరణ పర్యవసాయి నాటకము, ట్రాజెడి, ఉండెనన్న ప్రథయే కాని అది దొరక లేదు.)

ఆంధ్రమున నాటక రచన తక్కిన పురాణ కావ్యాది రచన వలెనే ఇంచుమించుగా అనువాదముగా ఆరంభమైనది. శాకుంతలము రత్నావళి మాళవిక వేణి—ఇట్లు అన్నియు అనూక్తములే. మునుపు పురాణ కావ్యములను ఒకరు అనువదించిన దానినే మఱి యొకరును అనువదించుట అంతగా కలిగినది కాదు. మఱి నేఁడు ఒక్కదానికే పలువుర యనువాదము లున్నవి. అయినను నాటకరచనయొక్క చరితమును తెలుఁగున ఎన్నఁడు ఎవరు ఏ నాటకమును రచించిరి అను నాను పూర్విని ప్రస్తావింప దలంపను. ఏలయన, వానిలో తొలి తొలి రచితములు ఇట్టివి, తరువాత రచితములు ఇట్టివి, అటుతర్వాత ఇట్టివి అని చెప్పఁదగిన పరిణామమును వైలక్షణ్యమును అగపడవు. వీరేశలింగ కవి శాకుంతలము అనువాదములలో మొదటిది (?) కాఁబోలు, అట్లే రామకృష్ణ కవి చిత్రనళీయము

స్వతంత్ర రచనలలో మొదటిది(?) కాఁబోలు. అప్పారాయ కవి కన్యాశుల్కమును వేంకటరాయశాస్త్రి కవి ప్రతాపరుద్రీయమును వేఱువేఱు సరణిని చూపునవి వానివాని మార్గమునకు తొలివి(?) కాబోలు. తరువాత అచిరకాలముననే శాకుంతలమువంటి యనువాదములును, చిత్రనళీయము వంటివి పౌరాణికేతివృత్త విలసితములు స్వతంత్రపు వ్రాఁతలును, కన్యాశుల్కముం బోనివి జనుల దురాచారముల దూషించునవియు సదాచారముల భాషించునవియును, ప్రతాపరుద్రీయము వంటి పూర్వరాజ చారిత్రాత్మికములును పెల్లుగా పొడమఁ జొచ్చినవి. ఇటీవల 10, 15 ఏండ్లుగా నాటక రచనలో తీవ్రము హెచ్చినది. పదులుగాఁ గాక, నాటకములు నూఱులుగా వెలువడు చున్నవి. ఇందులకు ఒక కారణము ముఖ్యమైనది. నాటక ప్రయోగముల పెల్లిదమును, ప్రయోక్తలు జనరంజనకయ్యును ధనార్జనకయ్యును క్రొత్త క్రొత్త వానిని కోరుచుండుటయు. నానారూప రూపకముల రచనకును ప్రయోగ బాహుళ్యమునకును దిద్భ్రాంతి శయమునకును కారణము అరయుదు మేని విద్యావ్యాప్తియు, పాశ్చాత్య సంపర్కమును, వీనిచేత కలిగిన కవులయు జనులయు కుతూహలమును. 'Bioscope' (ప్రదర్శనమును) నాటక (ప్రయోగ)మును ఒండొంటి నాశ్రయించి ఇప్పటికి ఒండొంటిని పెంచి పోషించుకొనుచున్న వనఁదగును. ఇఁకనెన్నటికి దేనిచేత ఏది యడఁగునో. (Foot note ఇప్పటికీ 'సినిమా' నాటకమును అడగార్చి వేసిన దనఁదగును. నాటకము ఇపుడు ఎంతయు నరుదు.)

ఈ నాటకముల పెల్లిదము ఆంధ్రి బలుపును సూచించునా వాపును సూచించునా అని విచారింపఁదగును. నాటకము కావ్యములలో రమణీయ తమము. 'నాటకాన్తం హి సాహిత్యమ్' అనియు నానుడి. 'సన్దర్భేషు దశరూపకం శ్రేయః' అని వామనాచార్యుఁడు. శాకుంతలోత్తర రామచరితాదులు ఉదాహరణములు. శాకుంతలాదులు ఎన్నియో నూర్లయేండ్లకుం బూర్వము ప్రసిద్ధములు (ప్రయుక్తములును), రసవత్తయందును ఉదాత్తత యందును నాణెమునందును నాజూకు నందును ఉత్కర్ష పరమావధిం బొందినవి. నిత్య నవములే. నేటికిని వానిని మించినవి ఎందును లేవు. అట్టి యుత్కృష్టవస్తువు సంఖ్యాతీతముగా ఎన్నఁడైన రచింపఁబడునా? శక్యమా? సంభావ్యమా? వేయింటి కొక్కటి ఎన్నఁడు ఏర్పడుండునో! వార్తా పత్రికలలో ఏకదినమాత్రానుభవమునకు చాలినట్టియు అటుపై విసికించు నట్టియు సకృత్పఠన క్షమములైన వ్రాఁతలుండునే, తత్తుల్యములుగా నున్నవి పెక్కు అధునిక నాటకములు. అది న్యాయ్యమే, కాని ఆ కవులకు మాత్రము తమ కృతులందు వాని శాశ్వతికతం గూర్చిన యభినివేశమును అభిమానమును న్యాయ్యము గాదు. అయిననేమి? ఎవనికి తన కృతియింపుగా నుండదు? కావున 'ఆ పరితోషా ద్విదుషాం' అని విద్వత్పరితోషము తీర్పరి. అంతకన్నను కాలము తీర్పరి. రసవత్తచే కృతి చిరస్థాయి యగును. రసహీనతచే రేపే మఱవఁబడును. గ్రంథరచనకును ముద్రణ ప్రకటనలకును ఈ కాలమున ఉండు సుకరోపాయములనే ఎల్లవారును ఏ పాటివారును రచింతురు గాక. కాలము తఱకను చిమ్మిగింజను నిలుపును.

అనువాదము సప్రయత్నమైన వ్రాఁతయే. దానికిని ఎంతయో పాండితి వలయును. మూలార్థము రసము సర్వము అవగతమై అనుభూతమై తద్రసానుభవ పరీవాహము కాని యా కవి వ్రాఁత యేల? అనవగత మూలార్థమును విరసము నగు వ్రాఁతకు ఒక ఉదాహరణము.

స్వప్నవాసవదత్తము — ఇందు వత్సరాజునకు శత్రుభయము తీఱి మఱి రాజ్యవిస్తరమును చేకురఁ గలదన్న జోస్యమును నమ్మి, దానికోసము మాగధి యగు పద్మావతితో పెండ్లి కూర్పఁ గోరి, అది సులువగుటకు యౌగంధరాయణుఁడు వాసవదత్త కాలి పోయినదని నమ్మఁదగినట్లు ప్రవాద పఱపి, ఆమెను హరించికొనిపోయి తాను ఉజ్జయిని బ్రాహ్మణుఁడను మాఱువేసాన ఆమెను (ఉజ్జయినిదైన) తన చెల్లెలుగా ఎట్లో తెలియనీకుండ మాఱువేసాననే ఆ పద్మావతి కడనే ఇల్లడపెట్టి పోయినాఁడు. వాసవదత్త అవంతిక యను పేరుతో మాగధి యంతఃపురమున రహస్యముగా ఉన్నది. ఆ పద్మావతికిఁ గాని అక్కడ మఱి యెవరికిఁ గాని ఆమె వాసవదత్తయని తెలియదు.

ఎవరో ఆవంతిక యని, అంతే. అంతట ఎట్లో రాజ గృహ నగరమున వత్సరాజ పద్మావతులకు పెండ్లి యైనది. అంతట వత్సరాజు ఆట నుండఁగానే వాసవదత్త నాయన తన మామ ఉజ్జయిని ప్రభువు మహాసేనుని యొక్కయు, పద్మావతియన్న తన బావమఱది మగధరాజు దర్శకునియొక్కయు సేనల సాయమున వత్సరాజునకు రాజ్యవిస్తర లాభములు కలిగినవి. అపుడు వాసవదత్త తల్లి వత్సుని యత్త అంగారవతి వీడని యల్లుని మీఁది వాత్సల్యముతో మునుపు వాసవదత్తను వత్సరాజు హరించికొనిపోయినపుడు, ఆ యిరువురికిని ఉజ్జయినిలో పెద్ద చిత్రఫలకములు వ్రాయించి, ఆ చిత్రగతులకు యథావిధి వివాహము చేసియుండెను. ఇప్పుడు ఆమె ఆ చిత్రఫలకములను వాసవదత్తా వియోగ దుఃఖ వినోదమున కని రాజగృహమున వత్సరాజునకు పంపెను. ఆ వాసవదత్త చిత్తరువుం జూచి పద్మావతి ''ఈ పోలికది 'ఆవంతికమ్మ' అని నాకడ ఉన్నదే'' అనుకొని 'ఆ పటము వాసవదత్తను (తన సవతి=) తన యక్కను చక్కఁగా పోలియున్నదా, ఆర్యపుత్ర' అని వత్సేశుని యడిగెను. అందుల కాతఁడు 'పోలుటయా! సాక్షాత్తు ఆమెయే యనవచ్చును.' అని బదులు పలికెను. అంతట పద్మావతి 'అట్లయిన ఆ (నా పెద్దసవతి) నా యక్క ఇక్కడనే నాకడ ఉన్నదే' అనెను. అందులకు వత్సరాజు 'ఏమి, వాసవదత్త పోలికదా! అట్లైన ఆమెను పిలుచుకొని రమ్ము' అనెను.

ఇచట పద్మావతి ఆ చిత్ర దర్శనము మొదలుకొని రవంత చిత్తమున గందరగోళపడి యున్నట్టిది.

ఆత్మగతమున 'ఈమె—(ఈ చిత్రగత)— ఆవంతి కమ్మను మిక్కిలి పోలియున్నదే!' అని యనుకొనును.

ప్రకాశముగా—ఈమె (మా) అక్కను చక్కఁగా పోలియున్నదా?' అని యడుగును.

'పద్మావతీ - (దృష్ట్వా ఆత్మగతమ్) హుం!
అతి సదృశీఖ
ల్వియం ఆర్యాయా ఆవన్తికాయాః!
(ప్రకాశమ్) ఆర్యాపుత్ర, సదృశీఖ ల్వియ
మార్యాయాః?'

ఇందు ఆత్మగత్మమున ఉన్న 'ఆర్యాయాః' తనవద్ద ఇల్లడగానున్న ఆ వంతికకు పూజావాచకము 'ఆవంతికమ్మ' అనుట. ప్రకాశమున ఉన్న 'ఆర్యాయాః' తనకు గురుజనముగా పూజ్యురాలైన సవతికి వాసవదత్తకు 'అక్క' అని బాంధవ నిర్దేశము. ఈ గుట్టు తెలియక, అక్కడి సంవిధానమే ఇంచుకయైనను తనకు ఆకళింపు కాక, అంధ్రీకర్త.

'ఆర్యపుత్రా, యీ ప్రతికృతి అర్యురాలైన యావంతికను పోలియుండలేదా' అని యనువదించెను. వత్సరాజునకు అవంతిక యెవరో అదేమో అప్పటికి తెలియనే తెలియదు కదా. ఇది అంధ్రీకర్త యజ్ఞానపు విలాసము!

అవగత మూలార్థమునకు సరసమునకు సాధు వ్యాఖ్య యనందగిన దానికి ఒక యుదాహరణము.

శాకుంతలము: — దుష్యంతుఁడు శాపహత స్మృతియై మునుపు కణ్వాశ్రమమున తాను శకుంతలం గూడిన వాఁడగుటను బొత్తిగా మఱచిపోయి, కాశ్యపులు నాయనచే తనకడకు పంపఁబడిన యామెను నిరాకరించెను. కాని తనకేమో చిత్తము ప్రసన్నముగా నుండలేదు. ఋషికుమారులు తమ గురువు నానతిని ఒత్తియొత్తి పలుకుటయు, అనవద్యాద్భుత రూపయగు నా శకుంతల విఃక్కిలియు తన్ను నమ్మించు నంతగా ఏడ్చుటయు, కోపపడుటయు, ఋషికుమారులు ఆమెను ఏమైన కానీ అని అట విడిచియే పోవుటయు, నడివీథిలో చావుగోరి యేడ్చుచున్న యామెను ఒక యాఁడు జోతి మింటిమార్గాన ఎత్తుకొని పోవుటయు, ఇదెల్ల కన్నవిన్న యాతనికి చిత్తమెంతయు వెతచెందియే యుండెను. ఐనను ఎటి మనోవేదనం గూడ కాలము తగ్గించును, మఱపించును, మాన్పును. అట్లు కాఁదగినట్లు నాలుగేండ్లు గడచినవి. ఒకనాఁడు ఒక జాలరివాని యొద్ద తన రతనాలముద్దుటుంగరము పట్టువడఁగా, దానిం గాంచి అది తాను శకుంతలకు అశ్రమాన ఇచ్చినది యని ఒక్కుమ్మడి ఆ శకుంతలా సంయోగ వృత్తాంతము సర్వమును జ్ఞప్తికి వచ్చినది. తాను నగరులో ఆమె యెడం జూపిన నిరాకరణ క్రౌర్యమునకును, ఆపె పోవనే పోయినదే. ఎట్లో ఇకఁ దొరక

వట్లు అన్న నిరాశకును, ఆమె యేమైనదో గదా యున్న జాలికిని, కలిగిన యనుశయ దుఃఖమునం గుములు చున్నాఁడు. తాను సంతాన హీనుఁడు, ఆమె గర్భవతిగాను ఉండేనే యన్న తలంపు ఆ దుఃఖపుట పాకమును మఱియు నుడికించెను. అది ఒక నాటికిని తీఱు నుపాయము తోఁపకయే యున్నది. అట్లుండ నొకనాఁడు యుద్ధ సాహాయ్యమునకు ఇంద్రుఁడు ఆతనిని స్వర్గమునకు బిలిపించెను. ఇంద్రునికి జయము ను గూర్చి, ఆతని తేరుననే రాజధానికి మరలుచు దారిలో మాతలి మాటచే అదితి మారీచుల సేవింప తదాశ్రమముచెంత హేమకూటమునం దిగినాఁడు. వారి దర్శనమునకు సమయము పరికింప మాతలిం బంపి తాను అటం గను పెట్టుకొని ఉండఁగా తనకు మనః ప్రసాదము గలిగినది, కుడిభుజ మదరినది. అట్లు శుభశకునమైనది. అప్పటి తలపోత—

కోరికను నే వదలితిన్
వారక నీ వదరు దేల? వమ్మ. భుజమా.
ధారిణిలోఁ బూర్వం బవ—
ధీరిత వౌ మేలు వెండి మరలుట గలదే?

దుష్యంతునికి ఇటీవల, తన తీఱని దుఃఖాన, ఒక్కటే యొక్క మనోరథము, శకుంతల పునః ప్రాప్తి. అందుల కవకాశమే లేదని తాను వదలుకొని యున్నాఁడు. మునుపు తనంతట తనకడకు వచ్చిన దానిని అట్లు నిరాకరించి తఱిమి వేసినాఁడు. మఱి ఆమె యేమై పోయినదో! ఏండ్లు గడఁచినవి. ఇఁక తనకు మరల దొరకునా? ఒక తూఱి వచ్చిన మేలును అవధీరణ చేసిన, అది మరల దొరకుట (దుఃఖము=) మిక్కిలి కష్టముగదా—అనుట. ఇట్లు నిరాశనే నోటఁ బలుకుచున్నను, శకునముచే కోరిక తీఱు నేమో—యను మెరమెర మనసున ఎక్కడనో అడుగున ఒక మూల ఆడుచునేయున్న దనుట. అట్లే ఇఁక ఇట శకుంతలాపునః సమాగమప్రాప్తి కలుగనే కలుగును. ఇదిగో మూలము.

మనోరథాయ నాశంసే
కిం బాహో, స్పన్దసే? ము ధా.
పూర్వావ ధీరితం శ్రేయః
దుఃఖం హి పరి వర్తతే.

Statement about ownership and other particulars about newspaper

BHARATI

FORM IV (SEE RULE 8)

1. Place of publication: Madras
2. Periodicity of its publication: Monthly
3. Printer's Name: Sri S. Nageswara Rao
   Whether citizen of India Yes
   If foreigner, state the country of origin —
   Address 16, Luz Avenue, Mylapore, Madras-4.
4. Publisher's Name: Sri S. Nageswara Rao
   Whether citizen of India Yes
   If foreigner, state the country of origin —
   Address: 16, Luz Avenue, Mylapore, Madras-4.
5. Editor's Name: Sri S. Radhakrishna
   Whether citizen of India Yes
   If foreigner state the country of origin —
   Address: 16, Luz Avenue, Mylapore, Madras-4.
6. Names and addresses of Individuals who own the newspaper and partners or share-holders holding more than one percent of the total capital.

NAMES	ADDRESSES
1. Mr. S. Radhakrishna	16, Luz Avenue, Mylapore, Madras-4.
2. Mrs. S. Kamakshamma	Do
3. Mr. S. Nageswara Rao	Do

I, S. Nageswara Rao hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

S. NAGESWARA RAO
1-3-73 Signature of Publisher

'దుఃఖంహి పరిణమతి' 'దుఃఖముగా మాఱును' అని వైఖానస శ్రీనివాస జీవానంద విద్యాసాగర గజేంద్రగడ్కరాదులు 'దుఃఖమును' విశేష్య—ముగాఁ గొన్నారు. రాఘవభట్టు శతావధాన శ్రీనివాస వేంకటరాయ శాస్త్రుల వారలు (పరివర్తించుటకు) వెండియు మరలుట (దుఃఖము) కష్టము గదా. అని దుఃఖమును అవ్యయముగఁ గొన్నారు. ప్రకరణమునకు అది సరి. (కాళిదాసున ఈ 'దుఃఖము'నకు అవ్యయముగా సంవాద ప్రయోగములు గలవు.)

మఱి స్వతంత్ర రచన స్వతంత్ర రచనయే, కవి ప్రతిభ కొంతయు తేజరిల్లును. ఉత్కట ప్రతిభ కాదాచిత్కమును క్వాచిత్కమును. కనుకనే చెప్పితిని, ఈ నాటకముల పెక్కువలో ఏ యొక కొన్ని 'గింజలై' చిరస్థాయు లగునో. అరయఁగా అరయఁగా ఇప్పటి నాటకముల వలన దేవికి ఆంధ్రికి ప్రాయికముగా వాపే కాని బలుపు లేదని తోఁచును. అయినను భయము లేదు; దేవికి ఈ వాఁపు చేతనే కాదు గదా, ఏ వాఁపు చేతను అపాయము కలుగదు. అందులకు మందూర మును పుటము వేయుటకు కాలము వెజ్జు.

ఆంగల కావ్యములం జూచి పెందఱు తెనుఁగు కవనమున యతిప్రాస నియమును తెగఁగొట్టం జూచు చున్నట్లే, నాటకములందు పద్యములను మాని కేవలము గద్యమునే కూర్పవలయును అనుటనుం దెచ్చి, ఆ మార్గమున రచించుటయు అందందు కలిగి యున్నది. కాని ప్రచురముగా పద్యములు కలిగిన వానిని రచించుటయే తెలుఁగున కాన నగుచున్నది. ఇది గీర్వాణ మర్యాదానువర్తనము. (ఆంగ్లమునను పూర్వము షేక్స్పియరాదులయందు పద్యమే కాని, అది గద్యతుల్యమైనది, 'Blank Verse' అనంబడునది. మఱి దానితో అందందు కేవల గద్యమునుం గలదు. ఆ పండితులు వాని భేదముం బరికించి, ఇట్టి చోట్ల షేక్స్పియరు కేవల గద్యము నిడును. ఇట్టి చోట్ల బ్లాన్క్ వర్స్ ఇడును అను నిర్ణయముం జేయఁ జూచినారు) పద్య రూపమున మానవులు సంభాషింతురా, ఆ మర్యాద గీర్వాణమున మాత్ర మెట్లు, దానిం బట్టి తెనుఁగునను ఎట్లు అని యాక్షేపింతురు. అది న్యాయ్యమే. అయినను నాటకములో రెండు ధర్మములను భరతముని చెప్పినాఁడు— లోకధర్మి నాట్యధర్మి అని. లోకధర్మియందు వస్తువు ఎట్లు జరిగినదో అట్లే రచితమగును, అట్లే ప్రయోగింపఁబడును. నాట్యధర్మియందు గీతము పద్యము మొదలయినవి రంజనార్థము చేర్పఁబడును, ప్రయోగింపఁబడును. పద్య శత్రువులు లోకధర్మియే కాని నాట్యధర్మి నాటకమున ఆశ్రయింపఁబడరాదని వాదింప రేని ఇట్లు చెప్పఁదగును భరతముని భూత భవిష్యద్వర్తమానములను సాక్షాత్కరించుకొనఁగల యార్ష చక్షువుతో చూచి కావించినది ఈ లోకధర్మి నాట్యధర్మి విచారము. నాటకమున కొంతయైనను నాట్యధర్మిని ఆశ్రయింపక తీఱదు. అడవులను కొండలను నదులను సముద్రములను, అట్లే కత్తిపోట్లను బాకుపోట్లను వాస్తవముగా లోకధర్మిగా ప్రదర్శింప నగునా? వాని కోసమైనను నాట్యధర్మిని ఆశ్రయింపవలదా? స్వగతమును లోకధర్మి కాదని ఉజ్జగించినను జనాంతికమును సంకేతము ఉజ్జగింప నగునా? నాట్యధర్మిని కొంతయేని ఆశ్రయింపనే వలయును. కాగా రంజనకు ముఖ్యాధారోపాయమైన 'పద్యమును నాట్యధర్మిచేత ఆశ్రయించుట శ్రేయమగును. రచనచేతను ప్రయోగము చేతను పద్యమువలన రంజన విశేషము నిజమా యని యడుగుదురు కాఁబోలు. పఠన—శ్రవణ దర్శనము లందు ఏది అనుభవమునకు అందునో! కావుననే ఏది ప్రత్యక్షమో దానికి ఇతర నిదర్శనము ఎందులకు? మల్లినాథసూరి మేఘ సంజీవనిలో (II. 32) చెప్పినట్లుగా ఏది ప్రత్యక్షానుభవసిద్ధమో దానికి వేఱు రుజువు లేల?

చూ. సంజీవని—

'వసు కి మిద మాదిమాం
వక్షుః ప్రీతి ముపేక్ష్య
ఉపస్థాస్తూరా శ్యేన తత్రభవాన్
కవి రాదృ రవాన్?

ఉచ్యతే—

పూర్వసఙ్గతయో రేవ ప్రవాస
ఇతి కారణాత్
వత్ర పూర్వద చ్చక్షుః ప్రీతి
రుత్పత్తు మర్హతి
....

'అథ తత్రాపి సన్దేహే
స్వకలత్రాణి పృచ్ఛతు
'కిం భర్తృప్రత్యభిజ్ఞా స్యాత్
కిం వైదేశిక భావనా
ప్రవాసా దాగతే స్వస్మి న్ని
త్యలం కలహై ర్వృథా' అని.

ప్రవాసాగతునియెడ చతుః ప్రీతి పొడమ దను టను మీా మీా భార్యలనే అడిగి కనుగొనుఁడు అన్నాఁడు.

కాళిదాసాది మహాకవుల నాటకములందలి పద్య గద్య సముదాయముం జూచి, వాని తారతమ్య మరసినం జాలును. మఱియు పద్యము వృత్తభేదములచే రస నిష్యందనమునకు కరముపకరించును. వడిని వారణ మును తెలుపుటకు ఈ మాలిని—

'న ఖలు నఖలు బాణః
సన్నిపాత్యో ఽయ మస్మిన్.' శాకుం.

(తుల్య సంవిధానమున ఇదె ప్రియదర్శికా నాగా నందాదుల యందును) తిట్టుటకు దెప్పుటకు ఈ ద్రుతవిలంబితము—

'అయి కఠోర యశః కిల తే ప్రియం
కి మ యశో నను ఘోర మతః పరమ్?'
ఉత్తర చరిత.

బెదరి కనులు మూతపడ్డ పార్వతిని తత్క్షణమే హిమవంతుఁడు చేతులం గొని పోవుచు పద్యవృత్త మహి మచే కనులయెదుట నట్లే ప్రత్యక్ష మగుటకును ఈ మాలిని—

సపది ముకులితాక్షీం రుద్ర సంరమ్భ భీత్యా
దుహితర మనుకమ్ప్యా మద్రి రాదాయ దోర్భ్యామ్
సుర గజ ఇవ బిభ్రత్ పద్మినీం దన్త లగ్నాం
ప్రతి పథ గతి రాసీ ద్వేగ దీర్ఘీ కృతాఙ్గః. కుమార.

ఎవతెయో స్త్రీ రూపపు జోతి తా ఫలానా యని తెలియనీని వడితో మింటినుండి ఒక్క యూపున వ్రాలి ఒక యూపుననే శకుంతలను తవూం ఎత్తుకొని ఎగసి మాయమగుటకు ఈ శాలిని—

సా నిన్దన్తీ స్వాని భాగ్యాని బాలా
బాహూత్క్షేపం క్రన్దితుం చ ప్రవృత్తా
స్త్రీ సంస్థానం చాప్సర స్తీర్థ మారా
దాక్షి ప్యైనాం జ్యోతి రేకం తిరోఽభూత్.
శాకుం.

లెంపువాటు చెప్పి బయలుదేరుటను—వృత్తమే సూచించుచున్నది.

'త దేషా భవతః పత్నీ,
త్యజ వైనాం గృహాణ వా...... శాకుం.

అట్లే—

రమ్యాణి వీక్ష్య మధురాం శ్చ నిశమ్య శబ్దాన్
పర్యుత్సుకో భవతి యత్ సుఖితోఽపి జన్తుః.
త చ్చేతసా స్మరతి నూన మబోధ పూర్వం
భావస్థిరాణి జననాన్తర సౌహృదాని. శాకుం.

ఈ సూక్తి యర్థమును గద్యీకరించిన దీని యానందమున ఏ యేకదేశమో కలుగును.

మఱియు ప్రయోగమున పద్యమున అర్థభావ ములకు రసానుగుణమగు రాగముం గూర్చి పాడుట శ్రేయము; ఆనందము శత గుణిత మగును. అది మఱియు అత్యంతము నాట్యధర్మి నిర్వాహ మగును. దాని గుణముం గూర్చి మరలను బ్రస్తావించెదను.

ఈ నాట్యధర్మి స్వీకరణ ప్రస్తావమున భాషిత ప్రకాశ స్వగతాది భేదములను అరయఁదగును. ప్రకాశ భాషితము లోకధర్మికిం జేరినదే. ఆత్మగత జనాంతి కాపవారిత కాకాశాకాశ భాషితములు నాట్యధర్మికిం జేరినవి. ఈ యన్ని తెఱంగుల భాషితములును అన్ని దేశభాషల నాటకాలలోను కాన నగును—గ్రీకు, ఇంగ్లీషు గీర్వాణి, ఆంధ్ర—ఈ యన్నింటను గలవు. భరత మునియు నాట్యధర్మిగా చెప్పినాఁడు.

'అత్రోక్తం చైవ య ద్వాక్యం
న శృణ్వన్తి పరస్పరమ్
అనుక్తం శ్రూయతే యచ్చ
నాట్యధర్మి తు సా స్మృతా' అని.

షేక్స్పియరు నాటకములలో స్వగతములు ద్రాఘీయములుగాఁ గూడ నుండునవి రసమునకును ఆనందమునకును అభినయమునకును వ్యుత్పత్తికిని మిక్కిలి ప్రధానము లని ప్రసిద్ధి. గీర్వాణమునను చాణక్య రాక్షసాదులవియు అంత ప్రసిద్ధములే. శాకుంతలాదుల యందు కుఱుచలే, రసము చిప్పిలు చుండును. తెనుఁగు నాటక కవులకు షేక్సుపియరును కొంత లక్ష్య మగుటచే, తెనుఁగు నాటకములందును ప్రాధాన్యము ప్రసిద్ధి గలవి కలవు. ప్రతాపరుద్రీయమున తురక సిపాయిలకు పట్టువడిన రాజు స్వగతము, ఆ రాజు గతిని కంటితోఁ గాంచిన విద్యానాథ మహాకవి స్వగతము, చిత్రనళీయమున దమయంతి ద్వితీయ స్వయంవరాహ్వానముం జదివిన బాహుకుని నాథనామక్రియా స్వగతము, అక్బర్ పఠాన్ రుస్తుమ్ హిందువుల పేరు మాపవలయునను తొలి స్వగతము, తన నాయననే—హిందూరాజును—తన సొంత చేతితో చంపితినే అను నిర్వేద దుఃఖముల యంత్య స్వగతము. చిత్రాంగి సారంగధరుం జంపించిన తరువాతి పశ్చాత్తాప స్వగతము, రోషనారా సివాజీ యొల్లఁడాయెనే అను నిర్వేద దుఃఖాల స్వగతము, పాండవోద్యోగమున పాండవుల నాశనము చేయఁగోరిన దుర్యోధనుని స్వగతము—ఇవి ఒక కొన్ని. ఇట్లు బహులక్ష్యదృష్ట ప్రశస్తమైనను, స్వగతము కతిపయ హూణ సాహితీ విమాంసకుల చేత ఇప్పు డిప్పుడు మనుష్య స్వభావ దూరమని నిషేధింపఁబడు చున్నది. కొందఱు నాటక కవుల చేత మానఁబడుచున్నది. ఇట్లు చెప్పఁబడినది—దానిని ఎంత మానిన అంత నేర్పు అనియు, దానిని స్వీకరించుట కవి యకౌశలముం బ్రకటించుమ అనియు. అది నిజమే. ఏ స్వగతమువలన ఏమి ప్రయోజనమో నాటకమున, దాని నిర్వాహమును సంభాషణ చేతనే చేయుటకు కవికి కడు ప్రతిభ వలయును. స్వగతము వ్రాయుటకన్న సంవిధానము గూర్చి ప్రకాశ భాషితము వ్రాయుటయే కరము దుష్కరము. అయినను భరతముని ముని, త్రికాలజ్ఞుఁడు, నాటకమున రంజనకోసము నాట్యధర్మిని స్వీకరింపుమని అనుశాసించినాఁడు. పూర్వాచార్యులును ఎల్లరు దానిని అవలంబించుటయే హితము అన్నారు. రంజనమేమో పెక్కింట అనుభవ విదితము. నవలలలో కవి సొంత వ్యాఖ్యానమును నాటకములలో పాత్రల స్వగతములును పాత్రల శీలము సరహస్యముగా నెఱుంగుటకు సాధనములని ఆంగ్లాచార్యులును ఉపదేశించి యున్నారు. ఇఁక నీ క్రొత్త సోకడ లేల?

(సశేషం)



గంగిరేగి చెట్టు

శ్రీమతి డా॥ పి. యశోదా రెడ్డి

ఎచ్చమ్మ తల్లి పురుట్లనె కాలం జేసింది. ఆ పిల్ల పుట్టింది మూల నక్షత్రం. ఇగ ఆ నక్షత్రబలం కొద్ది కావల్సిన పని అయింది. ఈ పిల్ల పుట్టి నా లక్ష్మిని దిగమింగెనని తండ్రి కాశిరెడ్డి పిల్లను జూస్తె సీములు జెర్లు వాకినట్లు సీదరిచ్చుకుంటుండె. పాపం ఆ పిల్లకు యాళ్లపాళ్ల సూసె టోళ్లు లేకపోతె, ఆ పిల్లను గొంచబోయి రుక్మిణమ్మ పెంచుకున్నది. ఆ పిల్ల పాలమూర్ల పెరిగింది.

కాశిరెడ్డి ఉక్కు కడ్డి అసుంటి మనిషి. నడుస్తుంటె బూమి నాదిచ్చేది. పల్క పెయ్యి, బారెడు ఎద, కోసు కండ్లు, సూడ సక్కని మనిషి. యశోదకు వొంకుల ఎంటికలు దప్ప అంతా తండ్రి పోవడే. తండ్రి నోట్ల దుసి పడ్డట్లుంటది. బిడ్డ దిక్కు మనసు రాయి జేసుకున్న కాశిరెడ్డికి ఎప్పుడో కలల భక్ష్యాలు దిన్నట్లు బిడ్డ కండ్లల్ల వడితే, రాయి వారిన మనసు ఎన్న ముద్దోలె అయ్యేది. అడప దడప పేష్షలకని, మొకద్దమల కని పాలమూరి కొచ్చినపుడల్లా బిడ్డను జూసి పోయెటోడు. అప్పుడు తనను బిల్సుకపోనికె వచ్చిన జతగాండ్లను జూసి 'అబ్బ, మా నాయి నొచ్చిండు. ఈయాళ్ల, గాజప్ప లాట ఆడను, పొద్దుమూకి గూడ ఎన్నలకుప్ప లాటకు ఉద్దిని ఎవర్నన్న ఏరుకోండి' అని ఇంటి కెవరో కావల్సిన సుట్టపాయన వచ్చినట్లు చెప్పేది. ఎప్పటి తీర్గనే ఈ త్యాప గూడ కాశన్న పాలమూరి కొచ్చిండు. ఎచ్చమ్మ కిప్పుడు తొమ్మిదేండ్లు. ఎప్పటి తీర్గ కాకుండ, ఈసారి తండ్రొచ్చి స్నానం జేసి రాంగనే అద్దం, బొట్టు పుల్ల, కుంకుమ తెచ్చి ఇచ్చింది. తండ్రి అద్దంల నామం దిద్దుకుంటుంటే, ఎన్కమండి వచ్చి 'నాయనా!' అని బుజాలు పట్టుకొని యాళ్లాడింది. తన మొకం పక్కకు బిడ్డమొకం అచ్చం చిన్న కాశన్నోలె అద్దంల గానొచ్చింది. అది జూసి తండ్రి కడ్పుల సేయి వెట్టి తిప్పినట్లైంది. అమాంతం సేతులు మల్సి బుజాల మీది బిడ్డను గుంజుకొని తొడ మీదేసుకొని 'ఎచ్చలూ! నా కన్నలూ!' అనుకుంట ముద్దిచ్చుకున్నడు.

ఎచ్చమ్మ తల్లి సరస్వతమ్మ తద్దినం పుష్య మాసంలనే వస్తది. సంక్రాంతి పండుగ ఆనాటికి రొండు దినాలు అటో ఇటో ఉంటది. ఇగ సంకురాత్రి నెల నిలవెట్టంగనే చెల్లెలు ముత్యాలమ్మ, మ్యానల్లుడు రఘునాథరెడ్డి, ఊళ్ల ఉన్న అల్లుడు ఎంకట్రెడ్డి అంతా ఆ యింట్ల జేరుకునెటోళ్లు. ఈ దినాలల్లనే పిల్లను ఎంటవెట్టుకొని పాలమూరి నుండి రుక్మిణమ్మ గూడ బిజిన పల్లెకు వస్తుండె బిజిన పల్లెకు వచ్చినపుడల్ల ముత్యాలమ్మ అన్నను జూసి 'అన్నా! తల్లిగారింటి సమందం తెగదెంపులు జేయకు. మా యత్తగారింట్ల నా మాట నెగ్గెటందుకు నా తల్లిగారి బలం ఉండాలె, అందుకోసం నీ పిల్లలల్ల ఓ దాన్ని నా కొడుక్కు ఇయ్యరాదా! నీ పిల్ల మా ఇంట్ల వడ్తె యాడాది కోనాడు సీరె, సారె, ఒడిబియ్యాలె గాకుండ, మన పిల్లల సమందాలు జూస్కొని రొండు ఇండ్లోండ్లకు రాకపోకలు నడుస్తవి. మీ బావ బిత్తు కొంచెం దగ్గతది' అని పీడిచ్చుక తింటుండె. ఆ పోరు పడలేక కాశిరెడ్డి 'నీ పొట్కు ఎక్కువైందే ముత్తెం, సరె నీలి నిస్తలే' అని మాటిచ్చిండు. కాని మొన్న పాలమూరికి పొయ్యి వచ్చినప్పటినుండి ఎశోదనే కాశన్న కండ్లల్ల మెదలవట్టింది. 'అరే, మా ముత్యాల కొడ్కు రాగనికి ఎచ్చమ్మను ఇయ్యాలె. నీలికి ఇంకో

కాడ గట్టి జేస్త'నని అనుకున్నాడు. అనుకున్నోడు అనుకున్నట్లె పెద్ద గుర్రాన్ని ఎక్కి చెన్నారం పయినమ్మై చెల్లెలు ముత్యాలమ్మ ఇంటికి వోయిండు.

ఎన్నడూ పిల్సి రాని అన్న పెద్ద గుర్రాన్నెక్కి పక్కడు, పక్కడు మనుకుంట వోచి ఇంటి కమాన్ ముందల దిగంగనే రంతు గుర్తువట్టి ముత్యాలమ్మ దబదబ పాలుకులకు నవ్వుకుంటొచ్చి, 'ఏందే అన్న, అంత బాగేనా?' అని అడిగింది. 'అంత బాగే ముత్యాలు. బావేడి? ఇంట్లకు పద. నీకో మాట జెప్పి పోవాలెనని వొచ్చిన' అని మాట్లాడుకుంట అన్నా చెల్లెండ్లిద్దరు భవంతిలకు వోయి కూసున్నరు. వెల్నెల్లి జూసి కొశి రెడ్డి 'సూడు ముత్యాలు, మొన్న త్యాప మనం అనుకున్నట్లు నీ కొడుక్కు సిరిని గాదు, తల్లిలేని పిల్ల ఎచ్చల్ను ఇస్త! ఇంతకు నీవెంత నోసుకున్నవో గని, నీ పూల పుట్కల వడ్డవనుకో' అన్నడు. అన్న మాట విన్న ముత్యాలమ్మకు ఏమనాల్నో తెల్వలేదు. కొంచెం తటపటాయించింది. 'మూలనక్షత్రం అని మూణ్ణెల్ల పిల్లప్పుసు తల్లి లేని పిల్లను ఎవ్వరు, ఒల్లమంటె ఒల్లం అన్నప్పుడు, మనుసు ఇర్గిన అన్ననే రుక్కిణమ్మకు సాక్కోమని ఇచ్చె గద! మరి ఇయాళ్ల ఆ పిల్లను అన్నెట్ల దెస్తడు. అవెట్ల ఇస్తది? ఇస్తె మట్కు నేనెట్ల జేసుకుంట? వాళ్లెవరు? నేనెవరు?' అని రెప్పపాటుసేపు ఆలోచన చేసింది, 'ఇంతట్లనె తేరుకొని ఏనుగంత అన్న ఉండంగ నాకేం బయం. ఆ పోరి నా అన్న నెత్తురు కండ గాకుంటె మంది పిల్లనా? మా అన్న కాశన్న మాటకు ఎదురు వలికే నాదుడు ఎవరుండరూ అంట. సూర్యుడు తనోడైతె సుక్కలన్ని తన కుక్కలంట. ఊరికైన మనిషి. మాలీ, పోలీస్ వతన్లు సేతులున్న అన్నముంగలి కడుమ సుట్టాలందరు కుక్కిన పేండ్లే గద. దేవుని దయ ఎట్లుందోగని, ఏశి పుట్టినకాణ్ణుంచి నా కన్నంత దాని మీదనే ఉండె. మా దొర బయానికి కుయుక్కు మన లేదు గని, ఆనాడె పిల్లను దీస్కపోక పోయినాను. మా రాగనికి ఈడూ జోడు, ముద్దు గుంటది. సీపిరి కండ్లనీలి కాటికకండ్ల ఏశి మీద దిగదుడ్పుకన్న పనికి రాదు' అని అనుకొని 'అన్నా! నీ మాట ఎన్నడన్న కాదన్ననా? ఈ మాట మీ బావ చెప్పల నిగానంగ ఏస్త. బరువు బారాలన్ని నీవే. మాట మట్కు ఖాయం' అన్నది.

ఈసారి నెల్లాళ్ల ముందే ముత్యాలమ్మ తల్లిగారి ఊరికి పయినం గట్టి అన్నింట్ల పీట వెట్టింది. ఆడివిల్ల నెల్లాళ్ల వచ్చి తనింట్ల గూసున్కం ఆవగింజంత ఇష్టంలేదు వొదినె కిష్టమ్మకు. ఇన్నాళ్ల ఆడివిల్ల ఇంటి కొచ్చిందంటె కిష్టమ్మ ఇగలేని బయంతోటి పైనిండ కండ్లు వెట్టుకొని మెలిగేది. ఈ త్యాప 'మాకూ తల్లిగారిండ్లున్నవి గాని, గిన్నివైనా ఎరుగం తల్లీ! ఈ ముక్కుమీది కోపాలతోటి ఎవ రేగుతరు' అని రుసరుస లాడ్కం మొదలు వెట్టింది. ముత్యాలమ్మ భోజనానికి రాక తొలిగనె కంచుట్ల కోడికూర సగం దీసి గుండుగిన్నెలేసి ఉట్టిమీద ఎక్కిచ్చేది. షష్ఠివారాలు దీరి నెల్లాళ్ల గడ్సినా 'అమ్మో! ఎంకీనెయ్యి గెలుక కుండి అంట్లెత'వని దుత్తకు దుత్త పెద్ద గోనెంల దాసేది. ఇగ పాల దాయి కాడ, సల్లిపెర్పుకాడ, కట్టుకావ లుండేది. పిల్లకల్లు రాంగనె సన్నుబుడ్డెడు ముందే దీస్కొని 'సంటిది కమిలి'కని చెప్పుతుండె. ఇవన్ని జూసి అరికాలిమంట నెత్తికెక్కిన గని ఉగ్రాన్ని దిగ మింగుకొని, 'ఉట్టి ఎన్నాళ్లాగు తది, ఊగని, ఊగి ఊగి ఉన్నకాడ్కె వస్తది' అని తమాయించుకొని అన్న చెవుల వడకుండనే నడుపు కొచ్చింది.

ఇంతట్ల పాలమూరి కెళ్లి ఎచ్చమ్మ రానే వచ్చింది. ఉంగురాలు దిరిగిన ఎంటికలు కండ్లమీద గుత్తులోలె వాల్తుంటె పొట్టి జడేసుకొని, ఒంటి ముత్యం ఊగులాడె కిలావర్ పూలు చెవులకు, మెళ్లకు ఎఱ్ఱరాళ్ల పత్కంల గలిపి గుచ్చిన గోధుమాణి దండేసుకొని, కిలకిల మనుకుంటొచ్చింది. ఈ పిల్ల రాంగనే ఇల్లు పచ్చతోరణాలు గట్టినట్లు, బంతిపూలు పూసినట్లు, ఎన్నెల గాసినట్లు కళకళ లాడింది. పిల్ల నిజానికి సక్కని చెక్కడపు బొమ్మకాదు. అయినా ఆ పిల్ల ముకం, కళ ఏదోగని, ఒక్కసారి జూస్తె మళ్లా మళ్ల సూడ బుద్దైతది. అది నగినప్పుడు

కుడిదిక్కు సొట్టలు పడ్డ దాని పాల చెంపలు ముద్దులు గుమ్మరించ బుద్దైతవి.

బిజిన పల్లెల ఎచ్చమ్మ వాళ్లిల్లు కంచెంత పెద్దది. లంకసొంటి ఆ పాత కొంపల మొన్న మొన్ననె వాళ్ల నాయిన దక్షిణపు దిక్కు బంకులు భవంతి లేపిండు. ఈ కొత్త భవంతి కచ్చేరి అయింది మొగో ళ్లకు. ఆడ మూడుపొద్దులు అందరు జేరి ఊరిమీది ముచ్చట్లు, న్యాయాలు, తీర్పులు జర్పుకుంట ఉంటరు. అందుకోసం ఆ దిక్కుకు పిల్లలు, ఆడోళ్లెవ్వరు వోరు. ఈ కొత్త బంకులకు పాతింటికి నడుమ ప్రారీవెట్టిన ఉత్తసోటుంది. ఆణ్ణే పెద్ద సేదు బాయుంది. ఇంటికొచ్చిన సుట్టపక్కాలు, మొగోళ్ల ఈడ్నే స్తానాలు జేస్తరు. దాని కానిచ్చి ఏసిన స్నవం లనే వొడ్ల దంపుకం, అట్కులు గొట్కుం, గిట్ల జర్గు తవి. అవుతల పెద్ద పెరడుండది. ఈ ఉత్తసోటుకు, ఆవల పెరటికి నడుంగలో దిడ్డి తలుపుండది. ఈ దిడ్డితలుపు దాట్తే ఆడున్న కొట్టాలు, గడ్డాములు గండ్ల వడ్తవి. ఈడ రొండుమూడు యాప, చింత, తుమ్మ, మామిడి చెట్లున్నవి. ఇవన్నిటికన్న సెప్ప దగ్గది ఓ రేగిచెట్టొడుండేది. ఇవన్ని ఒగెత్తు ఇగ ఆడున్న రేగిసెట్టు ఒగెత్తు. ఎన్ని సెట్లుంటె ఏంది, రేగిసెట్టుకున్న ఖదరు, ఆడ యా సెట్టుకు లేదు. ఎందుకంటె ఆ నెలల పిల్లలకు గావల్సిన పండ్లిచ్చేది గా చెట్టొకటే. ఐతే పిల్లలనోట్ల గడ్డ గొట్టినట్లు ఆడ్కపోకుండ, ఆదిడ్డి దరువాజ మీన చిక్కు తాలం తగిల్చిన్రు. ఎందుకంటె పెరట్ల పాతగోడ వెన్కున్న పెద్దబాయిల మొన్నమొన్ననే కర్ణపు రవు ణమ్మ కోడలు చిన్నతాయారమ్మ వడి, సచ్చి, దయ్య మైందట. ఇంగ అది ముండే బాపని దయ్యం, పడ్తే ఇడ్వదు. అదిగాక అభం శుభం దీరకట్టోటి ఉండె, ఇంగ అసుంటి దయ్యపుగాలి, గీలి పిల్లలకు యాడ దాక్తదో అనే బుగుల్తోటి ఆ దిడ్డి తల్పు దెర్య కమే లేదు. గుడ్సుర్మితె కండ్లు మూసుకునే పిల్లలు ఆ దిక్కు జూసుకుంట గుట్కెళ్లు మింగిమింగి చెట్టుమాటనే మర్శి ఊకున్నరు.

ఇంగిలీకం ఆ సొంటి ఏశివొచ్చినంక పిల్లలంద రికి ఆటిడిపైంది. ఇంట్ల ఆడోళ్లు సకినాలు జుట్టు కుంట, బరిసెలపిండి గొట్టుకుంట, సొజ్జె ఇసురు కుంట, పేణీలకు శక్కెర జల్లుకుంట, పొలావ్ కొరకు కాకెరొడ్లు పాతం జేపిచ్చుకుంట, ఆ యా పనులల్ల వడిపిల్లల మీది విగురాని కొంచెం సల్లిడి సిన్రు. ఇగ పిల్లలుగూడ ఏవుడు బియ్యం బెట్టు, చిట్టిలువలుబెట్టు, బెల్లప్పాసవెట్టు అని ఊరె తల్లుల ఎంటవడి వీపుకం మానిన్రు. సిరిదిండ్ల మీన సింతమాని పల్కలు బల్పాలు వట్టుకొని ఒంట్లు, ఓనమాను రాసుకుంటి సదువుకుంట దిర్గుతుండరు. ఇట్ల తీగె రాగాలు వాని నక్కుంట, ముర్సుకుంటున్న ఎడ విల్లలను జూసి, తల్లినిడిస్తే పిగ్లి గరుస్తదని తల్లిసంకకు అత్కపోయిన సంటి విల్లలుగూడ దిగితప్పటడుగులు ఏస్కం మొదలు వెట్టిన్రు. ఎచ్చమ్మ సన్నసులు చేతుల వట్టుకోని పల్కమంచం ఎక్కి కూచోని పిల్లలకు పద్యాలు, అంగ్రీజు నెలల పేర్లు నోటికి యాది జేపిస్తుండది. పిల్లలందరికి ఎచ్చమ్మంటే గురి గుదిరింది. అప్ప టికే పంజాయ్ జమాత్ చదువుతున్న రఘునాథ రెడ్డికి తుర్కమే గని, అంగిరీజ్ రాదు. 'ఈ పోరి ఏశి మూతి గుండుగ వెట్టి అంగిరీజ్ సదువుతుంటె పెద్ద లాట్ సాబ్ బిడ్డోతె ఉంది. మరి ఈ సదవు నా కొస్తె బాగుండు'ననుకున్నడు. 'అయితె గా పోర్ని ఎట్లడ్గ నేర్సుకోవాలె, నాకంటె సిన్న గుండి మిడ్కెగదా. నేర్సుకోకుంటె రేపు మా పటేంతల వామ, 'అరె పిలగాండ్లు! మీరు నేర్సుకున్న కొత్త కొత్త పాఠాలు సదివి నాకు యినిపిచ్చుండి' అ . అడ్గితె ఏశి గీ అంగిరీజు సదువుతది. మరి నాకు రావంటె నెత్తిదించుకోవాల్సి వస్తది. అబ్బ, ఈ పోరి యాడ నేర్సిందో ఇవన్ని. ఎల్లిపాయ పటాకిరో నాయిన! ఎట్లైన ఉపాయం జేసి నేను అంగిరీజు నేర్చుకోవాలె' అని అనుకోని ఓ తంతు వన్నిండు. పిల్లల్నందర్ని పిల్సి కూసోవెట్టుకోని 'అరె తమ్మీ, తమ్మీ సెల్లే, బుచ్చి, బుచ్చి. ఇగ సూడుండి. మీ రందరు అంగిరీజ్ నెలలపేర్లు తప్పు వోకుండ పది

పొర్లు పగిలితె, ఎండపూట మన ఊరెన్కి ర్యాగళ్లకెల్లి ఎచ్చిశెనక్కాయ దెచ్చిపెడ్త'నన్నడు. ఆ మాట ఇని పిల్లలు 'బావ, బావ, అన్న, ఇగో అప్పుడే గని మాక్యా డొస్తది. అగో ఎచ్చక్కలేదు, పట్నంకెళ్లి వొచ్చిన పుట్నం గింజ. దానికే వస్తవి. రాగన్న, గిరిరావ్‌గని, నీవే ఏది జెప్తె అది చేస్తమ్. నీవు పెద్దబాయికి ఈత గొట్టబోతె బెండు మోసుకొస్తం. పాడి తువాల, బనీను పట్టుకొని నీ వచ్చేదాక బాయిగట్టుమీద దిరిపూసుకుంట గూసుంటం. నీవు పొద్దుమూకి సెండాడెటప్పుడు తప్పిపోయిసెండు యాకంప తీర్లల్ల వడ్డగని, ఉర్కిపోయి తెస్తం. శెనక్కాయ దెచ్చిపెట్టే' అని గిపూలుకుంట అడిగిన్రు పాపం. ఇగ బావ, ఎచ్చమ్మను జూసి 'ఎచ్చా, నీవు సదువే సూటం' అని అడిగిండు ఎచ్చలు నెత్తి అడ్డంగ దిప్పుకుంట 'నేను జదువను. అమ్మో! ఎంత ఉషారున్నవ్. నేను పదిసాల్లు సదివేట్యాళ్లకు నోటికి యాది రేస్తమనుకున్నవ్. నా కెరుకే నీ ఉపాయం. అట్లె సయుసత. గని బావీ, నాకు Jack & Jill, Lio the Lion ఇంగా ఎన్నో అంగ్లీజ్ పద్యాలు వొస్తని అవన్ని నీకు నేర్పు తగని, మరి నాకు మన దొడ్డిలున్న గంగిరేగి పండ్లు తెంపియ్యవా?' అని అడిగింది. ఆ మాట ఇనంగనే బావ ఒక్కసారి ఉలిక్కిపడిండుగని, కాదంటె ఆ పోరి ఇర్గవడిన గుతది. 'అవును. ఇంటోల్లెసెట్టునెట్టుకొని ఇంత తండ్లాట ఎందుకు? నాకన్న ఈ పోరే నయం' అనుకొని 'సరె. ఏది నీవు దిడ్డికాడ కావలిగాయి. నేను గోడదుంకి తెస్త'నన్నడు. గని అప్పటికి ఆడ్నే మనుసులు మెసులుతుంటె అనుము దొర్కక, తెనుగు రంగడు దెచ్చిన చెరుకుగడలు చేతుల వట్టుకొని, పిట్టగోడెక్కి కూసోని కాళ్లూపుకుంట సదువుతుంటె, ఎన్క బావ సదువుతున్నడు. ఇది జూసి పిల్లలంత ఉరుక్కుంట పోయి ఇంట్ల జొరవడి 'అత్తా! అత్త, ఇగో ఎచ్చక్క తోటి అంగ్రేజీ నేర్సుకుంటుండడు. అక్క పంతులమ్మైంది. సూతువు రా' అని పిల్సుకుంట గుంజిన్రు. కొడుక్కు అంగ్రేజ్ నేరుస్తడంటె ఎంతో సంబరం అయింది, 'అవును. రేపు మావోడు తాలుక్దారయ్యేటో'డనుకొని ఉబ్బిపోయింది. గని; 'అంతకొడుక్కు ఏలంతపోరి, రేపు వాణి అదుపాజ్ఞల మసిలే పోరి గురువోలె నేర్పుతుండదంటె ఎంత సిన్నతనం!' అనుకొని 'ఎవతే ఈ మాట అంటున్నది? మీ ఎచ్చక్క లొచ్చక్క నేర్పితే గని, బావ దొరకు దెల్లారదు. పోనియ్యరు సత్తిబింకాలు, అవుతలికి నడుస్తరా, లేదా!' అంట ఎల గొట్టింది.

మర్నాడు పిల్లలెవ్వరు లేకుండజూసి అందరి కండ్లుగప్పి ఎచ్చమ్మ, బావ ఇద్దరు గలిసి ఇంటెన్క గోడమీదికెల్లి దుంకి, పెరట్ల జొరవడి, గడ్డివాముల సాటుకెళ్లి రేగిచెట్టుకాడికి పోయిన్రు. చెట్టు ఇరగ్గాసింది. కసరు పిందెలు, జోరుపండ్లు, బాగా దోరమాగిన పండ్లు ఎన్నెన్నో ఉన్నవి. చెట్టునిండు గజ్జెగాసినట్లుంది. గని, గడలతోటి, సువ్వలతోటి గొడ్తె కసరుకాయలు రాల్తవి. కమ్మంకత్తె దెచ్చెటట్లు లేదు. అందుకోసం చెట్టెక్కాలె. బావ ఎక్కితె కింద ఎచ్చి ఒక్కతె ఉంటది. పక్కకు దయ్యమున్నది. అందికే ఇద్దరు చెట్టెక్కాలె. మరి ఏశికి కాళ్లందవు. ఎట్ల మరి?

'నాకేం బయం లేదు. బావ, నీ ఎక్కు'

'వద్దు ఏశి.'


'మరెట్ల బావ? నీవేమొ సెట్టు వాకి ఎక్కుతవు. ఆ కొత్త పర్కిణి ఎగవాకేటప్పుడు సిన్గితె ఎట్ల?' అన్నది. బావకు నిజమే అనిపిచ్చింది. 'అయితే ఎచ్చి, నేను రాళ్ల వోగువెడ్త. ఈ రాతిమీదికెల్లి నామీద వో కాలువెట్టి నీవు చెట్టు మొదట వోకాలు వెట్టు. అటెంక కొమ్మ దొర్క వట్టుకొని, చెట్టు మొదలు పంగలల్ల నాకు సోటుంచి గూసో. ఇంగ నేనెక్కి వస్త' అన్నడు.

ఏశికి బావ ఎంత మంచోడని పిచ్చింది. బావను పట్టుకొని ఏశి ఎక్కింది. బావ ఎక్కిండు. కావల్సినన్ని పండ్లు సిల్క గొర్కినవి, వొలాయించి ఏరుకొని తిన్నరు. తెంపుకోని కీసలు నింపుకున్నరు. సాల్లైనవి. ఇంగ బావ కిందికి దుంకిండు: పాపం ఏశికి

దిగొస్తలేదు. పట్క జారుదమంటె సెట్టు గీస్క పోతుండది. ఇంతట్లనె మెరుపు మెర్శినట్లు రఘునాథ రెడ్డికో ఆలోచనొచ్చింది. దబదబ చెట్టు దిగి నోడల్ల, చెట్టు కింది బండి ఎక్కి వొంగిండు.

'ఎచ్చి, బయపడకు, చెట్టు దిక్కు మొకం జేయి, ఎడమ మోకాలొంచి చెట్టు కానిచ్చి నిలవడు. మెల్లగ ఆ కాలు నా ఈపుమీద మోపుకుంట దిగు' అన్నడు. బావ జెప్పినట్లె ఎచ్చమ్మ అవలి మొకం జేసి రెండు సేతుల చెట్టును గట్టిగ పట్టుకొని మెల్లగ దిగుతుండది.

ఇంతట్లనె బోజనాలకు పొద్దైంది. 'సోటు జేసి శానసేపాయె. అన్న గూడొచ్చి 'వడ్డనైందీ' అని అడ్గవట్టె. ఆయనకు వడ్డన సేతమంటె, పనివడి 'మా రాగయ్య యాడుండ'డని అడిగిండు. పిల్లగాడు కండ్ల వడకుంటె లగ్నే మనుకుంటడు? తులవ పోరంల్ల గలిసి ఇల్లు వట్టకుండైండని అనుకుంటడేమొ! ఎట్లజెతబ్బా' అని బిరబిర ఇవుతలికొచ్చి జూస్తె యాడ లేడు. ఇంతట్లనె రాత్రి పూటకు యాటను పోతం జేస్తనని కటికో డొచ్చిండు. 'దిడ్డిదెర్శి వాస్త' నని దిడ్డి దరువాజ దెరిసె ట్యాళ్లకు కొడ్కు వొంగిండు. వాణి సల్ల్య అంగిమీద ఏశి కాళ్లు బెట్టి దిగుతుండది. 'హాయబ్బ, ఎంత పనాయె! పోయి పోయి అదునా కటికోని కండ్లల్ల వడె గదబ్బ! అమ్మో, పోరి తిప్పితిప్పి కొడ్తె పదేండ్లు లేదు. ఇప్పుడే వాణ్ణి కత్తెకుక్కను జేసి తిప్పుతుండది. తల్లీ, నయం. కండ్లు దెర్శిన. కానక కంపల పడ్తుంటె ఈ పోరికో దండం, ఈ సంబంధానికో దండం' అని బిర బిర వోయి 'రంగా, ఏం జేస్తుండవురా' చెప్పవట్టి గొరగొర గుంజు కొచ్చింది. అట్లొచ్చి దివాను పీట మీద గూసున్న అన్నను జూసి 'అన్నా' సాలు. నీ ఇంటికి వచ్చినందుకు మర్యాద బాగనె జేసినవ్. తల్లిగారింటికి వెయ్యి దండాలు. ఇన్నేళ్లనుండి పడ్పు చించుకుంటె కాళ్లమీద పడ్తదని, కడ్పుల బెట్టు కొని ఊకె ఉన్న. నీ పెండ్లాం అన్న సూటిపోటి మాటలన్ని భరిచ్చిన. ఇగ సన్ను, నా పిల్లగాణ్ణి నీ పిల్లకంట్ల కనుపాపోలె దిక్కమంటె మా శాత గాదు. నాకు మీ సమందమే వద్దు. సవరి కచ్చురం గట్టియ్యి. నేను పోతా'నని పయినమైంది. 'రాజీ నాకు ఆకలి లేదు. వడ్డన జేయకుండి. రుక్మిణమ్మను పిల్లను దోల్కొని రేపే పొమ్మనిజెప్పు' అనుకుంట కాశిరెడ్డి అవుతలికి నడ్సిండు.



గది

శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత శర్మ

నేను పుట్టిన వేళ—
గది
మూగగది—
గోడలు కలది;
తలుపుల వెనక దాగు నది;
నలు చదరపు శూన్య రహస్య నిధి.

*　　　*　　　*

వయస్సుతో ఎదిగిన వేళ—
అది
నన్ను చుట్టినది
ద్వంద్వాలను అలవరచినది
వల పరచినది—
నా
ఆలోచనకూ, ఆచరణకూ
నడుమ
చలన చైతన్య రేఖను
ఏర్పరచినది—
సమష్టి ఆత్మను
వ్యష్టి శరీరంవలె
సమాజంనుంచి నన్ను
వేర్పరచినది—

అందుకే—
లోకాన్ని కిటికీనుంచే
చూడగలను—
ఆలోచనను
వ్యక్తిత్వంతో విభజించి,
అవసరంతో హెచ్చవేయగలను—
పరిధిలో ఇరుక్కున్న నేను
గదులనే గౌరవిస్తాను
అదే సబబని తలుస్తాను.

భా ర తి

ప్రీతి అనుభూతికీ కదలి
ఏకాంతంగా తలుపులు వేసుకొని
వెక్కి వెక్కి ఏడుస్తాను, నవ్వుతాను
అప్పుడు గది,
నా మది—

*　　　*　　　*

నేను మరణిస్తున్నవేళ-
గది
తలుపులు లేనిది;
తలపులు కూలినది
స్పర్శకు అతీతమైనది-
అప్పుడు నేను
ఆనందాన్ని వెలుగులో
దుఃఖాన్ని చీకటిలో
ఆలోచనలను శూన్యంలో
విడిచేసి,
ఆ కూలిన నాగది యిటుకల
శిథిలాలనుంచి నడచి -
అణువుల, పరమాణువుల
రోదసినంతా నిండి పోతాను—

*　　　*　　　*

గది
మన భావ నది,
లోపలకు జేరితేనే మనది—
అంతాన మిగిలేది
మౌన సమాధి
దానిని పరిశోధకులు పగల గొడితే
కనిపించేవి
వినిపించేవి,
మూలుగులు...
మన మూలుగులు...

అమరావతిలోని అశోకుని శాసనము

డా. టి. వి. జి. శాస్త్రి

ఆంధ్రదేశములోని మహాపవిత్రమైన శైవ క్షేత్రములలో అమరావతి యొకటి. సజీవమైన కృష్ణానది, ఈ క్షేత్రమునకు ఉత్తర వాహినియై ప్రవహించుటవలనను శైవ పంచారామాలలో మొదటిది యగు ఈ 'అమరారామ'[1] (అమరావతి) అమరేశ్వరుని స్థావరమై యుండుట వలనను ఇది శైవులకు, హిందువులకు ముఖ్యయాత్ర స్థలముగ ప్రసిద్ధికెక్కెను.

'అమరేశ్వర స్థల మాహాత్మ్య'మునందు, పురాణముల యందు,[2] ఇది అతిప్రాచీన స్థలమని ఉదహరింపబడి యున్నప్పటికీ, పురాతత్వశాస్త్ర దృష్ట్యా ఇది రుజువగుట లేదు.

బర్జెస్[3], విన్సెంట్ స్మిత్[4], మొదలగు పరిశోధకులు[5], ప్రక్కన పశ్చిమముగా ఒక అరమైలులోనున్న ధరణికోట, అమరావతి, రెండునూ చారిత్రికంగా ఒకటేనని యూహించినట్లు వారి వ్రాతల వలన తెలియుచున్నది. వీరందరూ అమరావతి పంచాయితీ సరిహద్దులలోనున్న మహాచైత్యము, దాని యందుండు పురాతన అవశేషములకూ, ప్రాధాన్యమిచ్చిరిగాని, ధరణికోట లోని, మట్టికోట దాని యందుండు అవశేషములను చూడలేదు. ఇందువలన, అమరావతి ధరణికోటలు రెండును ఒకటేనను అపోహకు దారితీసెను.

ధరణికోట, అమరావతి వేరు వేరు మతములకు దోహదమిచ్చెనని అనుకొనినచో, బౌద్ధమతమునకు స్థావరమైనది ధరణికోటయనియు,[6] తరువాత బౌద్ధమత వ్యాప్తిని అరికట్టుటకు అమరావతి శైవక్షేత్రముగ వర్ధిల్లెననియు, ఇటీవల చేసిన పరిశోధనలవలన వెల్లడియగుచున్నది.[7] ఇక ధరణికోట ఎంత ప్రాచీనమైనదని యాలోచించినచో, డగ్లస్ బారెట్[8] విన్సెంట్ స్మిత్[9] మొదలగువారు ఇచట నున్న అవశేషములనుబట్టి, క్రీ. శ. రెండవ శతాబ్దమునకు ముందు, దీనికి ఏ ప్రాధాన్యత లేదని యూహించిరి. కాని ధరణికోట క్రీ. పూ. 4 వ శతాబ్దమునుండీ

---

1. ఆంధ్రదర్శిని (1950) పేజి 133.

2. Burgess: Buddhist Stupas of Amaravati and Jaggayyapet (1837). p. 2 (f r)

3. Burgess: op. cit, p. 3.

4. Vincent A. Smith: The Early History of India (Re: pr. 1967) p. 493.

5. 'ఆంధ్రదేశ చరిత్ర అరంభమునుండి రాజకీయ సాంస్కృతిక రంగాలలో కీలకస్థాన మాక్రమించి, ఖ్యాతినొందిన ఒకనాటి నగరమైన ధాన్యకటకమే నేటి గ్రామమైన అమరావతి.'

ఆంధ్రదేశ చరిత్ర—భూగోళ సర్వస్వము—1 (1972) పే. 395.

6. ఇచట దొరికిన బ్రాహ్మీ శాసనములలో అమరావతి ప్రస్తావన కనిపించదు.

7. మొట్టమొదటి సారిగా 'అమరపుర' మను పేరు (అమరావతి) విష్ణుకుండిన రాజగు మాధవ వర్మ వేయించిన 'ఈపూరు' శాసనములో కనుపించును. ఇతడు హిందువుడు. శ్రీ పర్వత మల్లిఖార్జునుని ఆరాధకుడు. ఆ నాటికి వేయి సంవత్సరములు అప్రతిహతంగా ధరణికోటలో బౌద్ధమతము వర్ధిల్లెను. ఈపూరు శాసనమున తను మల్లిఖార్జునుని ఆరాధకు డనుచు అమరావతి పేరును ఉదహరించుట. హిందూమతమునకు దోహదము నిచ్చుటకు బౌద్ధమతము నణగద్రొక్కుటకు మాధవ వర్మ వేయించెనని తోచుచున్నది. ఇతడు క్రీ. శ. 553—593 వరకు 40 సంవత్సరములు రాజ్యము చేసెను.

8 Douglas Barrett: *Sculptures from Amaravati in British Museum* (1954) p. 40.

9. Vincent-A. Smith: op. cit P 493.

ప్రసిద్ధి కెక్కెనని, కొన్ని శాసనములనుబట్టి,[10] కొన్ని పురాణ గ్రంథములనుబట్టి, మరికొన్ని పురాతత్వ పరిశోధనలను బట్టి తెలుచున్నది.

ఇక ధరణికోటలో దొరికిన శాసనములను దృష్టిలో నుంచుకొని, ఇవి ఎంత పురాతనమైనవని ఆలోచించినచో, మొదట స్ఫురణకు వచ్చునవి హరప్ప మొహెంజొదారోలో దొరికిన స్టియెటైట్ ముద్రలు (Seals). ఇవి యావద్భారత దేశములో, దొరికిన వాటిలో, ఇప్పటివరకును పురాతనమైనవి. వీటి యందుండు భాష, లిపి, మొదలగువాటిని గురించి అనేక పరిశోధనలు జరుగుచున్నవి గాని, ఇప్పటి వరకును సంతృప్తిగా ఎవరునూ చెప్పలేదు.[11] తరువాత వచ్చిన శాసనములు 'బ్రాహ్మి' లిపిలో వ్రాయబడెను. వీటి యందుండు భాష 'ప్రాకృతము'.[12] ప్రాకృత భాషలోని శాసనములు, మౌర్య సామ్రాజ్యాధిపతి అశోకునిచే ఎక్కువగా వేయబడుటచే ఈ కాలము నాటి 'బ్రాహ్మి' అక్షరములకు, అశోకుని అక్షరములని (Asokan Script) కూడ వ్యవహరింప బడుచున్నవి. ఇట్లు రాజాదరణ పొంది బౌద్ధమత వ్యాప్తికొరకు ఈ శాసనములు, ముఖ్యక్షేత్రములలో వేయబడెను.

అమరావతి, ధరణికోట, నక్కదేవర దిన్నె, వైకుంఠపురము, మొదలగు ప్రదేశములన్నియు, దగ్గర దగ్గరగా నుండును. వీటినుండి వచ్చిన శాసనములు అసంఖ్యాకములు. అశోకుని కాలమునకు చెందిన బ్రాహ్మి లిపి శాసనములు ముఖ్యముగా, అమరావతిలో నున్న మహాచైత్యము (స్తూపము), దాని పరిసర ప్రాంతములనుండి ఎక్కువగా వచ్చెను.[13]

1956 లో ఆర్. సుబ్రహ్మణ్యం అధ్వర్యమున మహాచైత్యమునకు పశ్చిమ దిశన కొన్ని త్రవ్వకములు జరిగెను.[14] ఇది గాక తూర్పున సంగ్రహాలయ ఆవరణము లోపల, కొంత భూమిని చదును చేయుచుండగా, కొన్ని విగ్రహములు, శాసనములు బయటబడెను. వీటిలో అశోకుని కాలమునకు చెందిన లిపిలో వ్రాయబడిన శాసనములు గలవు. వీటిని శ్రీయుతులు డి. సి. సర్కారు,[15] ఎ. ఘోష్ హెచ్. సర్కారు,[16] మొదలగువారు పరిశీలించి, అమరావతి చరిత్రలో వీటి ప్రాధాన్యతను వివరించిరి.

ఇపుడు వ్రాయబోయే 'అమరావతి లోని అశోకుని శాసనము'కూడ ఇచట దొరికినదే. దీనిని గురించి డి. సి. సర్కారు ఎపిగ్రాఫియా ఇండికాలో (No. XXXV Pt 1) వ్రాశారు. దీనియందు వీరు లేని మాటలు కొన్నిటిని యూహించి, కొన్నిటిని పూరించి వారికి తోచిన విధముగ చదివిరి. కాని వారు వ్రాసిన దానికి కొన్ని మార్పులు అవసరమని తోచుట వలన ఈ వ్యాసమును వ్రాయ బూనితిని.

అశోకుని శాసనములు కొన్ని పెద్ద పెద్ద రాతి బండలమీదను (Rock Edicts)[17] కొన్ని చిన్న చిన్న బండలమీదను (Minor Edicts),[18]

---

10. ఈ వ్యాసమువలన ఇది బుజువగుచున్నది.

11. ఇవి ఇంగ్లండులో 'హంటరు', రష్యాలో 'ఆస్కొ పర్పోలో', ఇండియాలో, రే, యం. వి. యన్. కృష్ణారావు మొదలగువారిచే, ఈ ముద్రలలోనుండు అక్షరములు పలురకములుగా చదవబడెను.

12. ఈ లిపిని మొదట చదివినవారు 'జేమ్సు ప్రిన్సెప్'.

13. మహాచైత్యము నుండి దొరికిన శాసనములన్నియూ, బ్రాహ్మి లిపిలో వ్రాసినవే. కాని అన్నీ అశోకుని కాలమున వ్యవహారములోనున్న బ్రాహ్మి లిపిలో లేవు. అశోకుని కాలమునకు చెందిన లిపికీ, తరువాత సాతవాహనుల కాలమునాటి శాసనముల 'లిపికి' ఎంతో భేదము కలదు. ఈ మధ్య 300 సంవత్సరములలో అక్షరములలో అనేక మార్పులు జరిగెను

14. Indian Archaeology — A Review — 1958—59 (New Delhi 1959) P 5.

15. Epigraphia Indica: Vol. XXXV. pt. 1. P. 40 - 43


16. Ancient India. Vol. No. (20 and 21). P. 168—177.

17. ఇవి ఉత్తర హిందూస్థానంలో 'షాబాజ్ ఘరి' 'మన్‌సేరా' మొదలగు చోట్ల కలవు. ఇటువంటివే సౌరాష్ట్రం (గుజరాత్)లోని 'గిర్నార్' శాసనములు.

18. రూప్‌నాథ్, ఎఱ్ఱగుడి మొదలగు నవి,

మరికొన్ని రాతిస్తంభములమీదను (Pillar Edicts) వ్రాయబడి యున్నవి.[19] ఆంధ్రదేశములోని కర్నూలు జిల్లాలో, ఎఱ్ఱగుడి రాజుల మండగిరి, మొదలగుచోట్ల దొరికిన రాతి శాసనములు ప్రసిద్ధములు. కాని, శ్రీకాకుళం జిల్లాలోని రాతిపీఠముపైనున్న శాసనము, అమరావతిలోని శిలాస్తంభ శాసనము ఇటీవలనే బయటబడెను.

ఈ అశోకుని శిలాస్తంభ శాసనము కాలాంతరమున పగిలిపోగా, ఇపుడు మిగిలి యున్నది 1½ అ. పొడవు, 11 అం. వెడల్పుగల రాతిపెచ్చు. దీనిపై మిగిలియున్న శాసనములోని లిపి భాష మొదలగు వాటిని బట్టి ఇది అశోకుని, శిలాస్తంభ శాసనమని, విదితమగుచున్నది. (పటము చూడుడు.)



అమరావతిలోని అశోకుని శాసనము

జాగ్రత్తగా పరిశీలించి చూచినచో ఈ అక్షరము లన్నియూ పెద్దవిగా వ్రాయబడి యున్నవి. ఇవి దక్షిణదేశము నందు వ్యాప్తిలోయున్న అశోకలిపిని పోలియున్నవి. ఉత్తర హిందూస్థానమున యున్న అశోకుని శాసనములన్నియు 'చునార్' యిసుక రాయిలో చెక్కబడియుండును. అశోకుని శాసనము లన్నియూ ఇదే రాతిలో వ్రాయబడెనని ప్రతీతి గలదు గాని, ఈ అమరావతి శాసనము తూర్పుకనుమలలో దొరుకు క్వార్ట్జయిట్ రాయిలో చెక్కబడియున్నది.[20] అయితే ఇదియును ఇసుక రాయే. కాని భౌతికముగా చునార్ రాయికిని దీనికినీ భేద మున్నది.

మామూలుగ, మౌర్యుల కాలమునాటి శాసనముల, రాయినిరుద్ధి మెరుగువచ్చునట్లుచేసి దానిపై శాసనము వ్రాయు అలవాటు యుండెడిది. ఇటులనే ఈ అమరావతి శాసనముకూడ మెరుగుపెట్టబడినట్లు, రాతి పరీక్షలో తేలుచున్నది.

ఈ శాసనమునం దుండునది ప్రాకృతమే కాని, అక్కడక్కడ అర్ధమాగధితో కలిసి యున్నది. అయితే అశోకుని శాసనములలో అన్నిశాసనముల లోను కొద్దో గొప్పో అర్ధమాగధి ఉండక పోదు. అశోకుడు ఆ ప్రాంతము వాడగుటయే దీనికి నిదర్శనము. అన్ని శాసనములలో కనిపించు 'దేవానాంప్రియ' (దేవానాం ప్రియ), సేవనహూహ, (ఏవనాహూ) మొదలగు పదములు యుండెనేమో తెలియదు కాని, దీనియందు కనిపించుట లేదు. రాజా అనుపదమునకు 'లాజా' అనునది ఎక్కువ శాసనముల యందు కనిపించును. ఇది దీనిలో కనుపించుట లేదు. కాని 1, 3 పంక్తులలో 'ర' చక్కని అశోక లిపిలో వ్రాసియున్నది.[21]

---

19. ఢిల్లీ – టోప్రా, రాంపుర్వా మొదలగు చోట్ల గలవు.

20. అశోక లిపిలో వ్రాయబడిన శాసనము లన్నీ అమరావతిలో Quartzite రాయిమీదే చెక్కబడి యున్నను, ఇవి సాతవాహనులకు ముందు కాలమును సూచించును. 'లేత ఆకుపచ్చగానున్న సున్నపు రాళ్లపై' యున్న శాసనముల అక్షరములలో భేదము కనుపించును. ఇవి సాతవాహనుల కాలము నాటివి.

21. 'ర' అక్షరము, కర్నూలుజిల్లాలోని ఎఱ్ఱగుడి అశోకుని శాసనమునందు కూడ కన్పించుచున్నది. ఎఱ్ఱగుడి రెండవ శిలాశాసనమునందు 'రఠికాని' (రాష్ట్రిక') అనుపదము 'లాఠికాని' అని వ్రాయలేదు.

దీనిలో మొత్తము శాసనమంతయు 7 పంక్తులు. పూర్తి శాసనము లభ్యము కాకపోవుటచే, పంక్తుల లోని అక్షరము లన్నియయూ చూచుకొని, పదము లుగ విభజించి అర్థము చెప్పకొన వచ్చును. తరువాత అన్ని పంక్తుల లోని పదములను మొత్తమువిూద చూచుకొని, ఈ శాసనము నందున్న విషయమును గ్రహింప వలెను. ఈ శాసనములో కొన్ని పంక్తుల ఆద్యంతముల లోని అక్షరములు సరిగా లేనందున కొన్ని యూహించ వలెను. మరికొన్ని పూరించవలెను. అయితే ఇవి శాసనమునందు కనుపించు ఆధారములను బట్టి చేయవలెను [22] కొన్ని పంక్తులయందు వ్రాయుటలో, పొరపాటువలన, తరువాత చిన్నచిన్న అక్షరము లలో వ్రాసి పూరింప బడెను. శాసన పటము చూడుడు.

శాసనములోని విషయము

దీని మొదటి పంక్తిలో 5 అక్షరము లున్నవి. ఇవి యన్నియు రెండు పదముల కలయిక. మొదటి పదమునందు మూడు అక్షరములు 'పరీత'[23] అగును. రెండవ పదములోని 'అభ' అను అక్షరములు బాగుగ తెలియుచున్నవి గాని, 'భ'కు 'ఎ' కారము యున్నట్లు యూహింప వచ్చును (భి)[24] తరువాత మరొక 'ఖ్య' అను సంయుక్తాక్షరము కలిపి యుండ వచ్చును. ఇందు చేత ఈ పదము 'అభిఖ్య' అగును. ఇపుడు ఈ పంక్తి యంతయూ

......పరీత అభి(ఖ్య)—(1)

మొత్తమువిూద దీని యర్థము 'పరితాపను చేత తెలియజెప్పబడుచున్నది.'

రెండవ పంక్తిలో 6 అక్షరము లున్నవి. మొట్ట మొదట ఒక అక్షరమునకు 'ఉ'కారము వలె కన్పించుచున్నది. దీనిని యూహించి 'దు' అను అక్షరమని చెప్పవచ్చును. దీనికి 'ఖో' అను రెండవ అక్షరము ఆధారము, ఇవి రెండును 'దుఖో'[25] అగును. తరువాత మూడు అక్షరములు 'లిఖితే' అను పద మగును. చివరి అక్షర మేమిటో తెలియుట లేదు, కాని ఇది ఒక అక్షరమునకు 'ఎ'కారము. ఇది మామూలుగ అశోకుని శాసనములో కనిపించు 'మే' (అస్మత్ శబ్దమునకు షష్ఠీ ఏకవచనము). మొత్తము ఈ పంక్తిలో యున్న పదములు.

......దుఖోలిఖితే (మే)—(2)

దీని యర్థము 'దుఃఖముచే వ్రాయబడుచున్నది'. ఇచట చివర అక్షరము 'మే' అని వ్రాసియున్నప్పటికీ అర్థము తృతీయ ఏకవచనమువలె చెప్పవలెను అశోకుని కొన్ని శాసనములలో 'మయా'కి బదులు, 'మే'[26] అని వ్రాయబడి యున్నవి.

మూడవపంక్తిలో 5 అక్షరములు బాగుగ లిఖింపబడి యున్నవి. కాని మొదటి రెండు అక్షరముల

---

22. రెండవ పంక్తి చూడుడు.

23. Rhys Davids. T. W. Pali-English Dictionary (1921) P. 61 ఇచట 'పరీత' అను పదము చక్కగ వ్రాసియున్నది. కాని 'సర్కారు' ఇతర శాసనములలో యుండు 'పారతి క్రికాయ' (గిర్నార్ X. 1. 3) 'పాలటికాయ' (ధౌళి, జౌఘడ, ఎర్రగుడి) 'పాలంతికాయే' (కల్సి) 'పరత్రి కాయే' (షాబాజ్ ఘరి) మొదలగు పదముల రూపాంతరమై యుండునని వ్రాసి దాని అర్థము భవిష్యత్ప్రపంచములో అని చెప్పెను.

24. సర్కారు ఇది 'అభి' యని చెప్పెను. కాని తరువాత 'షిత' ఉండి యుండవలెనని యూహించెను. దీనికి శాసనమునం దాధారమేమియు కనుపించుట లేదు. కాగా మొదటి పదము 'పరత్ర', తరువాత 'అభిషిత', అని రెండు విడివిడి పదము లనియు వీటికి ఏవిూ సంబంధము లేదనియు యూహించెను.

25. మొదటి అక్షరము 'థ' అని సర్కారు యూహించెను. ఇది 'ఇథ'లో రెండవ అక్షరమనీ చెప్పెను. తరువాత అక్షరము 'ఖ'కు 'ఖలు' అని సంస్కృత పదము వలె అర్థము చెప్పుకొనవలెనని చెప్పెను.

26. గిర్నార్ శాసనములో ఇట్లున్నది. 'మయా ఇయం ఆజ్ఞప్తం' అను సంస్కృత వాక్యమునకు 'మే ఇదం అనపయితే' అని వ్రాసియున్నది. Girnar III,

మధ్య 'నేర'[27] అను రెండు అక్షరములు చిన్నవిగ వ్రాయబడి యున్నవి. ఇవియును అశోకుని శాసనములలో కనుపించు బ్రాహ్మీ అక్షరములే. ఇవి మొదట మరచిపోవుటవలన తరువాత వ్రాసి యుండవచ్చు. ఇవి కలిపినచో 'జనో, రనో' అను రెండు పదము లగును. తరువాత వ్రాసిన మూడు యక్షరములు మరొక పదమగును. ఇది 'బహూనీ' మొత్తము ఈ పంక్తి.

.........జనేరనో బహూనీ......(3)

దీని యర్థము

......యుద్ధము అనేకమంది మనుష్యులను...

నాల్గవ పంక్తిలో మొదటి నాల్గు అక్షరములు ఒక పదమగును. ఇవి...'అనుసుయంతి'[28] ఐదవ అక్షరము 'స' ఇది మరొక పదమునకు మొదటి అక్షరమై యుండవచ్చును. మొత్తము

......అనసుయంతి స......(4)

ఇది సంస్కృతమున వ్రాసినచో 'అనుశ్రూయంతి — స' అగును. దీని యర్థము......వినబడుచున్నది...

ఐదవ పంక్తిలో 7 అక్షరము లున్నవి. మొదటి రెండు అక్షరములు తప్ప, తరువాతయున్న అక్షరము లన్నియూ చక్కగా వ్రాయబడి యున్నవి. ఇవి 'జితి విజయే'[29] ఇవి రెండు పదములవలె కన్పించుచున్నవి గాని దీనిముందుయున్న అక్షరము 'ఫి' లేక 'ఛి' అయి వుండ వచ్చును. కాని మొదటి అక్షరము 'ర' చక్కగ కనిపించుట వలన, మొత్తము పంక్తి... రఛి జితి విజయే — అని చెప్పుకొనవచ్చును. దీని యర్థము ఆలోచించినచో 'యుద్ధభేదనము లోని విజయము'లో అని తోచుచున్నది. దీనిని బట్టి 'ర' 'సమర' అను పదములోని ఆఖరి అక్షరమై యుండవలెనని తేలుచున్నది.

...[సమ][30]ర ఛిజితి విజయే...(5)

అర్థము......యుద్ధమునందు ఛేదించుటవలన వచ్చిన విజయము......

ఆరవ పంక్తిలో నాలుగు అక్షరము లున్నవి. వీటిలో మొదటి అక్షరము తప్ప మిగతా మూడు అక్షరములు చక్కగా వ్రాయబడి యున్నవి. ఇవి 'మాం[31]మపి'. మొదటి అక్షరము 'చ' అయి వుండ వచ్చును. మొత్తము ఈ పంక్తి

...చ మాంమపి........(6)

అర్థము:...నేను కూడ......

ఏడవ పంక్తిలో నాలుగు అక్షరము లున్నవి. వీటిలో ఒకటినీ సరిగా లిఖింపబడలేదు. మొదటి దానిలో 'ఇ'కారము కన్పించుచున్నది. రెండవది 'త'. ఇదియును సరిగా లేదు కాని ఒక మోస్తరుగ యున్నది. నాల్గవది మూడవది 'త' వలె యున్నది గాని వీటికిని, శాసమునయున్న ఇతర 'త' లకు కొంచెం భేదము

---

27. ఈ రెండు అక్షరములకు శాసనమునకు ఏవిధా సంబంధము లేదని సర్కారు చెప్పెను. 'జనో, బహూనీ' అను పదములు అశోకుని ఇతర శాసనములలో ఎక్కువగా కనుపించుటవలన, అటులనే ఈ శాసనము కూడ యుండవలెనని యూహించెను. కాని ఈ శాసనము నందున్న పదములు కొన్ని ఇతర శాసనములలో కనుపించుట లేదు. 'అనుసుయంతి' అను పదము ఇతర శాసనములలో కనుపించుట లేదు. (పంక్తి—4)

28. ఇది 'అనుశోచయుంతి' కావచ్చును కాని, తరువాత 'తత్ మయా' అని కూడ వుండవలెను. దీని యందు ఇట్లు లేకపోవుటవలన ఈ మాట 'అనుసుయంతి' అని చెప్పవలెను. దీనిని సర్కారు కూడ సమర్థించెను.

29. 'ఛిద్యతి విజయే' అని అనుకొనినచో సరియైన అర్థము స్ఫురించుట లేదు. ముఖ్యముగా ఈ అక్షరములకు ముందు 'ర' యుండుటవలన. 'ర' అను అక్షరమునకు ముందు [సమ] పూరించినచో పై అర్థము చెప్పుటకు వీలుగ నున్నది.

30. ఇది సంస్కృతములో 'సమరే ఛిద్యతి విజయః' అని చెప్పుకొనవచ్చును. విజయే అనునది విజయః వలె అర్థము చెప్పుకొనవలెను. ఇట్లు విభక్తులలోని మార్పులు శిలా శాసనము XIII లో కనుపించును.

31. దీనిలో 'మాం' వ్రాయబడియున్నది. 'మా' వ్రాసినను ఇదే అర్థము వచ్చును.

కన్పించుచున్నది. నాల్గవ 'త' కు దీర్ఘము కన్పించు చున్నది.[32]

......[పి] త త [తి]

మొత్తము శాసనము

...పరీత అభిఖ్య.....................(1)
...[దు]ఖో లిఖితే [మే]———(2)
...జనేరసో బహూనీ..............(3)
...అనుస యంతి స..................(4)
—[సమ]ర ఛిజితి విజయే.........(5)
...? మాం మపి.......................(6)
...[పి] త త [దా]..............(7)

దీని అర్థము మొత్తము ఇట్లు వ్రాయవచ్చును.

...పరితాపము చేత తెలియజెప్పబడుచున్నది......
...దుఃఖముచే [యిట్లు] వ్రాయబడుచున్నది......
...యుద్ధము అనేక మందిని............
...వినబడు చున్నది............
...యుద్ధమునందు ఛేదించుటవలన వచ్చిన విజయము
............నేను కూడ......
...........అచటనూ......

ఈ శాసనమునుండి తెలుసుకొనవలసిన విషయములు.

(1) ధరణి కోట అశోకుని కాలమునకు పూర్వమే, ప్రముఖ బౌద్ధక్షేత్రముగ ఖ్యాతి నొందెను.[33] ఉత్తర హిందూస్థానములోనున్న ముఖ్య బౌద్ధక్షేత్రములలో శాసనములు వేయించినప్పుడే యిచటను శాసనమును వేయించెను.

(2) అమరావతి శిలాస్తంభ శాసనము, గవీమఠ్, పాల్కిగుండు శాసనములు, ఒకేకాలము నాటివని, అక్షరముల పరీక్షలో ఋజువగుచున్నవి.[34] ఇవి యన్నియు ఎఱ్ఱగుడి, రాజుల మండగిరి శాసనముల కన్న పూర్వపు శాసనములని ఇట్లే చెప్పవచ్చును.

(3) ఈ శాసనములో కనుపించు 'లిఖితేమే' 'మామపి', విజయే, మొదలగు పదములు అశోకుని శాసనము లన్నిటిలో కనిపించును. వీటినిబట్టి అశోకుడే స్వయముగ, నీతిని, ధర్మమును, అధికార హోదాలో శాసించినట్లు తెలియుచున్నది.

(4) 'యుద్ధములో అనేకమంది హతు లగుదురు, పరితాపముతో చెప్పుచున్నాను, అను శాసనములోని వాక్యములు', అశోకుని కళింగ యుద్ధమును జ్ఞాపకము చేయును. కళింగ యుద్ధమునందు హతులైన వారిని చూచి, అశోకునకు మానసికముగ మార్పు వచ్చినట్లు, ఈ ఒక్క శాసనమువలన తెలుచున్నది.[35]

(5) గవిమఠ్, పాల్కిగుండు శాసనములు శిలా శాసనములు. శిలా శాసనములు అశోకుడు పట్టాభిషేకమైన $2\frac{1}{2}$ ఏండ్లకు వేయించెను. తరువాత వేసినవి స్తంభ శాసనములు. అమరావతి శాసనము స్తంభ శాసనమైనను, అక్షరములు, శిలా శాసనములలోని వాటివలె యుండుటవలన ఇదియును పట్టాభిషేకమైన $2\frac{1}{2}$ ఏండ్లకు వేయించినట్లు చెప్పుకొనవచ్చును. అశోకుని పట్టాభిషేకము క్రీస్తుకు పూర్వము 261 లో అయినచో, అమరావతి శాసనము క్రీస్తుకు పూర్వము 258 వ నాటిదని చెప్పవచ్చును.

---

32. వ్రాయుటలో కొంచెము భేదము రావచ్చును.

33. ధరణికోటలో, సూర్యుడు, నక్షత్రములు, పద్మములు, మొదలగు సాంకేతికములు గల వెండి నాణెములు (Punch marked coins) దొరకెను. ఇవి మౌర్యుల నాటివని పరమేశ్వరీ లాల్ తయారు చేసిన నాణెముల సముచ్చయ పట్టికనుండి తెలియుచున్నది. (Bib'iography of Punch marked coins of ancient India–1955–item III, Page 16). ఈ నాణెములు, విరివిగా అశోకునికి పూర్వమే వాడబడుటచే, ధరణికోట చరిత్ర అంతకుముందు కొంత యుండెనని తెలుచున్నది.

సింహళ బౌద్ధ గ్రంథమైన 'ఖుల్లవగ్గ, మహావంశ', ప్రముఖ బౌద్ధ గ్రంథము మంజుశ్రీ మూలకల్ప, ప్రాచీన ప్రాకృత గ్రంథమైన, గాథాసప్తశతి, మొదలగు వాటిలో 'ధరణికోట' ప్రస్తావన యున్నది.

34. Turner R. L: 'The Gavimath and Palkigundu Inscription of Asoka' Hyderabad Archaeological Series - 1952)—Plate II and IV.

ఇవియును ప్రస్తుతము ఆంధ్రదేశము లోనివే.

35. 'యుద్ధము', పరితాపము, అను పదములు ఈ ఒక్క శాసనములోనే కనిపించుచున్నది.

సింగప్పిరాన్ - శ్రీరంగనాథ పునః ప్రతిష్ఠ

డా. నేలటూరు వెంకటరమణయ్య

1

ఆ రోజు ముక్కోటి ఏకాదశి. రంగస్వామి దర్శనార్థమై ఎందరలకొలది కోసుల దూరమునుండి పయనము జేసి వచ్చెడి యాత్రికులతో నిండియుండి కావేరీ తటమా యుదయము నిర్జనమై యుండెను. సింగిప్పిరాను వచ్చినాడు బహుదూర ప్రయాణముజేసి పెరుమాళ్లను సేవించుటకు. కాని కావేరి నిర్జనముగ నుండుటయు శ్రీ రంగము పాడుపడియుండుటయు నతఁ డనుకొనలేదు. అతనికి మొదట శ్రీరంగమునకు వచ్చి పెరుమాళ్లను సేవించవలయునను ఇచ్ఛయే లేదు. తన గ్రామముననె తనకారు కుట్టి వాండ్రలో గూడ, మసీదులోని ముల్లాసాయబుల వారికడ నాలుగు పారశీ ముక్కలు నేర్చుకొని మధురకు బోయి సుల్తానువారి దేవిడీ కాచి యేదైన యొక చిన్నయుద్యోగము సంపాదించుకొనవలయునని యతని యుద్దేశము. కాఫిరులయెడ సాయబులందరివలె ముల్లాసాయబుల వారికి ద్వేషము గలిగియుండినను సింగిప్పిరానుమీద నతఁ డెక్కుడభిమానమును జూపువాఁడు. కారణము లేకపోలేదు; అతని దస్తూరి చక్కనిది, ఇంచుమించుగ ముల్లాసాయబు వారివలె వ్రాయనేర్చినాఁడు. పార్శీ నేర్చుకొనుటయందు చాల చురుకుదనము జూపినాఁడు; తోడి యువకు లింకను ఆరంభదశయందుండఁగనె నతఁడు బూస్తాన్ గులిస్తానులను ముగించెను; ఫిర్దౌసినిజామీల షానామా సికందరునామాల పఠనను పూర్తిగావించి హాఫిజా దీవాను నారంభించెను. ముల్లాసాయబువారి ప్రేరేపణ మీద ఖురాను చదువదొడగి కొన్ని సూరాలను కంఠస్థము గావించెను. స్వరయుక్తముగ సింగిప్పిరాను ఖురాను పఠించుటను విని ముల్లాసాయబు ఆనందించు వాఁడు. ఖురాను పఠన సంపూర్ణమైన పిమ్మట నతనిచే హదీసు జదివించి యతనికి ఇస్లాము తత్త్వమును బోధించి మహమ్మదీయ మతదీక్ష నీయవలయు నని ముల్లాసాయబుగారి యుద్దేశము. కాని యతని యుద్దేశము నెఱవేఱినది కాదు.

ఒకనాడు అస్తమయ కాలమున కాలకృత్యములను నెఱవేర్చుకొనుటకు సింగిప్పిరాను ఊరి వెలుపటి తటాకమునకు బోయెను; క్రుంకుచుండిన సూర్యుని యరుణ కిరణముల కాంతివలన తటాకమున జలము రక్తవర్ణము దాల్చియుండినది. తటాకము మెట్లపై నొక యసిమిసంచి గాన వచ్చెను; దాని సమీపముననే మోకాలిబంటి నీట పశ్చిమాభిముఖుఁడై నిలిచి యొక ముసలి బ్రాహ్మణుఁడు దోసిట జలమెత్తి యర్ఘ్యము విడుచుచుండెను. సింగిప్పిరానా వృద్ధునిచూచి యుండలేదు. మెట్లమీది యసిమిసంచిని చూచి యతఁడు బాటసారియని నిశ్చయించెను. సంధ్యవార్చుచుండినందువలన నా ముసలి బ్రాహ్మణుని సింగిప్పిరాను హెచ్చరించలేదు. తాను నతని చేరువనే నీటదిగి ముఖప్రక్షాళనము గావించుకొని సంధ్యవార్చ దొడగెను; సంధ్యవార్చి తటాకము వెలువడు నప్పటికి ఆ ముసలి బ్రాహ్మణుఁడు మెట్లపై గూర్చుండి యసిమి సంచిలోని పేపపెట్టెను తెఱచి యందలి పులిహోర దధ్యోదనముల నారగించుచుండెను. సింగిప్పిరాను చెంతకువచ్చి నిలిచి,—'అడియేన్, దాసుడ'నని యభివందన మొనర్చెను.

'దాసానుదాసుఁడ'నని యా ముదుసలి ప్రత్యభివందనము గావించెను.

'స్వామివారెచ్చటినుండి విచ్చేయుచున్నారు.?

'కాంచీపురమునుండి'?

'దాసుని యఱగొడ్డితనమును క్షమింపవలయును. దేవరవారి పయన మెచటికి?'

'కోవెలకు'

'ఎందులకో?'

'పెరుమాళ్లను సేవించుటకు?'

'పెరుమాళ నా?'

'ఆఁ'.

'కోవెలలో పెరుమాళ్లు లేరే? కోవెలను తురకలు పాడుచేసి నారే.'

'అవును. కోవెలను పెరుమాళ్లు త్యజింతురా? ఒక్క పర్యాయము భక్తులను కటాక్షించుట కొఱకు వాహ్యాళి వెడలిరి; మఱలి శ్రీరంగమునకు వేంచేయుచున్నారు. దేవరవారికి స్వాగత మిచ్చుటకు శ్రీవారి నగరము నలంకరించి పురజనుల సంసిద్ధపఱచుట కొఱకే ఈ దాసుఁడచటి పోవుచున్నాఁడు.' 'స్వామి వారు క్షమించవలయును ఈ దాసుని యపరాధము—తురకల యధికారము పాండ్య చోళ మండలములపై నింకను నిరాఘాటముగ సాగుచున్నదే; కోవెల మొదలగు పుణ్యక్షేత్రము లింకను వారి యధికారము క్రిందనే యున్నవే? పెరుమాళ్లు మఱలి కోవెలకు ఎట్లు రాగలరు? స్వామివారి కడక ఎట్లు నెఱవేఱగలదు? ఈ ప్రయాణము వ్యర్థము గాదా?'

ఈ ప్రశ్నల దొంతరను విని యా ముసలి బ్రాహ్మణుఁడు నవ్వి ఇట్లు బదులు పలికెను. 'కోవెల మొదలగు పుణ్యక్షేత్రములు మహమ్మదీయుల యేలుబడి క్రింది దేశమున నిమిడియుండుట నిజమే; కాని పెరుమాళ్లు ప్రభావము తురకల శక్తికి దీసిపోయినదా? దైవోపహతులైన తురకలన నెంత? వారికి పోగాలము సమీపించినది?'

'స్వామివారి మాటను కాదనుట కీదాసుఁడు సాహసింప జాలడు; భగవంతుని ప్రభావ మెంతటి యతిశయమైనను నది మనుజుల మూలముననే కదా ప్రకటితము గావలయును. ఈ కలికాలమున దేవుఁ డెచ్చటను స్వయము దుష్టసంహారమునకు గడగినట్లు వినియుండలేదు. నేటివఱకును తురకల యధికార మప్రతిహతముగ సాగుచున్నది; వారి వినాశన సూచన లెచటను గాన్పించలేదు; ఇకవారికి పోగాలము వచ్చినదని యెంచుట కవకాశమేది?'

'కన్నులుండియు చూడజాలని వారికిని చెవులుండి వినజాలని వారికిని నచ్చచెప్పట కష్టసాధ్యము. కాని—'

ఈ దాసుని యజ్ఞానమునకు గోపించ వలదు; తెలియక స్వామివారి నడిగితిని.'

'కోపములేదు, నాయనా, కోపములేదు—విను—ఆనెగొంది నెఱుఁగుదువా?'

'ఎఱుగను, కాని అది సుప్రసిద్ధగిరి దుర్గమని వినియున్నాను. అది తుంగభద్రా తటమున గదా యున్నది.'

'హిందూ స్వతంత్రభానుఁడచట ఉదయమైనాఁడు; విద్యారణ్య మునియచట సనాతన ధర్మమును పునరుద్ధరించుటకు రాయసింహాసనమును స్థాపించినాఁడు. వారి యాదేశము చొప్పున సంగమ రాజ పుత్రులు హరిహర బుక్కనృపాలురు హిందూ పారతంత్ర్య నిర్మూలనకు గంకణము కట్టుకొని యున్నారు.'

'చిత్తము. వారింతదూరమువచ్చి పాండ్యచోళ మండలములను తురకలను బాఱదోలి విడుదల సేయుదురా?'

'తప్పక. కోవెలయందు శ్రీరంగనాథుని పునః ప్రతిష్ఠ సేయవలయునని విద్యారణ్యులవారి యాజ్ఞయైనది. రాయలవారి సైన్యముతోఁగూడ తిరుమల నుండి పెరుమాళ్లు తరలివచ్చి సింగపుర మహాగ్రహారమున వేంచేసి యున్నారు. ఇకనైన మ్లేచ్ఛులకు పోగాలము వచ్చినదను నమ్మకము గలుగుచున్నదా?'

'చిత్తము.'

మాటల ధోరణియందు వారు ప్రొద్దు గుంకుటను గాని చీకటి పడుటను గాని గమనించలేదు. ఆ ముసలి బ్రాహ్మణుని మాటలు సింగప్పిరాను నొక నూతన యూహాప్రపంచమున ముంచివేసినవి; మరల శ్రీ రంగనాథుఁడు కోవెలకు వచ్చుచున్నాడా? తా నెట్టి మూఢుఁడు; భగవంతుని ప్రభావము ప్రకాశించుటకు ఎన్ని మార్గములు లేవు. ఎట్టి పుణ్యాత్ముఁడా విద్యారణ్య ముని; భగవంతుని కరుణా కటాక్ష వీక్షములా మహనీయునిపై బఱగినవి. ఆయన భక్తి మహిమ యెట్టిదో తన్ను కోవెలకు గొనిపొమ్మను భగవంతుని యాజ్ఞకు గురి యగుటకు? శ్రీ రంగనాథుని సేవ వంశపారంపర్యముగ దనకు వచ్చిన కాణయాచి—తనపై

దేవాదిదేవునికి దయలేక పోవుట తన దురదృష్టము. అవును, కులధర్మము ననుసరింపక మ్లేచ్ఛులతో గలసి మెలసి తిరుగుచు మ్లేచ్ఛభాష నభ్యసించి మ్లేచ్ఛుడగుటకు సంసిద్ధుడైన తన్నేల రంగనాథుడు కటాక్షించును? కటాక్షించడా? తన తండ్రి తాతముత్తాతల సేవ యేమైపోయినది; పెరుమాళ్ల కోవెలకు వచ్చునప్పటికి తాను నచటికే పోయి తన కాణయాచి నిమ్మని నిక్కచ్చి పెట్టిన యెట్లు తప్పించుకొనగలడు? అని పలు విధముల చింతించి తుదకు దృఢ నిశ్చయుడై 'స్వామీ!' యని యా ముసలి బ్రాహ్మణుని హెచ్చరించెను.

'ఏమి నాయనా? చాల ప్రొద్దుపోయినది. ఈ గ్రామములోనికిబోయి రాత్రి విశ్రమించుట కెవరి పంచయాశ్రయమునైనను వెదకుకొనవలసి యున్నది. పోవుదమా?'

'చిత్తము. స్వామివారు ఈ దాసుని ఇంట నీ రాత్రి నిద్రింపవచ్చును. ఈ దాసునికొక కోరిక కలిగినది. స్వామివారు సమ్మతింతురేని మనవి చేసుకొనుచున్నాను.'

'చెప్పుము; శక్తికిమించకపోయిన నీ యభీష్టమును నెఱవేర్చుటకంటె మించిన ప్రియకార్యమేమియు లేదు.'

'స్వామివారికి సేవచేయుచు స్వామివారితోగూడ కోవెలకీ దాసుడు వచ్చుటకు సమ్మతింతురా?'

'అగత్యము రావచ్చును, నాయనా, నిన్ను నేను మోయుదునా ఏమి.'

అంతట నచటనుండి లేచి యా ముసలి బ్రాహ్మణుడు సింగప్పిరానుతో గూడ నతని ఇంటికి బోయి వాకిటి పంచ యరుగుపై దన మీది పచ్చడమును బఱచుకొని యసిమిసంచిని తలగడగ నుంచికొని విశ్రమించెను. సింగప్పిరా నటు తరువాత గృహములోనికి ప్రవేశించి భోజనాదికములను ముగించుకొని మరలి పంచలోనికి వచ్చెను. అప్పటికే ఆ ముసలి బ్రాహ్మణుడు గురకపెట్టి నిదురించుచుండినాడు. ఆయనను మేల్కొలుపుటకు సింగప్పిరా నిష్టపడలేదు. మెల్లగ నచట నొక మూల జుట్టిపెట్టియుండిన తెంకాయాకుచాపను బఱచుకొని యెడమచేతిని దిండు చేసికొని పండుకొనెను. కాని ఎంతసేపటికిని అతనికి నిదుర పట్టలేదు; మనస్సు పరిపరి విధముల బఱుగులిడ నారంభించినది. అంతదనుక నతని జీవయాత్ర యా కుగ్రామమున నిర్వక్రముగ నడచినది; విద్యాభ్యాసమున నిమగ్నుడైయుండిన కారణమున నతని కన్య చింత లేదాయె. దక్షిణ సుల్తానుగారి కొలువున ప్రాయసపదమె యతని జీవితమునకు పరమావధి. ముల్లాసాయబునకు సుల్తాను దేవిడియందు మంచి పలుకుబడి యుండుటవలన నాతని నాశ్రయించి తన్మూలమున దన మనోరథ సిద్ధి బడయనెంచెను; కాని యా ముసలి బ్రాహ్మణునితోడి సమాగమమతని దృక్పథము నన్యత్ర త్రిప్పివేసినది. అతని జీవయాత్ర యందది యొక విషమ ఘట్టము, చీలుబాటల కూడలి—ఏ మార్గము ననుసరించి ముందునకు సాగుట యుక్తమో నిశ్చయించుకొనవలసి వచ్చినది. ఆ ముసలి బ్రాహ్మణునితో గూడ శ్రీరంగమునకు వచ్చెదనని చెప్పినాడు. ఇంతకాలమును నేర్చిన విద్యను వ్యర్థము జేసి సుల్తాను కొలువుమీది యాశకు స్వస్తి చెప్పి శ్రీరంగమునకు బోవుట శ్రేయస్కరమా? ఆ బ్రాహ్మణుడు చెప్పినట్లు, కోవెలకు పెరుమాళ్ల పునరాగమనము వాస్తవమైనను దనవలన నచట జరుగవలసిన ముఖ్యకార్యములేమి కలవు? తానొక సామాన్య జనుడు; కుగ్రామవాసి. దేశములేలు ప్రభువులు సేయగడగిన మహాకార్యమునకు దన సాయమవశ్యము గాదు; కాని తన పెద్దలు తరతరములనుండియు శ్రీరంగనాథుని దాసులు; వారి వంశమున బుట్టిన కారణమున దాను రంగనాథుని దాసుడే. దాస ధర్మమునకు వ్యతిరిక్తముగ బ్రవర్తించుటకు దనకు స్వాతంత్ర్య మెచ్చటిది? యజమానుని యాజ్ఞయైన ప్రాణములైన సమర్పించుకొనవలసినది దాసుని విధి. పెరుమాళ్ల యాజ్ఞయైనది. ఆ వృద్ధ బ్రాహ్మణుని మూలమున సేవకు రావలసినదని యుత్తరు పంపినాడు; తనకు దన పెద్దలనుండి సంక్రమించిన యాస్తియంతయు పెరుమాళ్లదాస్య మొక్కటియే. దానిని త్యజించుటమేలా? ఇట్లు చింతించుచు జాలసేపు తేఱిపోయుచు సింగప్పిరాను పడకపై బొరలుచుండెను. పలుమారు కన్నులను గట్టిగ మూసికొని మనస్సును గళవళ పెట్టుచుండిన భావ

పరంపరను గుడియబట్టువలయునని ప్రయత్న మొనర్చెను; కాని గోవావు కోడెలవలె బాణుతెంపు తలంపుల తనిచే గట్టుబడవాయె. తుదకు అతని కన్ను లప్రయత్నముగనె మూతలు బడిపోయినవి. హృదయ నిక్షిప్తాజ్ఞాత భావప్రపంచమున ఇసుకయం దింకు నీటివలె నతని తలపులు లీనమై పోయినవి.

కన్నులు ముకుళితములై మనోవ్యాపార ముడిగినను సింగప్పిరాను నిద్రావస్థను జెందలేదు. ఆత్మ ప్రబోధ మందినది; అంతశ్చక్షువు వికసించెను. దివ్య దృష్టి కలిగినది; నూతన దృశ్య మొకటి పొడ కట్టినది. సూర్యోదయ సమయము—బాలసూర్యుని పసిడి కిరణములు ప్రపంచమునకు బంగారు జలపోత పోసినవి. పెన్నయేఱు — ఏటినడుమ తెల్లని యిసుక పఱపుపై బఱచిన కెంబట్టు జముకాణమువలె యరుణాతపచ్ఛాయచే గుసుంభవర్ణము దాల్చిన నీటిపాయ— ఎచ్చట జూచినను నేల యీనినట్లు జనము—స్త్రీలు, పురుషులు, బిడ్డలు, పడుచువారు, వృద్ధులు; నదీ జలమునను ఫల పుష్పాదులచే నర్చించువారు, సంకల్పమును జెప్పించుకొని నదీజలమున గ్రుంకు లిడువారు; స్నానమాడి ఫురిన తలమున నాసీనులై నామములను దిద్దునారు; స్నానార్థము వచ్చువారు; స్నానమును ముగించుకొని గట్టునకు బోవువారు వందలకొలది వేలకొలది జనము గ్రిక్కిరిసి యుండినది. ఒక రెప్పపాటు కాలమున నీ దృశ్య మెట్లో మాయమై పోయినది. దాని స్థానమున నొక గొప్ప దేవాలయము గానవచ్చినది; జనసమూహముచే బిక్కటిల్లుచుండిన ముఖమంటపము; దాని కెదుట చీకటియందు బ్రుంగు దీపస్తంభములతోడి గర్భ గృహమును గోచరించినవి. ముకుళిత హస్తములతోడి భాగవత బృందము గర్భ గృహద్వారముపైపు నిరీక్షించు చుండెను; అల్లాండు వల్లాండు పఠన ధ్వని యొకప్రక్క వేదఘోష యొక ప్రక్క సెలఁగుచుండెను; జన సమర్దమునే వాత ప్రచారము సన్నగిలి యుక్కపుట్టి ముఖమంటపొంత రాళమంతయు గమ్మరి కొలిమివలె సెగలు గ్రక్కుచుండెను: ఆ వేడి తాకునకు భక్తుల దేహములు కఱగుచున్నట్లు స్వేదజలప్రవాహ పూరితము లగుచుండినవి. ఎట్లో సింగప్పిరాను గర్భ గృహద్వారమున కెదుట స్వామి దర్శనార్థము వేచియుండు జన సమూహమునకు ముందు నిలిచియుండెను. మంత్ర పుష్పమును బఠింపుచు నర్చకులు పెద్ద హరివాణమున కర్పూర ఖండములను గుప్పపోసి వెలిగించి నివాళించుచుండిరి. ఆ వెలుఁగున చీకటియం దణగియుండు మూల విరాట్స్వరూపము స్పష్టముగ గాన వచ్చినది. శిలా విగ్రహమునకు సహజమైన జడ స్వభావము వీడి చైతన్యమును బొందినట్లు తోచినది. ఆశ్చర్య పులకాంకిత గాత్రుఁడై సింగప్పిరానా యద్భుత దృశ్యమును రెప్ప వాల్చక జూచుచుండెను. తూము తలగడ మీాది నుండి తిన్నగ రంగశాయి శిరమును పైకెత్తి లేచి కూర్చుని నట్లు గానవచ్చినది. పెరుమాళ్లకు గుడిప్రక్క నాచ్చియారు ప్రత్యక్షమైనది; 'సింగప్పిరానువంక ఆ పురాణ దంపతులు మొగము దిప్పి పిన్ననగవుతో 'కుమారా! వచ్చితివా?' యని పల్కిరి. వారి ప్రసన్న వదనము సింగప్పిరాను హృదయము నాకర్షించినది. వారి యభయహస్తమాతని మనమునం దపూర్వమైన స్థైర్యము గలిగించినది. ఇంతటనె కర్పూర నీరాజనమును గొని యర్చకులు గొనివచ్చి యతనిముందు నిలిచిరి. హస్తతలమును గర్పూర జ్వాల పైనిడి నమ్రుఁడై కన్నుల నద్దుకొనియెను. అతని మొగమునకు సెగ దాకినది. కన్నుల మూతలు వీడి మెలఁకువ వచ్చినది. దేవాలయమును లేదు; భక్తసమూహమును లేదు. తాను రాత్రి విశ్రమించిన యరుగుమీాద తాను వేసుకొనిన టెంకాయాకు చాపమీాదనే పరుండియుండెను; లోపలనెవ్వరో 'మేలుకొనవే రంగనాథా, మేలుకొను కావేరి నిలయా, మేలుకొను కరుణా సముద్రా, మేలుకొను దేవా!' యని పాడుచుండిరి. సూర్యోదయమై రేయెండ యతని ముఖముపై బ్రసరించి యుండినది. కూర్చున్నాడు. మొట్టమొదట అతని దృష్టిప్రక్క అరుగుమీాఁదికి బారినది. అది ఖాళీ. వృద్ధబ్రాహ్మణుఁడు గాని యతని యసిమిగాని కానరాలేదు. లేచి లోపలికిబోయి యతని గూర్చి విచారించి నాఁడు; అతఁడింట బ్రవేశించలేదు. వీధి వెంటబోవు వారిని అడిగినాడు. ఎవ్వఁడును చూడలేదని చెప్పినారు; తటాకము చెంతకు బోయి వెదకినాడు; అతని పొడయెచ్చటను గానరాలేదు. ఆ వృద్ధ బ్రాహ్మణుఁడు నిష్కారణముగ వంచించి పోయినందులకు చింతించుచు ధన నిత్యకృత్యముల

జేయ గడగినాడు; కాని మనస్సు నా కలలో గాంచిన దృశ్యమునుండి మరల్చుకొన జాలడాయె.

కొన్ని దినములు గడచినవి; ఆ వృద్ధ బ్రాహ్మణుని యాగమనమును, తరువాత దనకు గలిగిన స్వప్నమును అతని స్మరణము నుండి మాసిపోజొచ్చినవి; కాని మరల నొకరేయి యాకల మఱియు విస్పష్టముగ గానవచ్చినది. అది మొదలా స్వప్న మెడపడప నతనికి గలుగ నారంభించినది. రాను రాను ఆ దేవుని సుప్రసన్న వదన మతని కన్నులముందు నిరంతరము పొడకట్ట జొచ్చినది. సింగప్పిరాను అటుపిమ్మట దన గ్రామమున నుండజాలక పోయెను; చదువునందుగాని యితర కార్యములందుగాని యతని కభిరుచి పోయినది. అతని చర్యలన్నియు గలలోని కార్యములవలె కైతవములై—తోచినవి. అనుదినమును వర్తించు మనుష్య ప్రపంచము మాయా ప్రపంచముగ మారిపోయినది. ఎల్లప్పుడును నతని మనస్సు కలలో గానవచ్చిన దేవునియందె లగ్నము గాజొచ్చెను; అతని మనశ్శాంతి చెడెను; శ్రీరంగమునకుబోయి పెరుమాళ్ల పాదపద్మములపై దన శిరసుంచి పరిచర్య సేయవచ్చితి నని విన్నవించినగాని తనకు మనశ్శాంతి కుదురదను నమ్మక మాతని చిత్తమున దృఢముగ నెలకొనినది.

2

తనకలలో గానవచ్చిన శ్రీరంగమునకును వాస్తవ శ్రీరంగమునకును నెంత భేదము గానవచ్చుచున్నది. కావేరీతటమెంత శూన్యముగ గన్పట్టుచున్నది? ఏరీ ఆ తైర్థికులు? ఆ భక్తజన బృందమెక్కడ? కల నిశ్చయ మగునా? కలనిశ్చయమని వచ్చుటకు దానెట్టి మూఢుడు! ఇంతదూరము వచ్చినందులకు కావేరి పుణ్యజలముల స్నానమాడి యొకసారి రంగని దర్శించి పోవుట యుక్తము. అని నిశ్చయించి నీటియందు దిగి స్నానమొనర్చి యప్పుడె యుదయించుచుండిన సూర్యుని కర్ఘ్యము సమర్పించి నీటియొడ్డున గూర్చుండి నామతీర్థము సేయ గడగెను. ముఖమున తిరుమణి దిద్ది ద్వాదశ నామములయందు తక్కిన వాని దీర్చుటకు వక్షస్థలమువంకను భుజముల వంకను దృష్టిని ద్రిప్పెను. అద్దమున గానవచ్చినది కంఠము వెనుకనుండి క్రిందితట్టు ఱొమ్ము పర్యంతము వ్యాపించియుండు నిడుపైన కత్తిగాయపు మచ్చ. అది కనులబడగనే స్మరణకు వచ్చినది సింగప్పిరాను హృదయ కుహరమున చిరకాలమునుండియు దాగియుండిన సంగతి యొక్కటి.

అది యతని జీవన ప్రభాతము; ఆఱేడేండ్ల ప్రాయము; బుద్ధియింకను జక్కగ వికసింపలేదు. సమయవరప్రాంతమందలి యొక కుగ్రామమున దనపిన తండ్రికూమార్తె పంకజవల్లికి దిరుమాంగల్య మహోత్సవము జరుగబోవుచున్నదను శుభవర్తమానము వచ్చినది. తిరుమాంగల్యము జూడబోవలయునని యతని తలిదండ్రులు తీర్మానించుకొనిరి. దూర ప్రయాణము; కాలినడకమీద ప్రయాణము సాగించుటకు అతని తల్లికి శక్తి చాలదు. ఉపరి చంక విడిచి దిగని బిడ్డ తానొక్కడు; కావున కాలి ప్రయాణము దుస్సాధ్యమైనది. బండి కట్టించుకొని బయలుదేరవలసి వచ్చినది. బండియందు తాను గాక మఱి ముగ్గురు ప్రయాణికు లుండిరి; బండి తోలు నాథముని నొగలమీద; వాని వెనుక వంట పాత్రలు పప్పు బియ్యము మొదలగు భోజన సామగ్రుల మూటలప్రక్క తల్లితో గూడ తాను; కడపట తన తండ్రి—రెండు రోజుల ప్రయాణము సుఖముగ నడచిపోయినది; మొదటిరోజు తన పినతల్లి యింటను మరుసటి ప్రొద్దొక సత్రమునను బస చేసిరి; మూడవ దినమందు ఆ యూరును మజిలీ చేసికొని మఱునాటి యుదయము పయణము సాగించి పెన్నాఱు దాటి పోవలయునని వారి యుద్దేశము. ఆ యూరు పెద్ద బ్రాహ్మణాగ్రహారము; గండరాదిత్య చోళ మహారాజా దానిని అకరము గావించి బ్రాహ్మణుల కిచ్చుటచే దానికి గండరాదిత్య చతుర్వేది మంగలమను నామాంతరము గలిగినది. వైష్ణవులవి గాని స్మార్తులవి గాని యా యూరునం దైదువందల బ్రాహ్మ కుటుంబములు నివసించుచుండినవి. అతిథి యభ్యాగతుల నాదరించుటయం దాయూరి బ్రాహ్మణులు పేరు ప్రఖ్యాతులు గలవారు. కావున నచట నొక రాత్రి బస చేసి చనుట యుక్తమని తోచినది.

వారి బండి యా యూరును జేరునప్పటికి సూర్యు డింకను అస్తంగతుడు కాలేదు; క్రుంకుట కింకను బారెడు ప్రొద్దుండినది. కాని వారనుకొని

నట్లు సౌఖ్యముగు వసతి వారి కచట దొరకునట్లు తోచదాయెను. ఏకారణము చేతనో గ్రామ మంతయు కలత జెందియుండినది; వారి రాక నెవ్వరును గమనించరాయె. జనులు భయభ్రాంతచిత్తులై నలుదెసల బరుగులిడుచుండిరి. ఏయింటి ముంగిట జూచినను ప్రయాణ సన్నాహములు గానవచ్చుచుండినవి. కపాడములుగ గట్టిన మూటలు వేగిరపాటుతో మూటలను భారవాహ జంతువర్గపు మూటల నెక్కించుక పాడీగుత్తకాండ్రును నెల్లయెడలను గానవచ్చుచుండిరి. నడివీధిలో బండి దిగి సింగప్పిరాను తండ్రి యొకరిద్దఱినేమో యడిగినాడు; కాని వారాతని మాటను చెవినిడక చెరియొక దారిని బట్టిరి. నాథమునిని వీరనారాయణ పెరుమాళ్ల కోవెలకు బండిని తోలమని చెప్పి బండి పరము నొక చేతబట్టుకొని యాతడును తిన్నగ బండి వెనుక నడచి నాడు. దేవాలయపు గోపురము ముందట బండి యాగినది; మొదట సింగప్పిరాను తల్లి బండి దిగి యటు తరువాత సింగప్పిరాను జేరదీసి చంకనిడుకొని భర్త వెంట దేవాలయమును బ్రవేశించి కల్యాణ మంటపము లోని యొక కంభముచెంత బిడ్డను దింపి కంభము నానుకొనినది. గ్రామమునందు గానవచ్చుచుండిన కళవళ చిహ్నములే దేవాలయమునందును గానవచ్చుచుండెను. స్థానపతియు స్థానమువారును సమావేశమై యుండిరి. పారుపత్యగానితోగూడ కొందఱు స్వామివారి యుత్సవ విగ్రహములను మోచికొనిపోయి దేవాలయపు భావియందు వైచిరి. శ్రీ భండారమును దెఱపించి కరణీకుల చిత్తా ప్రకారము స్వామివారి తిరువాభరణములను నమ్రుతవడి యారగింపు టవసరములందు వినియోగించు వెండి బంగారు పాత్రలను సరిచూచి స్థానపతి యొక యిత్తడి భోషాణమున బెట్టించు చుండె. అస్తమయమైనను స్వామివారి తిరుమాళిగయం దెచటను దీపారాధన ప్రయత్నము గానరాదాయె. కొంత దడవైనపిమ్మట తాము జేయుచుండిన కార్యమును ముగించుకొని యెవరి దారిని వారు పోయిరి. తరువాత దేవాలయము నంతటిని పరిశీలించి చూచుచు స్థానపతి కల్యాణ మండపమునకు వచ్చి యచట భార్య చెంత నిలిచియుండిన సింగప్పిరాను తండ్రిని గాంచి సమీపమునకు వచ్చి చేతులు మోడిచి, 'అడియేన్ దాసన్' అని యభివందించెను. సింగప్పిరాన్ తండ్రి 'దాసానుదాసన్', అని ప్రత్యభివందన మొనర్చెను.

'స్వామివా రెచ్చటికి వేంచేయు చున్నారు.'

'సమయవరమునకు.'

'సమయవరమునకా?'

'ఆఁ అచట నా తమ్ముని కుమార్తె తిరుమాంగల్య మహోత్సవము జరుపుటకు పెద్దలు నిశ్చయించినారు. ఆ శుభ సమయమున దాసుడచ్చట వచ్చు భక్తబృందమునకు సేవయొసర్పవలసి యున్నది.'

'స్వామి వారచటికి పో వలను పడదేమో?'

'ఏల.'

'దేశ సంక్షోభమువలన.'

'అట్లనెదరేల? బల్లాలరాయలు దేశమును పాలించుచుండగా సంక్షోభమెట్లు కలుగును?'

'బల్లాల రాయల యేలుబడి సమాప్తియైనది; తురకదొరలు మరల దేశము నాక్రమించుకొన్నారు; మన జాతికి వినాశకాలము సంప్రాప్తమైనది.'

'కృష్ణ! కృష్ణ! ఎవ్వరును అనుకొన గూడ లేదే. ఎప్పుడస్తంగతులైనారు మహాప్రభువులు?'

'అస్తంగతులైన చింతించవలసిన యవసరమేమి కలదు? తురకలచే జిక్కినాడు; విధికృతమును దప్పించుకొనుట కెవరికి శక్యము.'

'ఆ మహారాజును బందీకృతుని సేయునంతటి బలము తురకవారి కెచ్చటనుండి వచ్చినది; ప్రతి యుద్ధరంగమునను ఆయనచే దన్నులుతిని కోట గోడలే శరణస్థానములై దాగిరే? రామసేతువుకడ నా మహారాజు జయస్తంభమును నిలబెట్టెనను వార్తను విని యింక నొక్క వారము దినములుగూడ దాట లేదే.'

'నిజమే, నిన్నటి మధ్యాహ్నము వఱకును ఎవరనుకొన్నారు ఆయన తురకులను పూర్ణాహుతి సేయుడని? ఎంతమంచి గొల్లవానియందైనా వేపకాయంత వెఱ్ఱియుండకపోదను సామెత కాయన చక్కని నిదర్శనము. స్వయం కృతాపరాధమునకు దగిన శిక్షయే యైనది. కాని ఆ ప్రభువును నిందించుట తప్పు.

బుద్ధిః కర్మానుసారిణీ యన్నారు పెద్దలు...ఆయన యేమి చేయగలడు?'

'స్వయంకృతాపరాధమా?'

'కాక మఱేమి? పాముపై గరుణించి దానికి పాలుపోసి సాకినను అది కఱవక మానునా?'

స్వామివారు చెప్పుమాట లీ దాసునకు దుర్గ్రాహ్యములుగ నున్నవి?'

'వినుఁడు చెప్పెదను; సేతు మూలమున జయ స్తంభమును నాటిన పిమ్మట, చోళ పాండ్య మండలములం దచట నచట గాపుండిన తురక దళములను ఠాణ్యములను ధ్వంసము జేసిరి; చోళ మండలమున నొక్క తురక పురుగునైనను రానీయక చిదుగబొడిచి రూపు మాపెను—'

'బాగు, బాగు! మఱి స్వయంకృతాపరాధ మంటిరే?'

'కొంచమోపిక బిగబట్టి తుదముట్ట వినుడు. పాండ్య మండలముపై దండయాత్ర సాగించి దక్షిణ భారతభూమిని నిష్తురుష్కను గావింప నిశ్చయించి దళములను నడపినాడు. రణరంగమున బహిరంగముగ బల్లాళరాయల నెదుర్కొనజాలిన బలము మధుర సుల్తానుకడ లేదు; కలుగులలోని యెలుకలవలె ఎక్కడ తురక లక్కడ దాగిరి. కాని కావేరి దాటుటకు పూర్వము దాని యొడ్డున నచట నచట గల తురక ఠాణ్యములను నిర్మూలము గావింపవలసినది యావశ్యక మాయెను. అందఱొక యెత్తు అగస్త్యుఁ డొక యెత్తన్నట్లు తక్కిన తావుల నాక్రమించుట కంటె కన్ననూరు కుప్పమును బట్టుకొనుట బహు దుష్కర కార్యమైనది. కాని రాయల వారా స్థలముల నన్నిటిని స్వాధీనపఱచుకొని కడపట కన్ననూరు కుప్పముపై దండు నడపెను; మహమ్మదీయు లతని నరికట్ట బ్రయత్నము సల్పిరి; కాని పరాజయము నంది మధురకు బాఱిపోయిరి; రాయ లంతట కన్ననూరు కుప్పము నాఱు నెలల పర్యంతము ముట్టడించెను. తురకలకు తల ప్రాణము తోకకు వచ్చినట్లైనది. పుట్టలోని పాములను చిదగ బొడిచినట్లు వారిని ధ్వంసము సేయక వారిపై కరుణించి కోటను పశపఱచి పోయిన సుఖముగ పోనిచ్చెదనని వర్తమానము జేసెను; తమ సుల్తానుగారి యనుమతిని బొంది యట్లే చేయుదుమనియు, సుల్తానుకు దెలియజేసి యతని యాజ్ఞను బడయుట కొక పక్షము కాలము పట్టుననియు నంతవఱకు యుద్ధము నాపి తమతో దాత్కాలిక సంధి కొడంబడవలయు ననియు గోరిరి. తెల్లనివన్నియు పాలు నల్లని వన్నియు నీరని విశ్వసించు నా ప్రభువందులకు సమ్మతించి యుద్ధమును సాలించి శిబిరములయందు విశ్రాంతిమైనుండెను. పదిహేను దినము లింకను గడువ లేదు. ఒకనాడు మధ్యాహ్న సమయము. ఎండ వేడియోర్వ గూడక పోయెను. నిర్భయముగ బల్లాళ రాయల సైన్యముల శిబిరములయందు విశ్రమించి యుండిరి. పహరావాండ్రుకు సైతము దమస్థానము లందె సొమ్మసిల్లి నిద్రించు చుండిరి. మబ్బులేని మింటినుండి పడిన పిడుగువలె పైఁబడినది తురక దండు. సుల్తాను ఘయ్యాజుద్దీను దామ్ఘనుషా స్వయముగ దండు నడపుకొని వచ్చినాడు; అతనికి దాపటను వెలుపటను సైపుద్దీను బహాదూరు మలిక్ మహమ్మదులను దళనాయకులు కుడి యెడమ భుజముల వలె వచ్చిరి. ఆదమరచి యుండిన హిందూ శిబిరముపై బడిరి. హిందూ భటులందఱు కసాయి వానిచేతి గొఱియ లైరి. ఒక భటునికైనను ఆయుధమును ధరించుట కవకాశము లేకపోయినది. అనేకులు మడిసిరి; పెక్కండ్రు పరారియైరి. ప్రొద్దు వ్రాలునప్పటికి బల్లాళరాయ సైన్యము ధ్వంసమై పోయినది. బళ్లాలరాయలు—ఎనుబదియేండ్ల వృద్ధుఁడు—గుఱ్ఱమునెక్కి శిబిరమునుండి పాఱిపోవుచుండగా తురక రౌతున కొకనికి పట్టుబడి బందీకృతుఁడైనాఁడు. ఇది జరిగిన వృత్తాంతము. సమయవరమునకు ప్రయాణము సాగునో లేదో స్వామివారే నిర్ణయించుకొన వచ్చును.'

'ఎంతటి యాపద! ఎంతటి యాపద! మన జాతికి దేశమునకును గీడు మూడినది; ధర్మ విప్ల

వము తప్పక గలుగును. కానున్నది కాకమానదు గదా. భగవంతునికి మనపై నెప్పుడు కరుణ కలుగునో? ఇచటనుండి రేపటి యుదయము పయనమును విసర్జించి వచ్చిన దారినే వెనుదిరిగిపోవుట యుక్తము.'

'రేపటి యుదయముననా?'

'మఱి ఈ రాత్రియందు ఎటు ప్రయాణము సేయగలము? మా యింటి యజమానురాలు మిక్కిలియు బడలియున్నది. పిల్లవానికి నిద్రాసమయము. ఎద్దులు డస్సియున్నవి.'

'స్వామివారు గ్రామములోని పరిస్థితులను గమనించి చూడలేదు కాబోలు.'

'చూడకేమి? మాటల సందడిని మఱచిపోతిని. గ్రామమున నెచ్చట జూచినను సంభ్రమ సూచనలు బొడకట్టుచుండినది. భయమునకు గారణమేమో తెలియదు.'

'తురక దండిటు వచ్చుచున్నదనియు దారి పొడుగునను ఇడియని దేవాలయమును, నగ్నియందు భస్మము గాని గృహమును, మానభంగ మొందని స్త్రీయు ప్రాణము గోల్పోని మనుష్యుడు లేడని సమాచారము వచ్చినది. భయమునకు గారణము లేకేమి? ఈ యవాంత్రమును దప్పించుకొని యాలుబిడ్డలతో క్షేమముగ గట్టెక్కినవాడు గదా ధన్యుడు.'

'మీరు చెప్పినది గాలివార్త యని తోచుచున్నది. పెన్నాఱు వఱకును శంబువరాయల రాష్ట్రము. అన్యరాష్ట్రముపై నిష్కారణముగ సుల్తాను నెత్తిరా సాహసించునా? రాజనారాయణ శంబువరాయం డేమి యంతటి కొంచె కాడా?'

'స్వామి వారి వాక్యములు కాదన్నందులకు క్షమింపవలయును. తురకల కొక నీతి నియమమును కలదా? చెంగము కనుమనుండి కర్ణాటక సైన్యము వచ్చునను భయము సుల్తాను గుండెల నలజడి పెట్టుచున్నదట. వారి నిటువైపు రానీయక కనుమ నరికట్టి సైన్యమును గదల్చుకొని వచ్చుచున్నాడట. అది యెట్లున్న నేమి? సభవారు తీర్మానించినారు, ఈ యుపద్రవము కడచుననంతవఱకును గ్రామమును వదలి చుట్టుపట్లనుండు నడవులకు వలస పోవుట యుక్తమని—ఇక గడియకో రెండు గడియలకో గ్రామస్థు లందఱు తరల బోవుచున్నారు. స్వామి వారి చిత్తము వచ్చినట్లు చేయవచ్చును.'

'నే నొంటరిని, పరదేశిని; నేను మాత్ర మేమి సేయగలను'? నలుగురితోపాటు నారాయణా యనుటయే శ్రేయస్కరము.

(సశేషం)



శిలా శిల్పకళ విశిష్టత

శ్రీ నోరి నరసింహ శాస్త్రి

1

శిల్పము, చిత్రకళ, సంగీతము, నృత్యము, కావ్య రచన—ఇవి అన్నీ లలిత కళలుగా భావింపబడు తున్నా దేని విశిష్టత దానికున్నది. ఐనా తక్కిన లలితకళలకు వేనికీలేని విశిష్టత శిలా శిల్పానికి ఉన్నది. ఈ శిల్పము ఎక్కడ ఏ విధంగా రూపొందు తుందో చక్కగా భావించి నప్పుడే కాని దాని స్వరూపము అవగతము కాదు.

కవి కావ్యస్వరూపము హృదయగతము చేసు కొని శబ్దస్వరూపములోకి దించుతాడు. తాను భావించిన భావనకూ చెప్పేవాక్కుకూ అవినాభావ సంబంధ ముండేట్లు చేస్తాడు. వాక్కుమీద అధికార మున్న వానికే అది సాధ్యపడుతుంది.

అట్లే చిత్రకళాకారుడు తన భావనను రేఖలతో వర్ణములతో రూపొందిస్తాడు. రేఖలు వ్రాయడంలో రంగులు వేయడములో అతనికున్న అనుభవము జోడిస్తాడు. చిత్రము చిత్రించేది కాగితముమీద కావచ్చును, చర్మముమీద కావచ్చును, పటముమీద కావచ్చును, కుడ్యముమీద కావచ్చును, రత్నాదుల మీద కావచ్చును, కుండమీద కావచ్చును. ఆయా వస్తువుల గుణములకు అనుగుణముగా తన పద్ధతి మార్పు చేస్తాడు.

అట్లే వాగ్గేయకారుడు తన హృదయములో ఆవిర్భవించిన సంగీతమును—ధాతువును—మాటలలో—ధాతువులో—కూరుస్తాడు.

నర్తకుడు కూడా తాను ప్రదర్శింప దలచిన భావాలను తన అంగవిన్యాసాదులతో ఆకాశములో రేఖలు గీసి ప్రదర్శిస్తాడు.

ఈ విధంగా ఈ లలిత కళాకారులు తమ హృదయములో ఆవిర్భవించిన భావమును తాము ఎన్ను కొన్న సాధనములోనికీ ద్రవ్యములోనికీ యోగింప జేస్తారు.

మరి శిలా శిల్పి? అతడు ఉపయోగించే ద్రవ్యము శిల. అతడు చేసేది తాను భావించిన రూపమును శిలలో శాణటంకములతో మూర్తీభవింప జేయడమేనా? సాధారణముగా అంతే అనే భావము సర్వే సర్వత్ర వ్యాపించి ఉన్నది. ఈ శిల్పమునుగూర్చి వ్రాసిన వ్యాసకర్తలు కాని, కథకులు కవులుగాని, ఎక్కువగా అదే భావము ప్రకటించినారు. సాధారణ శిలా శిల్పులుచేసే పని కూడా అదే కావచ్చును. కంచు మొదలైన లోహాలతో విగ్రహాలు పోతపోసే శిల్పులుకూడా చేసేది అదే కావచ్చును. కాని శిలలలో మూర్తులు శిల్పించే మహా శిల్పులు మాత్రము చేసేది అది కానేకాదు. అదే వారి విశిష్టత! ఏమిటది?

2

కవి తన భావనకు వాక్కును అనుకూలముగా మలచుకో గలడు. చిత్రకారుడు భావనానుకూలముగా పెన్సిలును తూలికలను రంగులను వస్తువును మలచుకోగలుగుతాడు. అట్లే వాగ్గేయకారుడు వాక్కును, నటుడు తన అంగములను స్వాధీనము చేసుకుంటారు. కాని శిలాశిల్పికి అట్టిది సాధ్యము కాదు. తక్కిన కళాకారుల సాధనములు వారి స్వాధీనములో ఉంటవి. కాని శిల అట్లాకాక స్వతంత్రమైనది. తక్కిన కళాకారులవలె శిలాశిల్పికూడా శిలలోకి తన భావరూపము చెక్కడానికి పూనుకుంటే, అతనికది సాధ్యముకాదు. ఆ రాయి చంద్రకాంతపు రాయి (Marble) కాని, నల్లశాణపు రాయికాని, ఎర్ర రాయికాని, సున్నపురాయికాని, దేని రూపము దానికుంటుంది. శిలవట్టి సుద్దముద్దవంటిది కాదు. దారువులకువలెనే రాతికిని ఎన్నో పొరలు, గీరలు,

పొరుపులు ఉంటవి. వానికి అడ్డురాకుండా తన భావనను శిలాశిల్పి రూపొందించుకోవలె. తన భావనకు అనుకూలముగా ఉన్న శిలను వెదకు కొనడానికి పూనుకొంటే, ఏళ్ల పూళ్లు వెదకినా, దొరకక పోవచ్చును. శిల్పాలకు ఉపయోగపడే శిలలు సులభ సాధ్యమైనవికావు. కాబట్టి శిలాశిల్పి తనకు ప్రాప్తించిన శిలలోనే మూర్తి భావన చేయవలె. ఈ విధంగా చూస్తే శిల ప్రభువు, శిలాశిల్పి దాని సేవకుడా అనిపిస్తుంది. కాని అదీ న్యాయముగా తోచదు. అప్పుడు శిల్పి అస్వతంత్రుడౌతాడు. శిల్పి గౌరవానికి అది భంగకరము. మరి?

3

శిలా ఫలకము లభ్యమైనది. దానిని ఎన్నో విధాల స్థూల పరీక్షచేసి శిల్పయోగ్యమో కాదో ముందు నిర్ణయిస్తాడు. శిల్పయోగ్యమని నిర్ణయమైన తర్వాత దానిని బహుముఖాలుగా పరిశీలన చేస్తాడు. సూర్యకాంతిలో చంద్రకాంతిలో సంధ్యాకాంతిలో చీకటిలో దాన్ని కన్నివైపులా తిరిగి సూక్ష్మంగా పరిశోధన చేస్తాడు. దాని స్వరూపము బాగా అధ్యయనము చేసిన తర్వాత అందులో ఏ శిల్పమూర్తి నిక్షిప్తమై ఉన్నదో, దాగి ఉన్నదో, బంధింపబడి ఉన్నదో ధ్యానిస్తాడు. శిలా శిల్పికి నిజమైన హృదయము ఆ శిలలో ఉంటుంది, తన దేహంలో కాదు. ఆ మూర్తిని శిల్పి దర్శించిన తర్వాత కాని శిల్పక్రియకు ఉపక్రమించడు. ఆ శిలలో ఏ భాగంలో ఏ రూపంలో మూర్తి ఉన్నదో దర్శించి దాన్ని బయటికితీసి ప్రదర్శించడమే శిల్పి కార్యక్రమము. శిలాబంధంలో చిక్కుకొన్న మూర్తికో మూర్తులకో, శిలలోనుండి విముక్తి కలిగించే పుణ్యశాలి శిలా శిల్పి. అది ఆదరముతో, భక్తితో, ప్రేమతో కాఠిన్యముతో, వాత్సల్యముతో కాని సాధ్యముకాదు. ఇంకొక పరిభాషలో చెబితే మాయాబంధములోనున్న జీవునికి స్వస్వరూపము ప్రదర్శించే సద్గురువు వంటివాడు మహాశిలా శిల్పి!

4

ఈ శిలా శిల్పము మనదేశములో వర్ధిల్లిన వైదిక జైన బౌద్ధమతాలు మూడిటికీ సర్వసాధా

రణమే ఐనా, ఆ మూడిటిలో అది బౌద్ధమువల్ల విస్తారంగా వ్యాప్తి చెందినది. బౌద్ధములోకూడా మొదట మొదట బుద్ధపాదాలు, బోధికి ధర్మచక్ర ప్రవర్తనకూ మహాపరినిర్వాణమునకూ ప్రతీకలైన బోధివృక్షము, చక్రము, బుద్ధుదాకారమైన స్తూపము మాత్రమే పూజా స్థానాలుగా ఉండేవి. ప్రాచీన తర బౌద్ధ మనదగిన హీనయానము శాఖోపశాఖలై మహాయాన శాఖగా పరిణమించుటతోపాటు బోధిసత్వ భావన విస్తరించినట్లే శిలాశిల్పమును బహుముఖములుగా విస్తరిల్లినది.

బౌద్ధ పూర్వాచార్యులు మొదట మొదట ఈ విగ్రహ పూజను అసమ్మత దృష్టితో ఉపేక్షించి ఉండవలె. శిలా శిల్పాచార్యులు నెమ్మది నెమ్మదిగా తమ శిలా శిల్ప రహస్యమును వారికి విశదీకరించి వారి సమ్మతిని పొందియుండవలె. ఎందరో శిలా శిల్పులు బౌద్ధభిక్షువులుకూడా ఐ ఉండవచ్చును.

శాక్యగౌతముడై జన్మింపక పూర్వము ఆయన 4 అసంఖ్యేయ కల్పముల కాలము క్రిందట బ్రహ్మచారియై దీపంకర బుద్ధునివల్ల దీక్షపొంది అప్పటి నుండీ అనేక జన్మము లెత్తి దశపారమితములు—దాన, శీల, నైష్కర్మ్య, ప్రజ్ఞా, వీర్య, సత్య, క్షాంతి, అధిష్ఠాన, మైత్రి, ఉపేక్షలు—అనుష్ఠించి సిద్ధి పొంది యుండెను. ఆయన ఎత్తిన జన్మలు మనుష్య జన్మలే కాదు, పశు పక్షి వృక్షాది జన్మలు కూడా ఎత్తెను. ఏ జన్మమెత్తినను తన దీక్షనురవక దశపారమితములు అనుష్ఠించెను. ఆ జన్మలలో జీవించిన దశలకే బోధిసత్త్వ సంజ్ఞ కలదు.

గౌతమ బుద్ధుడు బుద్ధత్వము పొందిన వెంటనే మారుడు వచ్చి ఆయనను బహువిధముల ధర్షింప యత్నించెను. అందులో ఒకటి, 'గౌతమా, నీవు బుద్ధుడవైతివి. వెంటనే నిర్వాణమున ప్రవేశించి నిర్వాణ సుఖమనుభవింపుము' అని సమ్మోహింప యత్నించుట. కాని బుద్ధుడు ఈ చతుర్దశ భువనములు కర్మబంధములో చిక్కి దుఃఖముతో బాధ పడుచుండగా వారిని అందరినీ ఉద్ధరించే ఉపాయము బోధించక నేను నిర్వాణసుఖ మర్థింపను' అని భీష్మించెనట!

పై విషయములు సర్వసామాన్యముగా బౌద్ధ శాఖలన్నియు విశ్వసించున వైనందున శిలా శిల్పులు ప్రతిపాదించిన శిలా శిల్ప రహస్యము బౌద్ధాచార్యులను అందరిని నెమ్మది నెమ్మదిగా ఆకర్షించి ఒప్పించి ఉండవలె.

'బోధిసత్త్వమూర్తులు ఈ శిలా బంధములలో చిక్కుకొని మూర్తీభవించి భక్తులకు దర్శనమిచ్చి ఉద్ధరించుటకు ఆరాటపడుచున్నవి. భగవానుడు చతుర్దశ భువనములలో జీవకోటికి కర్మబంధము నుండి విముక్తి కల్పించవలెనని ఆరాటపడలేదా? మేమును శిలాబంధములలో చిక్కుకొని మాకు దర్శనమిస్తున్న బోధిసత్త్వావతార మూర్తులకు శిలా బంధము తొలగించి సువ్యక్తము చేయదలచినాము.'

స్థూలముగా పైన వివరించిన విధముగా శిలా శిల్పాచార్యులు బౌద్ధస్థవిరులకు నివేదించి వారి అనుజ్ఞపొంది ఉండవలె! శిలా శిల్పాచార్యులు మొదట వెలువరించిన బోధిసత్త్వమూర్తులను చూచి స్థవిర భిక్షువులుకూడ సమ్ముగ్ధులై ఉండవలె. ఇట్లు మొదట పొందిన అనుజ్ఞ, తర్వాత తర్వాత శాసనముగా మారి శిలా శిల్పము బహుముఖములుగా విస్తరించి వైభవస్థితిని సంపాదించి ఉండవలె!

5

పోయిన సంవత్సరము నేను నా 'విజయపురి' నవలా రచనకు ఆధారములు గ్రహించుటకు నాగార్జున సాగరము వెళ్లియుంటిని. అక్కడ నాకు పెద్దలెందరో విజయపురి పూర్వ వైభవమును లీలగానైనా తెలుసుకొనడానికి ఎంతో వాత్సల్యముతో సహకరించిరి. అట్టి వారిలో యువకుడు ఉత్సాహశాలి ఐన శ్రీ కొండిపర్తి శేషగిరిరావు ఒకరు. ఆయన మహాశిల్పుల వంశములో జన్మించిన వారు. శిలను శిల్పముగా రూపొందించుటకు శిల్పులు అనుష్ఠించు కార్యక్రమము వివిధ దశలను వారు వర్ణించుటేకాక, తొమ్మిది దశలను స్కెచ్‌ని రూపముగా వ్రాసి ఇచ్చి అభిమానముచూపి

నేను చదువ దగిన గ్రంథాలుకూడా సూచించినారు. అదంతా ఒక ఎత్తు! అందులో వారు 'పరస్థలాలు తీసివేయడము' అని శిలా శిల్పులు ఉపయోగించే పరిభాషను చెప్పడము ఒక ఎత్తు! ఆ మాటలను వారు వివరించలేదు.

'పరస్థలాలు తీసివేయడము' అని శిల్ప పరిభాషనుగూర్చి మననము చేయగా చేయగా ఆ మాటలు ఎంతో అద్భుత మనిపింప సాగినవి. వారు ఏదో సందర్భ వశముగా అన్నమాటే ఐనా నాకు హృదయానికి హత్తుకొన్నది. పరస్థలాలు అంటే ఏమిటి? శిలలో మూర్తికాకుండా ఉన్న స్థలాలు అన్నమాట; స్వస్థలము అందులో దాగిఉన్న మూర్తి. తక్కిన శిలా భాగమంతా దానిని బిగించిపట్టి మాటువరచిన పరస్థలాలు!

ఈ మధ్య ఫ్లారెంట్పైను, శిలా శిల్పులలో మహాశిల్పి అని ప్రఖ్యాతి పొందిన మైకేలు ఆంజిలో జీవిత చరిత్ర చిత్రించిన నవల చదవడము తటస్థించినది. అతడు గొప్ప చిత్రకారుడూ, కవీ, మందిర నిర్మాణ మహాస్థపతీ ఐనా, ఆయనకు అభిమానమైనది శిలా శిల్పము. అతడు రూపొందిన శిలా మూర్తి నొకదానిని చూచి సంపన్ను డొకడు ముగ్ధుడై, 'ఈ అద్భుత శిల్పమును ఎట్లా చేయగలిగినావు?' అని ప్రశ్నింపగా ఆ మహాశిల్పి ఇట్లు ప్రత్యుత్తర మిచ్చెనట!

"I had a block of Marble in which was concealcd the statue which you see there. The only effort involved is to take away the tiny pieces which surround it and prevent it from being seen. For anyone who knows how to do this, nothing could be easier."

('ఇక్కడ కనబడే మూర్తి దాగి ఉన్న శిల నాకు లభించినది. ఆ మూర్తిని చుట్టుకొని దానిని కనబడకుండా చేస్తున్న చిన్నచిన్న ముక్కలను తీసివేయుట ఒక్కటే చేయవలసి ఉన్న పని. ఆ పని చేయడము ఎరిగిన వారెవరైనా అది సులభంగా చేయగలరు!')

సరిగ్గా మన శిలా శిల్పులు 'పర స్థలాలు తీసివేయడ'మని సర్వ సాధారణంగా ప్రయోగించే పరిభాషే మరో భాషలో, మరో దేశంలో! ఇర్వింగు స్టోను వ్రాసిన మైకెలాంజిలో జీవిత చారిత్రక నవల మరల చదివి, శ్రీ శేషగిరిరావు చెప్పిన 'పరస్థలాలు తీసివేయడము' అనే శిల్ప పరిభాషను జోడించి, కొంత స్వీయమైన తాత్త్విక దృష్టితో మననము చేయగా ఇందులో ప్రతిపాదించిన శిలా శిల్ప విశిష్టత స్ఫురించినది.

శిలా శిల్పి చేసేది రాతిని చెక్కడము కాదు. తన హృదయములోని భావనకు అనుగుణంగా శిలను మూర్తిగా మలచడము కాదు. చంద్రకాంత శిలలో స్వయంభువుగా నిక్షిప్తమై ఉన్న శిలామూర్తిని దర్శించి, దాని చుట్టూ నిలిచి బంధించి మరుగుపరుస్తున్న పరస్థలాలను—శిలాబంధాన్ని—తొలగించి, దాని స్వరూపము ఆవిష్కరింప జేయడము. మాతృగర్భములోఉన్న శిశువును వేరుచేసే మంత్రసాని పని వంటిది కూడా కాదు. మాయాబద్ధుడైన జీవునికి మాయాబంధ విచ్ఛేదముచేసి స్వస్వరూపమైన ఆత్మజ్ఞానము కలిగించే, 'గురు ర్బ్రహ్మ గురు ర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః గురుస్సాక్షాత్పర బ్రహ్మ—' అని నిత్యము ఉపాసకులచే కీర్తింప బడే సద్గురుస్వామి వంటివాడు!

ఇట్టి విశిష్టత ఇతర లలిత కళాకారులకెవ్వరికీ లేదు, ఒక్క శిలా శిల్పికే తప్ప!

కలగూరగంప :

ఆంధ్ర దేశ చరిత్ర - భూగోళ సర్వస్వము

భారతి పత్రిక డిసెంబరు 1972 లో (సంపుటము 49—సంచిక 12) ఆంధ్రదేశ చరిత్ర భూగోళ సర్వస్వము మీాద సమీాక్ష ప్రకటించిన శ్రీ 'అవంతి' ఉపనామధేయులకు హృదయపూర్వక వందనాలు అర్పిస్తున్నాము. గ్రంథ విమర్శల శీర్షికలో దీనిని ప్రకటించి ఈ యుద్యమాన్ని ప్రోత్సహించిన భారతి సంపాదకులకు కృతజ్ఞతలు. సమీాక్ష మిక్కిలి సరసమై కార్యసహాయకంగా ఉంది.

ఇక్కడ ముఖ్యంగా ఒకటి రెండు అంశాలకు వివరణ ఇవ్వదలచాము. అంబాజీపేట అను గ్రామాన్ని గూర్చి ఇవ్వవలసినంత కైఫియతు ఇవ్వలేదని అన్నారు. నిజమే. ఈ విమర్శ వాస్తవంగానే ఉంది. ఇది యెట్లు జరిగిందని విచారణ చేయగా కొన్ని వింత విషయాలు బయటపడినాయి సర్వస్వంలో రావలసిన వ్యక్తులు—గ్రామాల పేర్లను అకారాదిగా పట్టిక చేసి ఆంధ్ర దేశ చరిత్ర—భూగోళ సర్వస్వము 'ముఖద్వారము' అను గ్రంథంలో సమకూర్చాము. ముఖద్వారాన్ని ఆధారంగా చేసుకొని వ్యాసాలు సిద్ధం చేస్తాము. అంబాజిపేట అను నామము ముఖద్వారంలోనికి ఎక్కనే లేదు. ఆధార గ్రంథంలోనే లోపము ఏర్పడిన దన్న మాట. ఇదెట్లా జరిగింది. తూర్పు గోదావరిజిల్లాలో అంబాజిపేట పేరు విననివారు ఉండరు. అవంతిగరు వ్రాసినట్లు ఇది ఆ జిల్లాలో సముచిత స్థానంగల పెద్ద గ్రామము అని చెప్పవచ్చును. వారం వారం ఇక్కడ జరిగే సాధారణ సంత, పశువుల సంత, కొబ్బరి వ్యాపారము ఆ ప్రాంతం వారందరికీ పరిచయమే. ఇక్కడ ఆముదం ఆడే మిల్లులు కూడా ఉన్నట్లున్నాయి. అంబాజీపేట ఆముదం అని పేరు పడింది. కురిడీ ఉత్పత్తి విస్తారంగా ఉండటంచేత ఇక్కడనుండి కమ్మని కొబ్బరినూనె ఎగుమతి అవుతుంది. ఈ వ్యాస కర్తకుమ ఆ గ్రామం పరిచితమే. బాల్యమునందు అంబాజీపేట సంతనుండి పాముల్లాంటి తెగబారెడు పొట్లకాయలు మోసి తెచ్చే వాళ్లము. అయితే మా కార్యకర్తలు ఎందుకు పొరబడ్డారు. ఇంత ముఖ్యమైన గ్రామాన్ని ముఖద్వారంలోకి ఎందుకు ఎక్కించలేదు అని విచారణ చేసినాము.

ఈ గ్రామాల పేర్లు మేము ప్రభుత్వ ప్రచురణల్లోనుంచి సేకరించినాము. దేశం మొత్తంమీాద గ్రామాల పేర్లన్నీ ఎవరికీ తెలియవు. జ్ఞప్తిలో ఉండవు. ఎవరి మట్టుకు వారు తమ గ్రామం పేరు ఈ కోశంలోకి ఎక్కిందా లేదా అని పరీక్షించుకోవాలి. అది మూడువేల జనాభాకు మించిన గ్రామమైతే భూగోళ సర్వస్వంలో ప్రత్యక్షం కావాలి. అట్లా కాకపోతే సర్వస్వ సంగ్రాహకుల లోపంగా భావించాలి. మరి అంబాజీపేట గ్రామం నిరాక్షేపంగా మూడువేల జనాభాకు పైబడి ఉంటుంది. ఇది యెట్లు తప్పించుకు పోయింది. దీనికి సమాధానం ఇవ్వాలి. మేము మా ఆధారాలన్నీ వెతికిచూస్తే తేలిన దేమంటే ప్రభుత్వ ప్రచురణలోకి అంబాజీపేట గ్రామం ఎక్కలేదు. మేము ఆధారంగా తీసుకొన్న గ్రామపట్టిక 1961 సంవత్సరపు జనాభా పరిగణనము (Censes) ను బట్టి General Administration Dept. వారు 1936 లో ప్రకటించిన తూర్పు గోదావరిజిల్లా గ్రామపట్టిక. ఇది ప్రామాణికమైన ఆధారం కాదనలేము. ప్రతిజిల్లాలోను ఉండే తాలూకాలు. ఆ తాలూకాల్లోని ఫిర్కాలు, ఫిర్కాలలో చేరిన అన్నిరకాల గ్రామాలు, వాటి జనాభా దీనిలో నమోదు చెయ్యబడి ఉన్నాయి. అంబాజీపేట గోదావరి డెల్టాలో ఉంది. డెల్టాలో పూర్వం రాజోలు, అమలాపురం తాలూకాలు రెండే ఉండినట్లు తోస్తుంది. ఇప్పుడు కొత్తపేట అనే మూడవ తాలూకా ఏర్పడి ఉంది. అంబాజీపేట గ్రామం ఆ మూడింటిలోను కూడా నమోదు చెయ్యబడలేదు. ఇది వింతయే. ప్రామాణికమైన ప్రభుత్వ ప్రచు

రణంలో అంబాజీపేట లోపించడంచేత కార్యకర్తలు దానిపేరు ముఖద్వారంపై గ్రహించలేదు. భూగోళ సర్వస్వంలో దానికి స్థానం ఏర్పడలేదు. అమలాపురం తాలూకా చరిత్ర వ్రాసే సందర్భంలో బుద్ధిమంతుడైన ఆ వ్యాసకర్త అంబాజీపేట పేరు ఎత్తి స్థల సంకోచంచేత కాలోలు సంగ్రహంగా వ్రాసి ఊరుకున్నాడు. ఈ వ్యాసకర్తను మేము అభినందిస్తున్నాము.

ప్రభుత్వ ప్రచురణలోనే ఇది యెందుకు తప్పిపోయిందో ఎవరూ చెప్పలేరు. ఈ ప్రకటనలో తప్పొప్పుల పట్టిక దీర్ఘమైనదే ఇచ్చారు. అందులోనూ అంబాజీపేట ప్రశంస లేదు. ఇది ప్రభుత్వ సంగ్రాహకులు చేసిన పొరపాటనుకోవాలి. లేదా మరొక విధంగా అన్వయించాలి. అంబాజీపేట గ్రామము డెల్టా గన్నవరము (గోదావరి అక్విడక్టు దగ్గరిది)నుంచి అమలాపురం వెళ్లే రోడ్డుమీద ఉంది. అమలాపురానికి గన్నవరానికి సమదూరంలో ఉందన వచ్చును. ఈ రోడ్డుమీద ఉండే ఇతర ముఖ్యగ్రామాలు—ముంగండ, మాచారం, బండార్లంక, ఇందుపల్లి. అంబాజీపేట మాచవరం బండార్లంకల మధ్య ఉంది. మాచారం అనబడే మాచవరం ఇప్పుడేమంత ప్రముఖ గ్రామం కాదు. ఒకప్పుడు ఇది ప్రాధాన్యంకల గ్రామమై ఉండవచ్చును. ప్రభుత్వ-వారి పట్టిక ప్రకారం ఇది పెక్కుగ్రామాలు కలిసిన నగరంగా కనబడుతుంది. దీనిలో 18 వార్డులు చూపించారు. జనాభా 10 వేలకు మించి ఉంది. బహుశః అంబాజీపేటను గూడ ఈ వార్డుల్లో కలిపి లెక్కపెట్టి ఉంటారేమో అనిపిస్తుంది. మాచవరానికి ఇంత ప్రాభవం ఇప్పుడున్నదని అనుకోము. ఇది ఒక అర్ధ శతాబ్దము లేక అంతకు ముందు చెల్లిన పరిస్థితి కావచ్చు. అప్పటికి అంబాజీపేట చిన్నదై అప్పుడప్పుడే ఏర్పడుతున్న గ్రామం. దాని పేరు చివర ఉన్న పేట అనే పదమే దీనిని ద్యోతకం చేస్తుంది. గ్రామ నామాల్లో పురము, వరము, పాక, పట్టు, పూడి వంటి పదాలు అంతమందు కలవి పూర్వకాలపు గ్రామాలని అనుకోవచ్చును. రాజమహేంద్రవరము, వేమవరము, మాచవరము, పెద్దాపురము, తాటిపాక, నందంపూడి మొదలైనవి ప్రాచీన గ్రామాలుగా కనబడతాయి. కొత్తపేట, అంబాజీపేట వంటివి అర్వాచీనంగా ఏర్పడి అభివృద్ధికి వచ్చిన గ్రామాలు.

అంబాజీపేట గ్రామం ఎట్లా పెరిగిందో అంచనా వేద్దాము. ఇది కొత్తపేట తాలూకా కార్యస్థానమైన కొత్తపేటనుండి అమలాపురం వెళ్ళే రోడ్డు మీద ఉంది. హైదరాబాదు అమలాపురం బస్సు అంబాజీపేటలోనుంచే వెళ్ళుతుంది. గన్నవరం—అమలాపురం బస్సుకూడ అంబాజీపేటను స్పృశిస్తుంది. ఈ విధంగా అంబాజీపేట ఒక కూడలిగ్రామం అయింది. మొదట ఇదియొక క్షుద్రగ్రామంగా ఆరంభించి ఉంటుంది. అప్పటికి మాచవరం పెద్దగ్రామము. రెండు రోడ్లమీదను రాకపోకలు ఎక్కువ అయేసరికి అంబాజీపేటకు ప్రాముఖ్యం ఎక్కువయింది. ప్రాచీన గ్రామమైన మాచవరం క్రమంగా సన్నగిల్లి ఉంటుంది. అయినప్పటికీ సర్కారు లెక్కల్లో మాచవరమే నడుస్తూ ఉండ వచ్చును. కుమారుడు ప్రయోజకుడై తండ్రి ముసలివాడైనా తండ్రిపేరే నడచినట్లు. కాని 1961 జనాభా లెక్కల నాటికి ఈ పరిస్థితి ఉందని చెప్పలేము. అర్ధశతాబ్ది క్రిందనే అంబాజీపేట గ్రామమున ఒక తంతి వార్తా కార్యాలయము, ఒక పోలీసు ఠాణా ఉండేవి. అనగా అప్పటికే ప్రభుత్వము వారు దీని ప్రాముఖ్యము గుర్తించినారన్న మాట. ఐనను 1961 జనాభా లెక్కలో అంబాజీపేట పేరైనను లేకుండుట వింతయే.

మాచవరము ప్రాచీన గ్రామము అనుకొనడానికి హేతువు చెప్పతున్నాము. ప్రాచీన గ్రామములు ఆ కాలపు ప్రసిద్ధ పురుషుల పేర ఏర్పడడం కలదు. రాజమహేంద్రవరము మొదటి అమ్మ రాజాకుగల బిరుదునుబట్టి ఏర్పడినదని చారిత్రకులు భావిస్తారు. తెలుగుదేశంలోని వేమవరము అను పేరుకల గ్రామాలు రెడ్డిరాజుల కాలంలో ఏర్పడి ఉంటాయి. వారిలో వేమారెడ్డి అని పేరుగలవారు ఇద్దరు ముగ్గురు ఉండేవారు. ప్రోలయ వేమారెడ్డి, అనవేమారెడ్డి,

కాటయ వేమారెడ్డి వంటి పేర్లు సర్వసాధారణము. వారిలో మాచారెడ్డి అని పేరు గలవారు ఇద్దరు ఉండేవారు. రెడ్డి రాజ్య స్థాపకుడైన ప్రోలయ వేముని అన్న మాచారెడ్డి ఒకరు ఉండెడివాడు. ఈ మాచారెడ్డి వంశంలోనే పెదకోమటి వేముడు అని ప్రసిద్ధి చెందిన రెడ్డి రాజన్యుడు ఉదయించాడు. శ్రీనాథ కవీంద్రుడు ఈయన వద్దనే విద్యాధికారిగా ఉండేవాడు. పెదకోమటి వేమారెడ్డికి మాచారెడ్డి అనే తమ్ముడు ఉండేవాడు. ఇతడు రెండవ మాచారెడ్డి. ప్రోలయ వేముని కాలంలో రెడ్డి రాజ్యము గోదావరివరకును వ్యాపించ లేదు. కోనసీమలో ఆయన అధికారము చెల్లియుండదు. అందుచేత మాచవర గ్రామమునకు మొదటి మాచారెడ్డితో సంబంధము ఉందని చెప్పడానికి ఆధారాలు లేవు. పెదకోమటి వేమారెడ్డి తమ్ముడు మాచారెడ్డి పేర కోనసీమలో మన మిప్పుడు ప్రసంగించుచున్న మాచవర గ్రామము ఏర్పడి యుండవచ్చును. పెదకోమటి వేముడు వీరుడైన తన తమ్మునికి కృష్ణకు ఉత్తరమున ఉండే ప్రాంతం ఏలుకోడానికి ఇచ్చాడు. మాచారెడ్డి కొండపల్లి ముఖ్యనగరంగా పరిపాలన చేసినట్లు శక 1336 (క్రీ. శ. 1414) నాటి అతని బలియపల్లి శాసనమువలన తెలియ వస్తూంది. (రెడ్డిరాజ్య చరిత్ర పుట 158). ఈ యన్నదమ్ము లిరువురును తమ అధికారమును గోదావరీ తీరము వరకును వ్యాపింప చేయుటకు తీవ్ర యత్నములు చేయు చుండిరి. వాస్తవమునకీ ప్రాంతము కొండవీటి రెడ్డి రాజ్యములో చేరిన దైనను రాజమహేంద్రవర రాజ్యమును పాలించు కాటయ వేమారెడ్డి పెదకోమటి వేమునితో శత్రుత్వము పాటించుటచే కొండవీటికి చెల్లకుండెను. కోనసీమకూడ కాటయవేముని అధీనము నందుండి నట్లే కన్పించును.

పెదకోమటి వేమునకును కాటయవేమునకును గోదావరి పశ్చిమ ప్రాంతము విషయమై సంగ్రామములు జరుగుచుండెను. పెదకోమటి వేముడు బహుమనీ సుల్తాను ఫిరోజుషాతో సఖ్యము పాటించి రాజమహేంద్రవర రాజ్యాన్ని స్వాధీనం చేసుకోడానికి తీవ్రప్రయత్నాలు చేశాడు. దీనికి ప్రతిగా కాటయ వేముడు రేచర్ల పద్మనాయకులతోను, విజయనగర చక్రవర్తి దేవారాయలతోను నేస్తముకట్టి పోరాడు చుండెను. ఈ నిరంతర యుద్ధములలో మహాశూరుడయ్యు కాటయవేముడు అసువులు కోల్పోయాడు. కాటయవేముని పరాజయంతో కోనసీమలో ప్రవేశం సంపాదించిన కొండవీటివారు తమ అధిపత్యాన్ని స్థాపించి నట్లు సూచనగా మాచారెడ్డి పేర మాచవరం గ్రామాన్ని నెలకొల్పి యుండవచ్చును. మాచవర గ్రామ స్థాపన మరియొకలాగ కూడా జరిగి ఉండవచ్చును.

కాటయవేముడు యుద్ధ నిహతుడైనప్పటికీ గోదావరి పశ్చిమప్రాంతం పెదకోమటి వేమునకు వశం కాలేదు. కాటయవేముని వియ్యంకుడును, సేనాపతియు మహాయోధుడును అగు అల్లాడరెడ్డి కాటయవేముని సంతానం పక్షం వహించి పెదకోమటి వేమారెడ్డితో సంగ్రామములు సాగించాడు. రాజవోలు తాలూకా రామేశ్వర గ్రామంవద్ద జరిగిన పోరాటంలో అల్లాడరెడ్డి కోమటివేముని ఓడించి అతని స్కంధావారాన్ని కొల్లగొట్టాడు. వేమారెడ్డికి మరొక ప్రక్కనుంచి ఒత్తిడి వచ్చింది. బహమనీ సుల్తాను ఫిరోజుషా కొండవీటివారి పక్షం వహించాడని చెప్పబడింది. విజయనగరం వారును దేవరకొండ పద్మనాయకులును రాజమహేంద్రవర రెడ్డిరాజ్య పక్షం వహించారు. ఫిరోజుషా బహమనీపై దెబ్బ తీయుటకై దేవరాయలు నల్గొండ పానుగల్లు దుర్గమును ఆక్రమించెను. బహమనీ సుల్తాను దానిని విడిపించుకొనుటకై ముటడి వేసెను. సహజంగా ఫిరోజుషా సామంతులైన పద్మనాయకులు పానుగల్లు యుద్ధంలో అతనికి సహాయం చేయక వెళ్లిపోయిరి. ఫిరోజుషా సైన్యాలు విజయనగరంవారిచే ఘోర పరాభవం పొందాయి. ఇంతలో పద్మనాయక ప్రభువు వేదగిరినాయుడు పెదకోమటి వేముని తమ్ముడైన మాచారెడ్డిపైబడి రణమునందాతనిని సంహరించి వాని శిరస్సును తమ్మ పడిగగా చేసుకొనెనట. పెదకోమటి వేముడు తనయనుజునకు జరిగిన పరాభవమును సహింపక వేదగిరి రేనిపైబడి

ఆ వీరుని సంహరించి వాని శిరస్సును తమ్మె పడిగగ చేసుకొని ప్రతీకారము చేశాడు. మాచారెడ్డివంటి వీరుడు సంగ్రామ నిహతు డవడానికి చింతించి ఆతని ధర్మార్థము మాచవరం గ్రామాన్ని పెదకోమటివేముడు ప్రతిష్ఠించినా ప్రతిష్ఠించి ఉండవచ్చును.

మొత్తంమీద మాచారము ప్రాచీన గ్రామంలా కనబడుతూంది. అంబాజీపేటకు ఆ పేరెట్లు వచ్చెనో చెప్పలేము. అంబాజీ అను నాతని పేరున గ్రామము ఏర్పడియుండునా? అంబాజీ అనేది తెనుగు పేరుగా కన్పించడంలేదు. ఏకోజీ, వెంకోజీ మొదలైన పేర్ల వలె మహారాష్ట్ర సంబంధాన్ని సూచిస్తూంది. అంబాజీ అనే గోసాయి లేక సజ్జనుని నివాసంచేత ఈ పేట ఏర్పడి రెండు రహదార్ల కూడలి ప్రదేశంలో ఉండడం చేత త్వరత్వరగా వ్యాపించి పోయింది. ఇప్పుడు మాచారాన్ని ఎవరూ అంతగా పరిగణించరు. అంబాజీపేట వర్తక స్థానము. ఇక్కడ హైస్కూలు ఉంది. సినీమా గృహాలు కూడ పడినట్లే ఉన్నాయి. నాటకశాలలూ సర్కసులూ ఇక్కడ సాగుతూ ఉంటాయి. ముందు వచ్చిన చెవులకంటె వెనుక వచ్చిన కొమ్ములు వాడి కదా — అంబాజీపేటయందు కొర్లపాటి వీరాస్వామి నాయుడు అనే సుప్రసిద్ధ ఆయుర్వేద వైద్యు లుండేవారు. వెనుకటి తరంవారు వీరిని ఎరుగుదురు. నాయుడుగారు గొప్ప వైద్యు లవడమే కాకుండా ప్రజాహిత చింతకుడని పేరు పొందారు. ఇటువంటి అంబాజీపేటను ప్రభుత్వ సంగ్రాహకులు విడిచిపెట్టడమూ వారి వెంట నడిచిన భూగోళ సర్వస్వ సంగ్రాహకులు గ్రహించక పోవడమూ ఒక యాదృచ్ఛిక సన్నివేశము.

ఈ సందర్భములో మేము ఆంధ్ర మహాజనులకును, ఆంధ్ర సంస్థలకును ఒక విజ్ఞాపన చేస్తున్నాము. ఇది మా గ్రంథ ప్రచారానికి చేస్తున్నామని భావింపకుందురు గాక. ఆంధ్ర రచయితల సంఘంవారు ప్రకటించిన 'ముఖద్వారము' గ్రంథాన్ని దేశంలో నాలుగు ప్రాంతాలవారూ పరిశీలించి తమకు తమకు పరిచితమైన ప్రముఖ గ్రామాలూ, నగరాలూ దీంట్లో ప్రవేశించి నాయో లేదో చూచి తప్పిపోయిన వున్నచో మాకు తెలుప ప్రార్థన. ఇంతేకాక మేము ఆధారముగా తీసుకొన్న పట్టికలు 1961 జనాభాకు సంబంధించినవి. అప్పటికిని, ఇప్పటికినీ పెక్కు గ్రామాలు జనసంఖ్యలోనూ ఇతర విధాలుగానూ పెంపొంది ఉంటాయి. ఇవి మా పట్టికలలో చేరలేదు. కావున సదరు గ్రామస్థులు తమ గ్రామపు పేర్లు ముఖద్వారంలో నమోదు కాలేదని తెలిపినచో వాటిని చేర్చుకొని గ్రంథమును ఇతోధిక ప్రయోజనవంతముగ చేయగలము. ఇదియే మా విజ్ఞప్తి.

శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం.

శ్రీనాథుని కాశ్మీర శైవము

శ్రీనాథ మహాకవియొక్క కావ్యముల యందెల్లెడను ఈశ్వరార్చన కళావైశిష్ట్యము సోతప్రోతముగ గుంఫింపబడిన విషయము సాహిత్య విమర్శకులకు పరిచితమే! ఈ మధ్య కాలమున వెలువడిన విమర్శక గ్రంథములలో ఆచార్య శ్రీ పెదపాటి నాగేశ్వరరావు గారి 'శ్రీనాథుని పంచప్రాణములు' చాల విశిష్టమైనది. అద్దానిని గూర్చి నేషనల్ బుక్ట్రస్ట్ వంటి అఖిల భారత సాహిత్య సంస్థలు కొండాడినవి. అంతియె గాక స్వాతంత్ర్యోత్తర కాలమున ప్రచురితమైన తెలుగు గ్రంథములలో విశిష్టములయిన వాటిలో నొకటిగ దానికి 1972 సంవత్సరములో జరిగిన విశ్వపుస్తక ప్రదర్శనమున కాహ్వానము లభించినది. అంతియె గాక సర్వశ్రీ నిడుదవోలు వేంకటరావుగారు, శ్రీ సుబ్బరామప్పగారు, శ్రీ తుమ్మల వారు—మొదలగు మహనీయుల ఆశీర్వచనములతో దాని వైశిష్ట్యము విదితమైనది.

ఆ గ్రంథముయొక్క చివరి ప్రకరణములో గ్రంథకర్త శ్రీనాథ మహాకవియొక్క శైవములోని బ్రాహ్మణిక విషయములను ప్రస్తావించి కొన్ని సాంకేతిక రహస్యములను వెల్లడించి నాడు. అందులో శైవగతమయిన పంచబ్రహ్మ స్తోత్రముపకు కల్యాణమున గల

శ్లో॥ పంచబ్రహ్మ షడంగ బీజముఖరీ
ప్రాసాద పంచాక్షరీ

వ్యోమ వ్యాపి పురస్సరేషు మనుషు ప్రౌఢిః
కుతో మాదృశామ్
ఓం కారాది నమోంత ముద్రిత
భవన్నామావళీ కల్పితం
సర్వం మంత్ర త్రయా ప్రభో!
పరిణమత్యంత ర్బహిర్యోగతః—

అన్న శ్లోకములో శ్రీ బంగారు తమ్మయ్య గారు అర్థమును సరిపెట్టుటకయి చాల శ్రమించిరి. కాని శ్రీ నాగేశ్వరరావుగారు వీరశైవ చంద్రిక — మొదలయిన గ్రంథములతోబాటు వశిష్ట పురాణము — లింగపురాణము–స్కాందమునందలి ప్రభాసఖండము— శైవాగమస్మృతి — సుప్రభేదాగమము కారణాగమముల నుట్టంకించిరి.

శ్రీనాథ మహాకవి రచన శైవ ధర్మమును చాటు పెట్లు కొన్ని గ్రంథ గ్రంథుల దగిన వర్ణనలలో కొన్ని విషయములను ప్రదర్శించినాడు. కశ్మీరము నందలి శైవధర్మము కాలాంతరమున శాక్తధర్మముగ మారిపోయినది. అది శైవముగనే దర్శనమిచ్చినను శాక్తేయమును వీడి దానికి అన్వయము కుదరదు. అందువలననే దాక్షిణాత్య అద్వైతులలో శైవము నభిమానించు వారిలో చాలమంది శాక్తేయులుగ మారుట సంభవించెను. ఆ మార్పులో రెండును వేదమార్గమున కన్ననేరుగ తాంత్రిక మార్గము నను సరించెను. దానితోనే ఆ తంత్రములయొక్క అవైదికత్వమునకు నాందియగుచున్నది.

ఈ తాంత్రిక మార్గములలో నాడీ మండలములు. షట్చక్రములు మొదలయిన వాటియొక్క వివరణములు శాక్త వాఙ్మయములో కోకొల్లలు. అట్టి విషయమునే శ్రీనాథు డొకచోట ప్రదర్శించెను. ఈ క్రింది వచనము తిలకింపుడు.

'శబ్ద బ్రహ్మంబు కారణ బింద్వాత్మకంబై బిందు నిష్యందత్వంబున బురుషేచ్ఛా ప్రయత్నంబున మూలాధారావస్థిత పవన సంధుక్షణంబునం జేసి అభివ్యక్తంబై పరావాక్యవం బడు. ఆ బ్రహ్మంబినాభి పర్యంతం బావాయువుచేత నభివ్యజ్యమానంబై విమర్శ రూపంబైన మనంబు తోడంగూడి సామాన్య స్పంద ప్రకాశ రూపిణియు కార్యబిందు తత్వాత్మికయు, నీశ్వరాధి దేవతయునై పశ్యంతీవాక్కనం బడు. ఆ బ్రహ్మం బా వాయువుచేతన హృదయ పర్యంతం బభివ్యజ్యమానంబై నిశ్చయాత్మక బుద్ధియుక్తంబై విశేష స్పందస్వరూపయు నాదబిందుమయయు, హిరణ్య గర్భాది దేవతయునై మధ్యమ వాక్కనం బడు. ఆ బ్రహ్మంబాస్య పర్యంతంబావాయువుచేతన కంఠాధి స్థానంబుల యందభివ్యజ్యమానంబై యకారాది క్షకారాంత వర్ణమాలా రూపంబై శ్రోత్రగ్రహణ యోగ్యంబైన వైఖరీ వాక్కనం బడు. ఈ చతుర్విధ సూక్ష్మ స్థూల మాతృకా స్వరూప విట్టి (దేవీ!) నీకు నమస్కారంబు.

కాశీఖండము. (3—49.)

ఇందులో చూపబడినదంతయు శాక్తవాఙ్మయ విషయముగనే గన్పట్టును. కాని దీనిని శ్రీనాథోపజ్ఞమని చెప్పుటలోగాని—శ్రీనాథుని కావ్యసృష్టికి సరిపోవునని చెప్పుటలోగాని యదార్థము లేదు. ఇట్టి సందర్భములపు రూపములనియే చెప్పవలెను. కాని కాశ్మీరశైవాభిమానముతో నైన శ్రీనాథమహాకవి చేర్చియుండ కూడదా? యన్నచో నది కేవలము ఒకటి రెండు వాక్యములనుబట్టిగాక అతని కావ్యములం దెల్లెడల గన్పట్టిన వైఖరినిబట్టి నిర్ణయింపవలసి యుండును. ఇట్టి సందర్భమున కాశ్మీర శైవమునకును శ్రీనాథుని శైవమునకును సంబంధము లేదనియే చెప్పవలెను. ఇకనీ సందర్భమున స్మరింపవలసిన విషయము ఈ వచనము శ్రీ మహాలక్ష్మినిగూర్చి మాత్రముద్దేశించి నదిగాని పార్వతినిగూర్చి కాదు. పార్వతిని గూర్చి చెప్పిన సందర్భములలో శ్రీనాథుడిట్టి పదజాలము నుపయోగింపక పోవుటయొక గట్టి నిదర్శనము. అట్లే శ్రీ తమ్మయగారభిప్రాయపడిన కల్యాణస్తవములోని విషయముగూడ యాదృచ్ఛికమే గాని అర్థపూరితము గాదు. శ్రీనాథుని దాక్షిణాత్య బ్రాహ్మ శైవ ధురంధరునిగ చెప్పిన శ్రీ నాగేశ్వరరావుగారి వాక్యమే సత్యమునకు దగ్గరి యభిప్రాయము.

శ్రీ చామర్తి అమరేశ్వరశర్మ

'పండితరాయల నిట్టూర్పుల'లో ఏమఱిపాట్లు

డా. మహీధర నళినీ మోహన్‌గారు పండిత రాయల జీవిత విశేషములను సమన్వయించుచుఁ జక్కని యూహాపోహలతో నతని శ్లోకములను 'భారతి'లో వివరించుచున్నారు. అంతేకాక, యా శ్లోకములకు సరళమైన తమ పద్యానువాదములను గూడ నిచ్చుచున్నారు. కనులకుఁ గట్టినట్లు చేయుచున్న మూల శ్లోకముల వివరణయు, మూలమునకుఁ దీసిపోని యాంధ్రానువాదమును మనోహరముగా సాగిపోవుచున్నవి. అయినను; అక్కడక్కడఁ గొద్దిపాటి పొరపాట్లు దొరలినవి. ప్రస్తుతము 'పండిత రాయల నిట్టూర్పులు' అని 1972 డిసెంబరు, '73 జనవరి నెలల భారతి సంచికలలోఁ బడిన వ్యాసముల లోని యేమఱిపాట్లు చూపఁబడుచున్నవి.

(1) 'విద్ధా మృగీ శాత శిలీముఖేన
మృగస్తు తత్కాతర వీక్షితేన
విహాయ దేహం విగతవ్యథైకా
పరస్య జీవావధి రాధి రాసీత్.'

(72. డిసెం. 'భారతి'లో)

'ఒక లేళ్ల జంట అడవిలో ఆనందంగా ఆడుకుంటోంది. బోయవాడు గురి చూచి వదిగిన బాణం తగిలి, ఆడలేడి నేలకి ఒరిగి పోయింది. కిరాతుని భయంకరమైన కోరచూపులు మగలేడి హృదయంలోంచి దూసుకు పోయాయి. బాణం దెబ్బ తగిలిన లేడి ప్రాణాలు వదిలేసి, నొప్పి లేనిది అయింది. అది అదృష్టవంతురాలే. కాని, విషపు చూపులు గుండెలో గుచ్చుకున్న దుప్పి మాత్రం ఆ జన్మాంతమూ మనోవ్యాధితో కృశిస్తూనే ఉంది!' అని పై శ్లోక భావము వివరింపఁ బడినది.

ఇందొక పొరపాటు జరిగినది. ఆఁడులేడి పదనైన బాణముచేఁ గొట్టఁబడినది, నిజమే. కాని మగలేడికిఁ దగిలినవి 'కిరాతుని భయంకరమైన కోర చూపులు' కావు. 'తత్కాతర నీక్షిత'ము లనఁగా బాణపు దెబ్బతిని పడిపోయిన, 'ఆ యాఁడులేడి బెదరు చూపులే.' కావుననే యా చూపులా జన్మాంతము మగలేడి మనసులో మెదలి బాధించినవి, దయనీయముగా విలవిల కొట్టుకొనుచున్న యాఁడులేడి బెఱుకు చూపుల లోని దీనత్వము నుగజింకకు జీవితాంతము జ్ఞాపకముండి కలఁత పెట్టినదని భావము. 'భయంకరమైన కోరచూపులు' 'విషపు చూపులు' అను వివరణ కాధారము మూలమున లేదు. మఱియు, లేడి చూపులను 'కాతరేక్షణము' లందురుగాని కిరాతుని భయంకరమైన చూపులను 'కాతరేక్షణ'ము లనుట యుచితము కాదు. 'తత్' పదము కిరాతుని చెప్పుననుటయు సమంజసము కాదు. 'ఆఁడులేడి శాతశిలీముఖముచే గాయపఱుపఁ బడినది. మగలేడేమో దాని (ఆఁడులేడి) కాతర వీక్షితముచే గాయపఱుపఁబడినది.' అను నర్థమే యుక్తమైనది. పక్షాంతరముగా—'తత్' పదముచేఁ గిరాతునిఁబట్టు కొందమనిన, శ్లోకములో వాఁడు కనుచూపు మేర దూరములో నెక్కడను లేఁడు. కావున వాని భయంకరమైన చూపులు మగలేడి కంటఁబడు నవకాశ మక్కడ లేదు. అందువలన 'కిరాత కాతరేక్షణోగ్రకీల సోకె దుప్పికిన్' అను ననువాదము సబబుగా లేదు.

2. (a) 'మాకన్దే మకరన్ద శీధుమధురే.. అను శ్లోకమున' కాచిల్లతా బాలా కణ్టకితం తరుం శివశివ స్వైరం సమాలిఙ్గతి' అని యున్నది. మామిడి, పున్నాగము, పొగడ మొదలగు చెట్లెన్నో యుండఁగా, ఈ పూల తీఁగె తుమ్మచెట్టును కౌఁగిలించుకొన్నదని నిట్టూర్పు తీయఁబడినది. 'కాచిత్ లతా బాలా' అనఁగా నొక లేఁదీఁగె యని యర్థము. 'బాలా' యనుటచే దాని ముగ్ధత్వముఁ గూడ సూచింపఁబడెను. ఇట్లుండ ననువాదమున 'ముండ్లచెట్లఁ బెనఁగెన్ బాలలతల్ శ్రీహరీ!' (73 జనవరి భారతిలో) అని యున్నది. 'బాల లగు లతలు' అను నర్థమున 'బాలలతలు' అని ప్రయోగింపయున్నచో నది సాధువు కాదు. 'బాల' శబ్దము భాషిత పుంస్కము కనుక,

'బాల లతలు' అనియే యుండవలయును. అప్పుడది మూలశ్లోకమున 'కాచిత్' అని అనిర్దిష్టార్థకముగా నున్న భావమునుగూడఁ జెప్పఁగలుగును.

(b) 'ఇయం బాలా వల్లీ...' అను ఆ తరువాతి శ్లోకమునకుఁ గూడ 'బాలావల్లి పెనంగె...' అనియే యనువాదము జరిగినది. 'బాలయగు వల్లి' యని చెప్పఁదలచినచో 'బాలవల్లి' యనుటయే యుక్తము.

అయినను దీని కొక విధముగా గతి కల్పించుటకు వీలు లేకపోలేదు. 'బాలా' అనఁగా (1) ఒక విధమగు మల్లె (2) చిట్టేలకి యను నర్థములు (సూ. ని.) నిఘంటువులలోఁ గలవు. ఆ పక్షమున నది సంజ్ఞావాచకము గావున, 'బాలాలత' 'బాలావల్లి' యనిన దోషము లేదు. కాని, పండిత రాయ లుద్దేశించినదియును; అనువాదకులు వివక్షించినదియును, అదియే-నా యనునది యోజింపవలసి యున్నది.

మఱియొక మాట. 'ముండ్లచెట్టుఁ బెనఁగెన్ బాలా లత శ్రీ హరి!' అను రీతి నేక వచనములం దున్ననే; మూలమునందలి 'కాచిల్లతా బాలా కణ్టకితం తరుం శివశివ స్వైరం సమాలిఙ్గతి' యను దానిలోని సొగసంతయు వచ్చుటకు వీలగును. అట్లు చేసినది యొకానొక తీఁగెయే గదా!

3. 'ఇయం బాలావల్లీ
మృదు కిసలయం తాప విలయం
ఘనచ్ఛాయం సాలం నవ మతి
విశాలం పరిగతా
పరంత్వస్యాప్యన్త ర్గరళ లవ
భస్మీకృత వనం
భుజఙ్గం ప్రోత్తుఙ్గం కథమివ
వరాకీ కలయతు'

(73. జన. భారతిలో)

'......వెనుక ముందులు చూచుకోకుండా ఒక పూలతీగె 'మద్దిచెట్టును' కౌగలించు కుంది. కానీ, తన గరళాగ్ని జ్వాలలచే చుట్టుపక్కల వనమంతనూ భస్మీపటలం చేసే సామర్థ్యం గల ఒక క్రూర భుజంగం ఆ చెట్టు తొర్రలో దాగి ఉన్నదని దానికేం తెలుసు పాపం!' అని వివరించినారు.

'పరంతు అస్యాపి అన్తః' అను పండిత రాయల పద ప్రయోగమును నిదానముగాఁ బరిశీలింపవలసి యున్నది. ఆ పూలతీఁగె యెన్నో చెట్లను ముందు వెనుకలు చూచిన పిమ్మటనే; చిగుళ్లుండుట, విశాలముగా నుండుట, పెద్దనీడ యుండుట, తాపమును హరింపఁగలిగియుండుట మొదలగు బాహ్య లక్షణములను జూచి యా మద్దిచెట్టును బెన వేసికొన్నది. (పరంతు=) అయినప్పటికిని, (అస్యాపి=) దీనికిఁ గూడ, (అన్తః=) బయటకుఁ గనఁబడని దోష మున్నదని యా (వరాకీ=) దురదృష్టవంతురాలు తెలిసికొనలేక పోయినది. ఆ చెట్టుతొఱ్ఱలో నొక క్రూర భుజంగ మున్నది. అది సామాన్యమైనది కాదు. తన గరళ లవము చేతనే వనమును భస్మీకృత మొనర్చినది. ఎత్తియెత్తి కాలెంగిలాకు మీఁద వేసినట్లాయెను గదా యని విచారము.

ఈ విధమైన విశేషమును వివరణలోఁ గాని యనువాదమునఁ గాని స్పష్టపఱచుట జరగలేదు. మఱియు శ్లోకమునఁ బ్రతీయమానమగుచున్న ముగ్ధ నాయికా పక్షమున 'తాప విలయ' 'భుజంగ' పదములు సాభిప్రాయము లనిరే కాని యంతకుమించి శ్రీ నళినీ మోహన్ గారు వివరింప లేదు ఒక ముగ్ధ కనులకింపుగా నున్నాఁడని రూప యౌవనాది సంపన్ను నొకని నెంచుకొని వరించినది. ఇంతవఱకు బాగుగనే యున్నది. అక్కడనున్న 'భుజంగ పుంగవునిఁగానఁగ లేదయ్యయో!' యనుట యెట్లు పొసంగును? 'ఇతని లోపలనున్న క్రూర భుజంగుని నా యభాగ్యురాలు గమనింపలేక పోయినది' అని పండిత రాయలు చెప్పినాఁడు; ఇది యొక విధమైన సంస్కృతపు బాణీ (మాట తీరు.) 'She could not find the debanchee in him' వంటిది. అతఁడొక స్వేచ్ఛా విహారుఁడయిన వ్యభిచారి యని గ్రహింపలేకపోయినదని భావము 'అతని బాహిర లక్షణములను జూచి వరించినదే కాని, యాంతర్యమున వాఁడొక దుష్ట భుజంగుఁడని యెట్లు తెలిసికొనఁ గలదు! పాపము' అని కని హృదయము గరళ లవ భస్మీకృతవనం' అను విశేషణముచేత, 'అతఁడెన్నో పచ్చని

సంసారములు పాడుచేసిన వాఁడ'ని ధ్వనించు చున్నది. ఇట్లు ముగ్ధనాయికా పరముగఁ బ్రతీయమానమగు నర్థము కూడ మూలమునఁ జక్కఁగాఁ బోషింపఁబడినది.

'కావున 'బాలావల్లి పెనంగెఁగాని గరళ జ్వాలాగ్నులం గాల్చు తత్కాలోత్తుంగ భుజంగునిన్ మఱి యటన్ గానంగ లేదయ్యయో!' అన్న విధముగా ననువాదమును గొంచెము సవరించిన బాగుండునేమో యని యొక సూచన. అప్పుడు; 'తత్...భుజంగునిన్' అనఁగా 'వానిలోని భుజంగుని' (భుజంగ స్వభావమును) ఆమె కనుఁగొనలేదని నాయికా పరముగ సరిపోవును. 'ఆ భుజంగుని' 'గనుఁగొనలేదని లతాపరముగను సరిపోవుచున్నది. 'గరళ జ్వాలాగ్నులం గాల్చు' అనినచో, 'గరళ లవ భస్మీకృత' అనుమూలమునకు సన్నిహితముగా నుండునని యాలోచన.

4. 'కింబాన్ధవేన రవిణా...' (73 జనవరి 'భారతి'లోది) అను శ్లోకముయొక్క యనువాదమున 'బాంధవులు గారె పద్మజ పద్మభవులు' అని యున్నది. 'పద్మజయును — పద్మభవుఁడును' అను విగ్రహము చొప్పున సిద్ధసమాసమైన 'పద్మజా పద్మభవులు' అని యుండవలయును. లేక; వ్యస్తపదములయిన, 'పద్మజ పద్మభవుఁడు' అని యుండనగును.

5. 'యేనోషితం రుచిర పల్లవ మఞ్జరీషు...' (73, జనవరి—'భారతి'.) అను శ్లోకమున కనువాదము చక్కఁగా నున్నది. 'కోకిల యొకటి దైవికముగా వేపచెట్టుపయి వ్రాలఁగాఁ గాకులు వెంటఁబడి గోల చేసినవి' యని శ్లోక సారాంశము. వివరణములో; దానికి దృష్టాంతముగా 'లవంగి చాందినీ చౌకు దాఁటి యేదో గలీలోఁ బ్రవేశింపఁగా, నక్కడ మోటు మనుష్యులామె చుట్టును జేరి వికవికలు పకపకలు మొదలుపెట్టుట' చెప్పఁబడినది. అది యంత సరసముగా లేదు. 'స కోకిల యువా' అని మూలమున నుండఁగా; ఒక యువతి వృత్తాంతము ధ్వనించి నట్లు వివరించుట యెబ్బెట్టుగా నున్నది. స్త్రీ ప్రసక్తి యనువాదమునఁ దేలేదు గనుక బాగున్నది.

'అనేక సంస్థానములందు, సభలందును సమ్మానము లందిన కవికోకిల యొక యల్పుని పంచను దైవికముగాఁ జేరఁగా; నక్కడ నెంగిలి మెతుకులు మెక్కు నాశ్రితు లతనిని 'కాకి గోల', చేసినారు, అని వివరించిన సమంజసముగా నుండును. 'దైవాత్'; 'కోకిల యువా', 'నింబే', 'బలిపుష్టకులైర్వివాదః'' అనునవి యట్టి యర్థమునే సమర్థించుచున్నవి.

6. 'వృక్షాన్వోథన మద్యతే క్వనుగతం...' (73, జనవరి — భారతిలోది.) అను శ్లోకమును బాములవానికిఁ జిక్కి దుర్దశ ననుభవించుచున్న యొక కోఁతి వృత్తాంతము చెప్పఁబడినది. దీని యనువాదము బాగుగా నున్నది: కాని, వివరణమునందు, శ్లోకములోని కోఁతి దుర్దశకును, పండిత రాయల మేనమామ కూఁతురు సీతయొక్క దుఃస్థితికిని 'పొంతన' చేయఁబడినది. 'గలవల ద్వ్యాలః కపే! నృత్యసి' అని కపికిఁ బుంలింగమునే పండిత రాయలు వచించినాఁడు.

పండిత రాయ లేస్త్రీ వ్యక్తి నయిన సూచించు తావులందు; 'హంసీ వేత్తి పరాగ పిఞ్జర తనుః...' 'ఇయం బాలావల్లీ...' ఇత్యాది శ్లోకములం దున్నట్లుగాఁ గక్కుర్తి పడ నవసరము లేకుండ స్పష్టముగనే నిట్టూర్చును.

చిన్నప్పుడెంతో యుత్సాహముగానుండి, తనతో 'కోఁతి కొమ్మంచు' లాడిన యొక బాల్యమిత్రుఁ డీనాఁ డెవరి యొద్దనో వెట్టిచాకిరి చేయుచు గుర్తు పట్ట రానంతగా మాఱిపోయినందుకు జగన్నాథ రాయలు నిట్టూర్చినాఁడని వివరించిన బాగుండును.

7. 1972 అక్టోబరు 'భారతి'లో 'పండిత రాయల చివాట్లు' అన్న వ్యాసములో—వేంకటశాస్త్రి యొవతె దగ్గరకో వెళ్లఁగా రాయలు దానిమీఁదఁ జెప్పిన చాటువులో 'సరజస్కాం' అను పదమునకు, 'బహురజోవతి' యని యనువాదమున వేసికొనఁబడినది. దాని విశేష ఔచిత్యము మాట యెట్లున్నను; 'రజ'శ్శబ్దము సకారాంతము కనుక 'రజస్వతి' యని యుండుట యుక్తము.

పయిఁ జూపిన నెరసులు కూడ లేకుండ; శ్రీ మహీధర నళినీమోహన్‌గారి కృషి నిర్దుష్టముగను సమగ్రముగను గొనసాగవలెనను కోరికయే యిది వ్రాయుటకుఁ బురికొల్పినది. ముత్తెపుచిప్పలోఁ బడిన బిందువులు ముత్యము లగునట్లు; ప్రతిభావంతుల కందింపఁబడిన యంశములు మిక్కిలి వెలుఁబెట్టి రాణించును గదా!

శ్రీ పరాశరం గోపాలకృష్ణమూర్తి.

గ్రంథవిమర్శలు

విఘ్నేశ్వర చరిత్రము

(నండూరి—బాపయకవి ప్రణీతము. పరిష్కర్త, పీఠికా కర్త—శ్రీ సూర్యదేవర—రవికుమార్. డెమ్మీ సైజు 76+74+4, వెల రూ. 2=50, ప్రచురణ : శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానము, కాణిపాకం, చిత్తూరుజిల్లా. ప్రతులకు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారికి వ్రాయవలెను)

వినాయకుని చరిత్రను వర్ణించే ప్రబంధాలు ప్రాచీనాలని చెప్పదగినవి పది వరకూ కానవస్తున్నవి. వాటిలోని వృత్తాంతాలు కూడా విభిన్నాలుగా కానవస్తాయి. కాని, పార్వతీదేవి అభ్యంగస్నానం చేసే టప్పుడు నలుగుపిండితో వినాయకుని తయారుచేసి, ప్రాణం పోసి లోపలికి ఎవ్వరూ రాకుండా ద్వారం దగ్గర కాపుంచడమూ, శివుడు ఆ బాలునిపై కోపించి తల ఎగురగొట్టి, తర్వాత ఏనుగుతల పెట్టడం, చంద్రుని అపహాస్యం, అతనికి కల్గిన శాపం, శ్రీకృష్ణునికి కలిగిన నింద, జాంబవంతునితోడి యుద్ధం, శ్రీ కృష్ణుని విజయం, మణిలాభం, జాంబవతీ, సత్యభామలను శ్రీ కృష్ణుడు పరిగ్రహించడం మున్నగు వృత్తాంతాలు గల చరిత్రయే బహుళ ప్రచారంలో ఉన్నది. ఈ వృత్తాంతాన్ని స్వీకరించే 19—వ శతాబ్ది పూర్వార్ధంలో ఉండిన నండూరి—బాపయకవి రెండాశ్వాసాల ప్రబంధంగా రచించాడు.

శ్రీ కృష్ణుడు తనమీద మోపబడిన నిందను పోగొట్టుకొనుటకు శమంతకమణిని తీసుకుని వచ్చే ప్రసక్తి ఇందులో అవసరం. బాపయకవి శ్రీ కృష్ణావతార కారణం, శ్రీ కృష్ణ జననం, అతని బాల్యక్రీడలు, ద్వారకా వృత్తాంతం, రుక్మిణీ కల్యాణం మున్నగు విషయాలను కూడా ఇందు వర్ణించాడు. ఇంకా కథలో కొన్ని మార్పులు చేశాడు. కొన్ని ఔచిత్యానికి దూరంగా ఉన్నట్లు కానవస్తున్నది.

పార్వతీదేవి ఉద్వర్తన పిష్టరితో గుజ్జురూపం గల గణపతిని నిర్మించి, తాను అభ్యంగస్నానం చేస్తున్నప్పుడు ఎవ్వరూ లోనికి రాకుండా అంతఃపుర ద్వారం వద్ద కావలి ఉంచినట్లు 18—వ పుటలో ఉన్నది. గజాసురుని సంహరించి సకల దేవతా సమేతుడై శివుడు రాగా, గణపతి అడ్డగించి, తనతో యుద్ధం చేసిన దేవతలను ఓడించాడట! దేవతలు సభాభవనంలోనో, మరొక చోటనో ఉండడం సబబు కాని, కావలివారిని కాదని అంతఃపురంలో ప్రవేశించాలని ప్రయత్నించడం ఉచితం కాదు. గణపతి తలను తెగవేసిన శివుడు పార్వతితో 'ఖర్వుడు మా త్రోవకు నడ్డమై నిలిచె' అని (పుట 21) అంటాడు. దేవతల దారికి గణపతి ఎక్కడ అడ్డం వచ్చాడు?

శివుడు గజాసురుని మస్తకాన్ని శూలానికి గుచ్చి, పార్వతీదేవికి చూపడానికి తెచ్చినట్లున్న, పాశుపతాస్త్రంచేత తెగిన వినాయకుని తలకు బదులు ఆ గజాసుర శిరస్సును గణపతి దేహానికి అతికించినట్లున్న ఇందులో వాడుకలో ఉన్న కథకంటె వేరుగా చెప్పబడి ఉన్నది.

ద్వాపరయుగం చివర క్రూరులైన రాక్షసులు రాజులుగా పుట్టి విజృంభించగా, వారిని మోయలేక భూదేవి పాలసముద్రంలో శేషశయ్యపై పవళించియున్న విష్ణువుతో మొరపెట్టుకోగా, ఆయన కృష్ణావతారం ఎత్తినట్లు ప్రసిద్ధి. ఈ ప్రబంధంలో మాత్రం వైకుంఠమునకు వెళ్లినట్లు చెప్పబడింది. దీనికి కారణం తెలియదు.

బాపయకవి రసవంతంగా రచన చేయగలవాడు. బంధకవిత్వంలోనూ, చిత్ర, గర్భ కవిత్వంలోనూ నిపుణుడు. దీనికి ఇతని మత్తేభ కంద గర్భసీసం, చతుర్విధ కందములు, స్రగ్విణీకవిత, భుజంగ ప్రయాతం, కంద, గీత గర్భిత; చంపకమాల, పుష్పమాలికా, నాగ;

చక్రబంధాలు మున్నగునవి ఉదాహరణాలు. ఇతడు తన రచనకు పోతన భాగవతాన్ని మేలుబంతిగా గ్రహించినట్లు తోస్తున్నది. రుక్మిణీ కల్యాణ ఘట్టంలోని 'హరి యొకఁ డేగినాఁడు' మున్నగువాటిని చూడవచ్చును.

కడచిన శతాబ్దిలో రచితాలైన పెక్కు పద్య కావ్యాలలో ఇది ఒకటి అని చెప్పవచ్చునేగాని, ఉత్తమ ప్రబంధమని చెప్పలేము. పరిష్కర్తలు తమ విపుల పీఠికలో చూపిన స్వతంత్ర ప్రయోగాలే కాకుండా ఇతరాలుకూడా కానవస్తున్నవి. 6 వ పుటలో—

'ఇపుడు నీవు నొనర్చు విఘ్నేశ్వరుని చ
రిత్ర మా కంకితముగ నర్పించు మెలమి,
దీన నీ కభీప్సితార్థ సిద్ధియును భువన
వినుత విఖ్యాతి గల్గు సద్వినుత చరిత'

అనే పద్యంలో 'నీ వొనర్చు' అనుటకు 'నీవు నొనర్చు' అనడం బాగులేదు. మూడవ పాదంలో ఛందస్సు తప్పినది. 12 వ పుటలోని సీసపాదం

'మున్నీటి యెకిమీనిఁ గన్నీటఁ దోఁగించె
వీడ్వడఁగాఁజేసి గాడ్పు బలిమి'

అని ఉన్నది. ఇక్కడ రెండవ పంక్తిలో యతి నష్టమయింది. 'వీడ్వడు' అంటే యతి కుదురుతుంది; గాని 'వీడ్వడు' అనేదే సుప్రసిద్ధ పదం. శివుడు 'నాగభూషణుండు' అని చెప్పడం ఉచితం; కాని 'అజగరభూషణుండు' (కొండ చిలువ భూషణంగా కలవాఁడు) (పు, 13.) అనడం సరికాదు.

'దేవత లుంచిన కర దీ
పావళి యనఁ జంద్రబింబ మపు డలరారెన్'

అని 56 వ పుటలోని కందపద్య భాగం. చంద్రబింబాన్ని కరదీపాల సమూహంగా చెప్పడం సరియైనట్లు తోచదు.

'పిండివంటలు మొదలుగఁ బెక్కు హారములు గొనుచు'—(పుట 68.) అనే చోట కానుకలు—లేక ఆహార వస్తువులు అనే అర్థంలో 'హారములు' అనడం సరికాదు.

ఇలాటివే కాకుండా అచ్చు తప్పులూ చాలా ఉన్నవి. తప్పొప్పుల పట్టికలో చేరక జారిపోయినవి ముఖ్యమైనవి కొన్ని—'బాల శశాంక శేఖరునిఁబట్టి' (పు. 2) 'శేఖరునిపట్టి' అని ఉండాలి. 'దృఢతను ప్రాణంబు' (పుట 14) ఇక్కడ 'దృఢతను త్రాణంబు' అని ఉండవలెను. 'శక్రముఖాదుల' (పు. 19.) 'శక్రముఖ్యాదుల' అనుటకు, 'శ్రీవత్స వత్సాయ' (పు. 32) శ్రీ వత్సవక్షాయ—అనుటకు 'దంచచేలము' (పు. 46) దంతచేలము—అనుటకు 'ఫలములు చెప్పమేఁక' (పు 68) ఫలములు గొప్ప మేఁక అనుటకు. ఇట్టి తప్పులవల్ల పద్యాలు అర్థం చేసుకోవడం చాలా కష్టమయిపోతుంది. ఏ-ఐ-ఓ-ఔ— లు మారుగా ఉండడం తరచుగా కానవస్తుంది.

దీని వ్రాతప్రతులు తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ప్రాచ్యపరిశోధనాలయంలో ఉన్నవట. పరిష్కర్తలు వాటికి ప్రతులువ్రాసి ఈ గ్రంథాన్ని ప్రకటించారు. కానీ చేసేటప్పుడూ, ముద్రించేటప్పుడూ కొంత జాగ్రత్త తీసికొంటే చాలామట్టుకు తప్పులు లేకుండా ముద్రించడానికి అవకాశం ఉండేది.

గ్రంథం సంగతి ఎలా ఉన్నా దీనికి పరిష్కర్త కూర్చిన విపులమైన పీఠిక ఎంతో విలువైనది. రవికుమార్‌గారు ఎంతో పరిశ్రమచేసి, పెక్కు విషయాలను సేకరించి వినాయకుని గురించివున్న గ్రంథాలను గురించీ, వినాయక క్షేత్రాలను గురించీ, కవిని గురించీ, అతని యితర కృతులను గురించీ కవి వాడిన కొన్ని స్వతంత్ర ప్రయోగాలను గురించీ వివరించారు. ముఖ్యంగా చిత్తూరుజిల్లా కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక దేవాలయాన్నిగూర్చీ, మణికంఠేశ్వర, వరద రాజాలయాలను గురించీ ఎన్నో విషయాలు అందజేశారు. గ్రంథ పరిష్కరణకూ, విపుల పీఠికతో దీని ముద్రణకూ వీరికి శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానాధికారులు తగిన ప్రోత్సాహం ఇచ్చి, ఛాయా చిత్రాలతోకూడా బాపయకవి రచన ఆంధ్రులకు లభించేటట్లు చేశారు. ఇంతవరకూ అముద్రితంగా ఉండిన 'విఘ్నేశ్వర చరిత్ర'ను ఆంధ్రులకు లభింపజేసిన పరిష్కర్తకూ, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు ఎస్. పి. సుబ్బారెడ్డిగారికీ, ఎండోమెంట్సు

డిపార్టుమెంటు అసిస్టెంటు కమీషనరు ఎ. వెంక టేశ్వరరావు గారికీ కృతజ్ఞతలు తెల్పవలసి ఉన్నది.

"ఆంగీరస"

కవిత్వం—చైతన్యం

(త్రిపురనేని మధుసూదనరావు, వెల—నూట ఏభయి పైసలు. ప్రతులకు — బాలాజీ పబిషర్సు, బజారువీధి, తిరుపతి)

విప్లవ రచయితల రచనలకు తాత్విక ప్రాతిపదిక నిస్తూ, వారి భావాలను సూత్ర నిబద్ధంచేస్తూ శ్రీ త్రిపురనేని మధుసూధనరావుగారు వ్రాసిన ఏడు వ్యాసాలను విప్లవ రచయితల సంఘం, తిరుపతిశాఖ వారు ఈ చిన్నసంకలనంగా ప్రచురించడం అభినందనీయం. విరసం వారి సాహిత్య సమాలోచనలను ఇతర సాహిత్యాభిమానులు అర్థం చేసుకోడానికీ, సాహిత్య సమరాంగణంలో నిలబడి తమ ఆలోచనల బలాన్ని విరసం మిత్రులు తెలుసుకోడానికీ ఈ ప్రచురణ అవకాశం కలిగిస్తూంది. అందుకే వారికి నా అభినందన.

ఏడు వ్యాసాలున్న ఈ సంపుటిలో మొట్ట మొదటిది—'విప్లవకవిత్వం ఎల్లా వుండాలి?'

'విప్లవ కవికి స్పష్టమైన వర్గ చైతన్యం అవసరం...కేవలం మార్క్సు రచనలు చదవటం తోనే వర్గతత్వం అలవడుతుందనుకోడం భ్రమ... జీవిత వాస్తవికత నుంచే అవగాహన, చిత్రణ ఆరంభం కావాలి...సాహిత్య దృష్టితో రచన ఎంత కళాఖండమైనా, సాంఘిక దృక్పథం లేనప్పుడు అది అధమ రచనే అవుతుంది...'అంటూ మనల్ని చెయ్యి పట్టుకుని లాక్కువచ్చితమ సూత్రాకరణను మనముందుపెట్టేరు.

'సాంఘిక, కళాత్మక విలువలు ఏకమై సామాన్య జనాన్ని విప్లవ ప్రభావంతో ప్రభావితం చెయ్యగలిగిందే విప్లవ రచన.' (పుట 6)

పైన వుదహరించిన వాక్యాలలోని 'వర్గం'— అంటే 'కార్మికవర్గం' అని శ్రీ మధుసూదనరావుగారి వుద్దేశం. ప్రకరణాన్నిపట్టి వూహించుకోమని వదిలేసే కన్న స్పష్టంగా చెప్పడం ఇటువంటి శాస్త్ర చర్చలలో మంచిది. ప్రస్తుత సందర్భంలో చాలా ముఖ్యం. ఏమంటే మన విరసం కవి మిత్రులలో ఒక్కరూ కార్మికవర్గానికి చెందిన వారున్నారనుకోను. నే నెరిగి నంతవరకు అంతా మధ్యతరగతుల వారే. అందుచేత ఏ 'వర్గ చైతన్యం', ఏ 'వర్గతత్వం' అన్నది స్పష్టంగా వుంచుకోడం అవసరం.

ఇంక సూత్రీకరణలో 'విప్లవం' అనే పదం రెండుమార్లు వినిపించడంవలన కొత్తగా కనిపిస్తూందే గాని, నిజానికి అది కొత్తది కాదు. సాహిత్యం సామాజిక దృష్టి కలిగి, కళాత్మకంగా వుండాలనే వాదాన్ని సాహిత్య మీమాంసకులతో ఒక పక్షం చిర కాలంగా తెస్తున్నారు. ఈ షచ్ఛాయా భేదాలతో దానిని ప్రత్యాఖ్యానం చేసేవారు కొందరున్నా, నేడు దానిని బహుజనాభిప్రాయంగానే స్వీకరించ వచ్చు.

ఈ వ్యాసంలో శ్రీ మధుసూదనరావుగారు విప్లవకవి ప్రాథమిక లక్షణమూ, ధ్యేయమూ వివరిస్తూ వ్రాసిన రెండవ పేరా అభినందనీయం.

అయితే తరువాత 'శ్రామిక సంస్కృతిని వాళ్ల జీవిత పద్ధతిని అవగాహన చేసుకోవాలి.' 'శ్రామికులతో కలిసి మెలిసి జీవిస్తే వర్గ ధోరణి పూర్తిగా అలవడుతుంది.' మొదలైన సూచనలు చేసేరు. ఈ శ్రామిక సంస్కృతి అనే పదం రెండు మూడు చోట్ల పునరుక్తం అయింది. ఏమిటీ 'శ్రామిక సంస్కృతి?' అనే ప్రశ్న పాఠకునికి వెంటనే కలుగుతుంది. వారి జీవిత పద్ధతిని ఆ విధంగా చెప్పేరేమో అనుకొనే అవకాశం లేదు. మరి!

మన దేశంలోనేగాని, మరెక్కడన్నా గాని ప్రతి వర్గానికి ఒక సంస్కృతి వేరే వుందా? సంస్కృతి అంటే ఏమిటి? ఆయా దేశకాల పరిస్థితుల పరిణామాల్ని పట్టి ఫ్యూడల్, పెట్టుబడిదారీ (బూర్జువా) సోషలిస్టు సంస్కృతులనే విభజనలను స్వీకరించాం. ఆయా సమాజాలలో వేర్వేరు వర్గాలు తమ ఆర్థిక స్థితినిపట్టి, గతకాలంతోనో, భావికాలంతోనో వారికి గల భౌతిక, మానసిక, జీవితాను బంధాలుపట్టి ఆ వర్గం జీవిత పద్ధతులలో ఛాయా భేదాలు ఏర్పడ తాయి. వానిని సంస్కృతిగా చెప్పలేము. రేడియో, టెలివిజన్, వార్తా పత్రికలు, చదువులు ముఖ్యంగా సాంకేతిక విద్యలూ బూర్జువావర్గ సంస్కృతిగా

జమకట్టి వదిలెయ్యలేము. అజ్ఞానం, మురికిపేటల్లో నివాసం, కాపుసారా తాగడం వంటివి అధోవర్గ సంస్కృతిగా ఆదరించమనం. ప్రజలతో కలిసి మెలిసి జీవించమనీ, వారినుంచి నేర్చుకోవలసిన దెంతో వున్న దనీ మార్క్సిస్టులు చెప్పడం శ్రామిక సంస్కృతి అంటూ ఏదో వున్నదనే దృష్టితో మాత్రంకాదు.

ప్రజలు—భావాలు అనే రెండో వ్యాసంలో 'ప్రజల మనస్సులో స్థిరమైన భావాలలో మార్పు రాకుండా సంఘంలో ఏ మార్పు వచ్చినా అది తాత్కాలికమే'ననీ 'ప్రజల ఆలోచనా సరళి బాగుపడాలన్నా, అనుభవాలను అర్థం చేసుకోవడం, ఆటంకాలను అధిగమించడం జరగాలన్నా గతి తర్కం సంస్కారంలోనే లీనం కావాలి.' అనీ (పు 12) 'తిరోగామి భావాల, సంస్కృతుల ఛాయలు రేఖామాత్రంగా కూడా లేకుండా నిర్మూలించడమే నేటి ప్రజల కర్తవ్యం' (పుట 7) అనీ ఉద్బోధించేరు. ఆ ఉద్బోధలో గాని, 'ప్రజలంటే ఎవరు' అని ప్రశ్నించుకుని తామే యిచ్చుకొన్న సమాధానంలో గాని గతి తర్కం సంస్కారంలో లీనం చేసుకోవడం ఏమాత్రం కనబడదు.

'ఎవరికి చైతన్యం వుందో వారే ప్రజలు...... ఇప్పుడు వర్గరహిత సమాజాన్ని సాధించడానికి వుద్యమిస్తున్న శ్రామిక సందోహమే ప్రజలు'—అని వారి నిర్వచనం.

శ్రీ మధుసూదనరావుగారు బాగా ఆలోచించుకోవలసిన నిర్వచనం ఇది. చారిత్రక పరిస్థితుల్ని పట్టి చైతన్యం స్వభావం భిన్నంగా వుంటుందనే తెలివిడి దానిలో వుంది. కాని, ఆ చైతన్యం అందరిలోనూ సమంగా వుండదు. దానికి చారిత్రక పరిస్థితులే కారణం—అనే తెలివిడి కనిపించదు.

ఇంకా స్పష్టంగా చెప్పాలంటే వర్గ రహిత సమాజాన్ని కోరుతున్నామనేవారు మన సమాజంలో నేడు అసంఖ్యాకంగా కనిపిస్తున్నారు. వాదనకు, వారి కోరిక నిజాయతీతో కూడిన దనే అనుకున్నా, శ్రీ మధుసూదనరావుగారి ఆలోచనా క్రమాన్ని అందరూ ఒప్పుకోడంలేదు. ఎవరి వాదనలు, దారులు వారు ప్రతిపాదిస్తున్నారు. వానిలో ఏది ప్ర... ? ప్రతి ఒక్కరూ మా వాదన ననుసరించే వారే ప్రజలు. మిగతా వారు కారు అనవచ్చు. బాగానే వుంటుంది. కాని సమస్య అక్కడితో ఆగదు కదా. ప్రజలు కాని వారి యెడ వారు ఏ విధానం అనుసరించాలనే ప్రశ్న వస్తుంది.

అదే వ్యాసంలో మరో చోట (పుట 7) 'అశాస్త్రీయ సిద్ధాంతాల్ని సహేతుకంగా ఖండించి... ప్రజల్ని విద్యావంతుల్ని చెయ్యాలి'—అన్నారు. ఇక్కడి ప్రజలు ఎవరు? చైతన్యం కలవారికే విద్యాబోధనా? మొత్తంమీద ఈ వ్యాసంలో ఆద్యంతం అవగాహనా లోపమే కాదు. మనసులోని భావాల్ని ఏ మాత్రం చెప్పలేక పోవడంకూడా కనిపిస్తుంది.

ఈ సంపుటిలోని మూడో వ్యాసం— 'విప్లవ కవిత్వం—సాంస్కృతిక పోరాటం'—లో ప్రధానంగా విరసం మిత్రులు విప్లవ నిమగ్నతనుంచి విప్లవ నిబద్ధతకు సర్దుకోవడాన్ని సమర్థించుకొంటూ, దానికి సిద్ధాంత రూపం ఇవ్వాలనే ప్రయత్నం కనిపిస్తుంది.

ఇందులో రెండు రకాల ఆలోచనా ధోరణులు పక్కపక్కనే కనిపిస్తున్నాయి. విప్లవ సిద్ధాంతం లేకుండా విప్లవోద్యమం లేదు...విప్లవ సిద్ధాంత దృక్పథం లేకుండ విప్లవ కవిత్వం వుండదు. (13 పుట) విప్లవకవికి ఆచరణ. సిద్ధాంతం కలిసే వుంటాయి.' (పుట 15) ఇదొకటి.

విప్లవ కవికి విప్లవకారుని వేషం అనవసరం. అవాంఛనీయం...విప్లవ కవులు స్వభావరీత్యా రెండు

రకాలుగా వుంటారు...విప్లవ కార్యక్రమంలో, ఉద్యమంలో పాల్గొని, విప్లవకారులమధ్య వుండి విప్లవ కవిత్వం వ్రాసేవాళ్ళు...పోరాటం ఆదర్శంగా విప్లవ కవిత్వం వ్రాసే వాళ్ళు. చిత్తశుద్ధిలోగాని, సిద్ధాంత దృష్టిలోగాని వీరిద్దరికీ తేడా గ్రహించిన విప్లవ బాధ్యత లోనే వుంది.' (పుట 15) ఇది రెండో ధోరణి.

ఏక్టివ్, పేసివ్ సభ్యులనే భేదం పాటించనివి బూర్జువా రాజకీయాలు మాత్రమే. మార్క్సిజం వూపిరిగా, విప్లవోద్యమాన్ని నిర్మించబూనుకొన్న లెనిన్ వారిద్దరి మధ్యాతేడా లేదనుకోలేదు. వుందని, దానిని ఖచ్చితంగా చూడాలన్నాడు. శ్రీ మధుసూదన రావుగారు మన్నించే మావోకూడా ఈ తేడాను నిరాకరించడం లేదు. ఆయన సాంస్కృతిక విప్లవం లక్ష్యం అదే కదా!

ఈ వ్యాసాన్ని చూస్తే, ఈ స్వాభిప్రాయ వ్యాఘాతానికి మూడు కారణాలు కనిపిస్తున్నాయి. విప్లవోద్యమంలో సాహిత్యకారుల స్థానాన్ని అతిశయంగా వూహించుకోవడం ఒకటి. ప్రజా విప్లవాలలో ప్రబోధ, అధీతి, అధ్యాపనలకూ సాయుధ విప్లవానికీ మధ్యనున్న సంబంధం, అంతరం, అవినాభావత అర్థం చేసుకోక పోవడం రెండోది. విప్లవోద్యమంలో సాయుధ విప్లవం ఒక దశాంతరమే గాని, అదే సర్వే సర్వం కాదనే పరిజ్ఞానం స్పష్టంగా, దృఢంగా లేకపోవడమూ, తత్ఫలితంగా అంతరాంతరాలలో అజ్ఞాతంగానే అంకురించిన ఆత్మరక్షణాధ్యన సాయమూను.

దీనిలోని నాలుగవ వ్యాసం 'విప్లవ కవిత్వం—వాస్తవికత' గురించి.

19 వ శతాబ్దిలో యూరపియన్ సాహిత్య రంగంలో విస్తరించిన 'విమర్శనాత్మక వాస్తవికత', 20 వ శతాబ్దిలో సోషలిస్టు దేశాలతో కాలూనుకొన్న 'సోషలిస్టు వాస్తవికత'లను గురించి రచయిత ఈ వ్యాసంలో చర్చించడానికి ప్రయత్నించేరు. కాని 'ధన స్వామ్యదేశాలలో యిది (విమర్శనాత్మక వాస్తవికత) సామ్యవాద వాస్తవికతకు ప్రత్యామ్నాయంగావుంటుంది.' (పు 27), అనీ, 'విప్లవ కాల్పనికత (రివొల్యూషనరీ రొమాంటిసిజమ్) సామ్యవాద వాస్తవికతలో ఒక భాగమే' (పుట 29) ననీ, 'శ్రమజీవులను గానీ...యే విషయాన్ని గాని గ్రహించినా ప్రేమ కథగానో, కుటుంబ కథగానో మారిపోవడం విమర్శనాత్మక వాస్తవికతా రచనలలోని ప్రధాన లక్షణ'మనీ (పు 28)—ఇటువంటివే దీనిలోని సూత్రీకరణలు రచయితకు అసలు విషయం స్పష్టంగా అవగతం కాలేదనే అభిప్రాయం కలిగిస్తున్నాయి. లేకపోతే ఈ పులుముడు పనిలేదు.

'విప్లవ రచన—ప్రమాణాలు' సంకలనంలోని వ్యాసా లన్నింటిలోకీ చిన్నది. (3 పుటలు)

ఆరో వ్యాసం 'కవిత్వం—చైతన్యం'- అన్నింటి కన్నా పెద్దది. (13 పుటలు.)

ఈ రెండు వ్యాసాలలోనూ 'భౌతిక జీవితమే చైతన్యాన్ని నిర్ణయిస్తుంది.'—అనే భావాన్ని రచయిత రెండు భిన్న కోణాలనుంచి వివరించ ప్రయత్నించేరు.

అయితే ఆ భౌతిక జీవితాన్ని రాజకీయ పరంగా ఒకదానిలో విశ్లేషించేరు. రెండో దానితో చరిత్ర పరంగా విశ్లేషించ బోయేరు. కాని రెండుచోట్లా అర్థం లేని వాక్యాలతో, తప్పు నిర్వచనలతో గంద్రగోళంతో చిక్కుకోడమే కనిపిస్తుంది.

'వాల్మీకి, ప్రాచీన గ్రీకు కవులు, చివరకు డాంటే, మిల్టన్‌లు కూడా రాజకీయాలే వ్రాశారు.' (పుట 31) 'సంఘం, తత్వం, చరిత్ర, జీవితం అన్నీ కలిపే రాజకీయం పేరుతో పిలుస్తాం.' (అదే పుట.) ఈ రకమైన అశాస్త్రీయ సమాలోచనతో ప్రారంభించడం చేతనే వ్యాసం అంతటా వస్తు శిల్పాలకు ఐక్యత వుండాలని చెప్తూనే చివరకు వచ్చేసరికి—'ఇప్పుడు మనం వున్న చారిత్రక దశలో రాజకీయం కళా ప్రమాణాలకంటె ప్రాధాన్యం వహించాలి.' (పుట 34) అన్నారు.

ఈ 'ఇప్పుడు'—అన్నదానికి అర్థం ఏమిటి?

అలాగే ఆరో వ్యాసంలోని ఈ వాక్యాలు రచయిత మనస్సులో వున్న గంద్రగోళానికి తార్కాణాలు:

'ఆదిమవర్గ రహిత సమాజం అశాస్త్రీయమైన వర్గరహిత సమాజం' (పుట 36).

ఇది పొరపాటు కాదా? ఆ ఆదిమకాలం నాటి వుత్పత్తి పరిస్థితులలో ఆదిమ కమ్యూనిస్టు సమాజంగా మనం పేర్కొనేది శాస్త్రీయమే. అశాస్త్రీయ స్థితి వచ్చినప్పుడు—ఉత్పత్తి పద్ధతులకూ, ఉత్పత్తి సంబంధాలకూ పొంతనా లేని దశ ఏర్పడినప్పుడు—ఆ వ్యవస్థ మారే పోయింది.

మరో వాక్యం చూడండి : 'ఆదిమ వర్గరహిత సమాజం వర్గరహిత సమాజంకోసం వర్గ సమాజంగా పరిణమించింది' (పుట 38)

ఇదంతా అర్ధశూన్యమైన పాండిత్య గరిమ ప్రదర్శించే ప్రయత్నం తప్ప వేరు కాదు. వుత్పత్తి శక్తులూ—సంబంధాలూ మధ్య పరిణామంలో ఏర్పడే వైరుధ్యాల పరిష్కార క్రమంలో, తప్పనిసరిగా, అనాలోచితంగానే వర్గరహిత సమాజం వర్గ సమాజంగా మారింది. వర్గ సమాజంలోకూడ వివిధ అంతరువులు మారేయి. కాని, ఈ వర్గ సమాజంలోంచి ఈ మారు పరిణతి పొందే వర్గరహిత సమాజం అనాలోచితంగా గాక, సాలోచితంగా రూపొందుతుంది. అంతేగాని, కొన్నివేల సంవత్సరాల తర్వాత వచ్చే పునర్జన్మకోసం ఆదిమ వర్గరహిత సమాజం ముందే పథకం వేసుకొన్న దనడంలో అర్థం లేదు.

ఆఖరు వ్యాసం 'కవిత్వం—శాస్త్రీయ విమర్శ'లో శ్రీ మధుసూదనరావుగారు మార్క్సిస్టు విమర్శకుని బాధ్యతలు వివరించేరు. కాని, వానిని వివరిస్తూ వస్తువు—శిల్పం, రూపం—ప్రక్రియ మొదలైన వాని చర్చలో చిత్రమైన సూత్రీకరణలు చేశారు. వస్తు ప్రాధాన్యతే కవిత్వాన్ని తక్కిన కళలనుంచి వేరు చేస్తుంది. పుట '(49) గతి తార్కిక భౌతికవాదం, ఆర్థిక రాజకీయ శాస్త్రం, వైరుధ్య సిద్ధాంతం—అన్నీ కలిపి మార్క్సిజం' (పు. 53.)

ఇల్లాగే ప్రతిపుటలోముడిపడనివీ, సమన్వయం కుదరనివీ, మనం నేర్చుకున్న వానిని గందరగోళంలో పెడుతున్నవి వాక్యాలు నిండివున్నా మార్క్సిస్టు విమర్శకుని బాధ్యతలుగా రచయిత ఇచ్చిన వివరణను అభినందిస్తున్నాను. వానినిక్కడ పునరుల్లేఖించడం నా బాధ్యతగా భావిస్తున్నా.

విమర్శకుడు మార్క్సిజాన్ని క్షుణ్ణంగా చదువుకోవాలి. మారుతున్న సాంఘిక పరిస్థితుల్ని పరిశీలించాలి...గ్రంథాలు మాత్రమే చదివి జీవితంతో అన్వయించడం జరగకపోతే మనస్సు స్థావరమై, పిడివాద కూపంలో పడే ప్రమాదం వుంది. మార్క్సిస్టు విమర్శకుడు పోరాటం, నిర్మాణం ఒకేసారి చేయాలి. కవి ఎక్కడ తప్పటడుగు వేస్తున్నాడో, ఎక్కడ ఏ కారణంతో అవగాహనలో దెబ్బతింటున్నాడో, ఏ విషయంలో, ఏ అంశంలో కవి ప్రజావ్యతిరేక ధోరణుల్ని ఏ కారణంవల్ల స్వీకరిస్తున్నాడో విశ్లేషించాలి. కవి ఆశయాన్ని అనుసరించి. విమర్శలో ఘాటు వుంటుంది...కవి ఆశయం మంచిదై, తెలియకుండా తప్పుచేస్తున్నప్పుడు దోషాల్ని వివరిస్తూ, నిర్మాణాత్మకంగా విమర్శ జరగాలి. ఏ పరిస్థితుల్లోనూ విమర్శకుడు రాజీపడకూడదు...' (పుట 54)

చాల ఉదాత్తమైన ఈ సూచనలకు కట్టుబడి వుండడం విమర్శకుల కర్తవ్యమనడంలో సందేహం అక్కర్లేదు.

'' అవంతి ''

శ్రీనాథాంకమ్—1

వైజయంతి, (సాహిత్య విశిష్ట సంపుటి.) సంకలన కర్త: శ్రీ కర్రా చంద్రశేఖర శాస్త్రి, పేజీలు: 154, వెల: రు. 5–00 లు. ప్రతులకు: కర్రా చంద్రశేఖర శాస్త్రి; సామర్లకోట; తూ. గోదావరి జిల్లా.

ఆంధ్ర సాహిత్య పరిణామ దశల్ని చరిత్రకారులు కొన్ని యుగాలుగా విభజించారు. అనువాద యుగం, ప్రబంధ పూర్వ యుగం, ప్రబంధ యుగం, దక్షిణాంధ్ర యుగం, ఆధునిక యుగం ఇత్యాదిగా ఈ యుగ విభజన సాహిత్య చరిత్రలో మనకు కనబడుతుంది. అయితే ఈ విధమైన యుగ విభజనే సమగ్రమూ, సంపూర్ణమూ అని మనం భావించ నక్కరలేదు. ఒక్కొక్కసారి ఒకానొక కవి పేరుమీద కూడా సాహిత్యంలో ఒక యుగం ఏర్పడవచ్చు. అసాధారణ ప్రజ్ఞావంతుడైన ఒక కవి తనకు పూర్వం అపరిచితమైనట్టి ఒక క్రొత్త మార్గాన్ని నిర్మించినపుడు, ఆ మార్గం ఒక సంప్రదాయంగా పరిణమించినపుడు ఆ కాలాన్ని సాహిత్యంలో ఆ కవి యుగంగా భావించడం సర్వ జనాంగీకారమైన సత్యం. ఈ దృష్టితో కనుక

పరిశీలిస్తే అనువాద యుగం తరువాత ఏర్పడిన ప్రబంధ పూర్వ యుగాన్ని శ్రీనాథ యుగంగా భావించవచ్చు. అనువాద యుగానికి, శ్రీనాథ యుగానికి స్వరూప స్వభావాల్లో అనంతమైన భేదం కనబడుతుంది. అనువాద యుగం అంతా దరిదాపుగా పురాణాలను ఆంధ్రీకరించడంతో సరిపోయింది. శ్రీనాథుడు కావ్యానువాదానికి శ్రీకారం చుట్టాడు. శృంగార రసానుగుణమైన శైలీ నిర్మాణం కావించాడు. సీసపద్య రచనా విధానం శ్రీనాథుని సొంతమే గదా! (సీస పద్యం శ్రీనాథునికి రాయటం రాదనే వాళ్ళు లేకపోలేదు. ప్రతిభని అంగీకరించడం కష్టం గదా!) ప్రబంధ పూర్వ యుగాన్ని గూర్చి 'తెలుగు విజ్ఞాన సర్వస్వం' మూడవ సంపుటంలో కీ. శే. ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు ఈ విధంగా రాశారు. 'ఇంచుమించు క్రీ. శ. 1350 వ సంవత్సరము వరకు భారత, రామాయణాదుల అనువాదములే ప్రధాన వాఙ్మయ క్రియలైనవి. క్రీ. శ. 1500 సంవత్సరములనుండి స్వతంత్రములైన ఆంధ్ర ప్రబంధములవతరించినవి. ఆ పురాణాదుల అనురాగములకు, ఈ ప్రబంధముల స్వతంత్రతకు నడిమి కాలమయిన శ్రీనాథుని యుగము ఆ ప్రబంధ ప్రచారమునకు దారి తీసినది ... ఈ యుగములోని మహా కవుల కృషియంతయు ఉత్తర కాలమున జరగబోవు ప్రబంధ సరస్వతీ విహారమునకు మెత్తని పూలబాట పరచుటయైనది. ఈ మహానుభావులే ప్రబంధ నాటక ప్రదర్శనమునకు పూర్వరంగ ప్రవర్తకులు. వీరు నెరవేర్చిన ప్రస్తావన కనుగుణముగానే ప్రబంధ నాటకము ప్రదర్శింపబడినది. అందుచేత ప్రబంధ యుగముగ కవ్యవహితమైన ఈ కాలమును ప్రబంధ పూర్వయుగమని పేర్కొనుటలో ఆక్షేపము ఏమియు నుండదు. దీనికి నాంది శ్లోకమును పఠించి, ఈ ప్రస్తావనను నడిపిన వాడు శ్రీనాథుడు. పై వివరణ వలన తన అనంతర కాలంలో వికసించిన ఒకానొక స్వతంత్ర సాహిత్య యుగానికి శ్రీనాథుడే తన కాలంలో కావ్యానువాదం ద్వారా ప్రారంభోత్సవం చేశాడని చెప్పవచ్చు. శ్రీనాథుడు తనదైన ఒక స్వతంత్ర మార్గాన్ని నిర్మించుకొనడంవల్ల సాహిత్య చరిత్రలో శ్రీనాథ యుగం స్థిరపడిపోయింది.

ఈ సమీక్షా గ్రంథంలో పలువురు పెద్దల వ్యాసాలున్నాయి. ఆయా వ్యాసాల్లో శ్రీనాథుని కవిత్వ తత్త్వాన్ని గురించి ఎవరూ ఏమీ రాయలేదు. సంకలన కర్త అయిన శ్రీ కర్రా చంద్రశేఖర శాస్త్రిగారు ప్రత్యుత్థానంతో 'శ్రీనాంధాకములో ఇది తొలి సంపుటి. మలి సంపుటిలో శ్రీనాథుని కృతులపై విపుల సమీక్షలుండగలవు' అని రాశారు. అంచేత శ్రీనాథుని కవితా శిల్పం, అనువాద వైఖరి ఇత్యాదులైన అంశాలపైన రాబోయే సంపుటిలో దీర్ఘమైన వ్యాసాలను మనం చూడగలం. ఈ సంకలనంలో కనిపించే వ్యాసాల్లో శ్రీనాథుని కావ్యరచనాకాలం మీద ఎక్కువ చర్చ కనబడుతుంది.

డాక్టర్ కొర్లపాటి శ్రీరామమూర్తి గారు 'చిన్నారి పొన్నారి చిఱుతకూఁకటినాఁడు' వ్యాసంలో చిఱుతకూకటి వయస్సుని పన్నెండు సంవత్సరములుగా నిర్ధారణ చేస్తూ శ్రీనాథుని కావ్యముల క్రమమును తెలియజేశారు. ఇంద్రగంటివారు 'మా నాఁగు మీసాల నూత్న యౌవనము'లో శ్రీనాథునికి గల ప్రాకృత భాషా పరిజ్ఞానాన్ని వివరించారు. డాక్టర్ దివాకర్లవారు శృంగార నైషధ రచనా కాలాన్ని 'నిండు జవ్వనములో' వివరించారు. భీమఖండ రచనను, తదాశ్రితమైన చారిత్రకాంశములను 'నిండు జవ్వనము'లో చిలుకూరి పాపయ్యశాస్త్రి గారు పేర్కొన్నారు. 'కైవ్రీలని ప్రాయము'లో కాశికాఖండ రచనను గూర్చి శ్రీ పోచిరాజు శేషగిరిరావుగారు 'కవి సార్వభౌమత'లో శ్రీనాథుని పాండిత్య వైభవాన్ని శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి గారు విపులీకరించారు. కీ. శే. చెళ్ళపిళ్ళ వారు 'శ్రీనాథుఁడు శ్రీరాముఁడు కాడు' అనే వ్యాసంలో శ్రీనాథుని అనువాద వైఖరిని క్లుప్తంగా వివరిస్తూ, శ్రీనాథుని శృంగార జీవితాన్ని గురించి పలువురకున్న అభిప్రాయాన్ని, తన అభిప్రాయాన్ని విశదీకరించారు. శ్రీ నోరివారు 'ఉద్భట వివాద ప్రౌఢి'లో శ్రీనాథుడు డిండిమభట్టు కంచుఢక్కను పగులగొట్టించిన కథను వివరించారు. 'దేశ సంచారము'లో శ్రీ కర్రా చంద్రశేఖర శాస్త్రిగారు, అరుగుచున్నాఁడు శ్రీనాథుఁడు వ్యాసంలో శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు శ్రీనాథుని కవితా జీవితాన్ని, వైయక్తిక జీవితాన్ని గురించిన కొన్ని

వివరాలు రాశారు. ఈ వ్యాసాలుగాక ఇందులో శ్రీ ద్విభాష్యం వెంకటరావు, శ్రీ మధునాపంతుల, శ్రీ ఇంద్రగంటి, శ్రీ వెంపరాల, శ్రీ దువ్వూరి, కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగార్ల పద్యాలున్నాయి.

శ్రీనాథుని జననకాలం, కావ్యరచనా కాలాలు, కొన్ని గ్రంథముల కర్తృత్వ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలున్నాయి. వీటిలో ఏ ఒక్క అంశంమీద విమర్శకులకుగాని, చారిత్రక పరిశోధకులకుగాని ఏకాభిప్రాయం లేదు. ఏ విషయాన్ని గురించి అయినా నిష్కర్షగా చెప్పడానికి చారిత్రిక ఆధారాలు సమగ్రంగా లభించడం లేదు. పలనాటి వీరచరిత్ర ఏ కాలంలో రాశాడన్నది వివాదం కాగా అసలు దాన్ని శ్రీనాథుడు రాశాడా? లేదా? అనేది అంతకంటె వివాదగ్రస్తమైన విషయంగా పరిణమించింది. 'క్రీడాభిరామము' కర్తృత్వ విషయంలో ఉన్న తగాదా పెద్దలందరకూ తెలిసిందే. అనేకమైన ఈ వివాదాంశాలను గురించి కీ. శే. వేటూరి ప్రభాకర శాస్త్రిగారు, కందుకూరి వీరేశలింగం పంతులుగారు, బండారు తమ్మయ్యగారు, చిలుకూరి వీరభద్రరావుగారు, శ్రీ నేలటూరు వెంకటరమణయ్యగారు, మల్లంపల్లి సోమశేఖరశర్మగారు మొదలైనవారు విస్తారంగా చర్చలు చేసి ఉన్నారు. కాగా డాక్టర్ కొర్లపాటివారు వారి 'శ్రీనాథుడు' అనే పరిశోధక వ్యాసంలో ఈ అంశాలన్నింటిపైనా విపులమైన చర్చచేసి ఉన్నారు.

ప్రాచీన సాహిత్యాన్ని చదవగోరిన క్రొత్తపాఠకులకు ఈలాంటి సంకలనాలు కొంతవరకూ ఉపయోగిస్తాయి. అయితే ప్రస్తుత సమీక్ష్య సంకలనం సాహిత్యపరంగా సాధించిన పరమార్థం ఏమిటి? అంటే స్పష్టంగా సమాధానం చెప్పడం కష్టం, ఏమైనా సంకలనకర్త కృషి ప్రశంసనీయమైనది.

శ్రీ టి. ఎల్. కాంతారావు

తెగిపోని బంధం

(నవల)

(మూలం—రాజేంద్రసింగ్ బేదీ, అనువాదం. కె.గోపాలకృష్ణారావు, ప్రచురణ—సాహిత్య ఎకాడమీ—ఢిల్లీ. మూల్యం—5 రూ. పేజీలు—117.)

భారతదేశం మత విశ్వాసాలకు, సంఘ నియమాలకు ప్రపంచ చరిత్రలో ఒక స్థానం సంపాదించింది. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క నియమం సామాజిక చరిత్రను తెల్పుతూ ఉంటుంది. నియమాలు, ధర్మాలు సామాజిక వ్యవస్థను తీర్చి దిద్దేవని ప్రజల విశ్వాసం. నాగరికత పెరిగిన కొలది నియమాలు ఛేదింపబడి నూతన ధర్మాలు ప్రతిపాదించారు. ఆయా ధర్మాలు వారి కాచరణ సాధ్యములు. ఒక ప్రాంతపు ఆచారం మరియొక ప్రాంతంవారికి వికృతంగా కాన్పిస్తూ ఉంటుంది.

పంజాబు దేశంలోని ఆచారాలు వేరొక ప్రాంతంవారికి అసహజంగా కన్పించి విస్మయం కలిగిస్తాయి. పంజాబు యువతి గాథను ఆధారం చేసికొని రాజేంద్రసింగ్ బేదీ అను నాతడు 'ఏక్ చందర్ మైలిసీ' అను నవలను ఉర్దూలో వ్రాసారు. దానిని కె. గోపాలకృష్ణారావు తెలుగున కనువదించారు. అదే 'తెగిపోని బంధం.'

రాణి—త్రిలోకులు భార్యాభర్తలు. సుఖదుఃఖాలు, రాగద్వేషాలు వారిలో కలిసిమెలసి తిరిగాయి. దరిద్రం తాండవించింది. జీవిత గమనమే మారిపోయింది. అసహనం పెరిగింది; ఇరువురి మధ్య భేదాభిప్రాయాలు యేర్పడ్డాయి. తీవ్రపరిస్థితి సంభవించింది. త్రిలోకుడు మరణించాడు. రాణి స్తన్యమిచ్చి పెంచిన మంగళుడే మరిది. ఆ మరిదితోనే రాణికి పునర్వివాహం జరిగింది. సమాజం సంతోషించింది. రాణి మనస్సు చెదరింది. మంగళుని హృదయం ఆందోళన చెందింది. అలజడి—ఆందోళన మధ్య వారి జీవితాలు నలిగిపోయాయి. ఇదీ కథ.

కలకాలం నవ్వుతూ జీవితాన్ని గడపాలని రాణి త్రిలోకుని వివాహమాడింది. గౌరవ మన్నన ఉన్న వ్యక్తి రాణి. తన జీవితాన్ని త్రిలోకునికి అర్పించాలని కలలు కన్నది. కాని విధి వక్రించింది. జీవితం దుర్భరమైంది. కష్టాలెక్కువయ్యాయి. మనసు తిరుగుబాటు చేసింది. కాలం కాటు వేసింది. అత్తమామలు రాణిని నిందించారు. ఆ ఇంటికి రాణి అపశకున మయ్యింది. దుఃఖాన్ని ఆపుకోలేక పోయింది. ఎదిగిన బిడ్డలమధ్య కన్నీరు ఆపుకోలేక

పోయింది. కడుపు నింపుకోవటానికి అవినీతిని చేపట లేదు. కాని లోకం బలవంతంచేసి మరిదితో వివాహం చేసింది. మానసిక వ్యథ బయలుదేరింది. ఒకప్పుడు అమ్మా అమ్మా అని బడికి చేరిన వాడు భర్త అయ్యాడు. పెళ్ళీడు వచ్చిన పెద్దమ్మాయి మనసులో మెదిలింది. సమాజానికి సమాధానం చెప్ప కోలేక పోయింది. చివరకు రాణి మంగళునికి భార్య అయ్యింది. తల్లిగా మాతృ వాత్సల్యం, మరిదిగా మమత, భర్తగా గౌరవం అందించింది రాణి.

ఆధారంలేని రాణి అపమార్గాన్ని అందుకోటానికి ప్రయత్నించలేదు. అత్తమామలను తల్లి దండ్రులుగానే భావించింది. అత్త అధికారం చూపినా చలించలేదు. మామ మన్నించినా మిడిసి పడలేదు. ఆవేశం వదులుకోలేదు. ఆవేదన మరచి పోలేదు. ఆమె జీవితంలో మంగళుడు భర్త. అన్నీ జరిగిపోయాయి క్షణంలో.

మంగళుడు సలామతేతో పరిచయం కలిగించు కొని ఒకటిగా ఉండాలనుకొన్నాడు. సలామతే కూడ సంతోషించింది. రాణి—మంగళుల వివాహం నామ మాత్రమే అని ఊహించి కలలు కన్నది. తరువాత పరిస్థితులవల్ల ఆ కలలన్నీ అడవిగాచిన వెన్నెల అయ్యాయి. మంగళునికి భార్య కాలేకపోయింది.

అత్తమామలు హర్షించారు. రొట్టెలు తిన్నారు. కష్టాలు మరచి పోయారు.

రాణి స్నేహితురాండ్రు రాణిని సమాజంలో ఒక స్త్రీగా నిలబెట్టి మాట సహాయం అందించారు.

కథ కరుణ రసప్రాయంగా ఉన్నది. నవలలో ప్రకృతి వర్ణన బాగున్నది. కాని మధ్యలో భావగీతాలు లేకుండా అవికూడ వచనంలోనే అనువాదకర్త చేసి యుంటే చక్కగా ఉండేది. అనువాదమే అయినా కథలోని పటుత్వంవల్ల అలా అనిపించదు. చదవతగిన నవల. సాహిత్య ఎకాడమీ కృషి ఫలించింది.

శ్రీ రామమోహన్.

గ మ ని క

1972 అక్టోబరు భారతిలో శ్రీ గోరంట్ల ఫణికుమార్‌గారు పంపిన 'మహాభాగ్యం' అనే పేరు కల కథ ప్రచురించాము. ఆ కథ ఇంతకిముందే ప్రచురితమయిన కథని ఒకదానిని పోలి ఉన్నదని కొందరు పాఠకులు ఉత్తరాలు రాశారు. ఈ విషయమయి శ్రీ గోరంట్ల ఫణికుమార్ గారికి రాయగా ఆయన పంపిన సమాధానం ఈ కింద వేస్తున్నాము. ఇంత వరకూ శ్రీ గోరంట్ల ఫణికుమార్‌గారు తమ లేఖలో తమ మిత్రులు శ్రీ మోహనరాజుగారు ఏమని ఏమి రాశారో తెలుప లేదు. సంపాదకుడు

తిరుపతి, అక్టోబరు.

పూజ్యులు శ్రీ రాధాకృష్ణగారికి,

మీరు దయతో వ్రాసిన ఉత్తరము అందినది.

మీ ఉత్తరము అందిన వెంటనే శ్రీ విశ్వనాథ శాస్త్రి గారి 'పువ్వులు' కథ చదివాను. దానికి నా కథకు చాల చోట్ల పోలికలున్న మాట నిజం.

ఈ కథను సగం వ్రాసి నా మిత్రుడు రచయిత శ్రీ మోహనరాజు తాను వ్రాయడంలేదనీ దాన్ని పూర్తి చేయమనీ చెప్పారు. ఎలా నడవాలో కూడా వారే చెప్పారు. నేను దాన్ని పూర్తిచేసి మీకు పంపడము, మీరు ప్రచురించడమూ జరిగింది. అయితే కథలో పోలికలున్నా నడక, భాష వేరు.

ఆయన యీ పని తెలిసే చేశారో తెలియకచేశారో నాకు తెలియదు. మీ ఉత్తరం అందిన వెంటనే నేను ఆయనకు వ్రాశాను. బాధ ఏమిటంటే Always the concerned magazine becomes the ultimate, Victim of such intellectual dishonesty. ఏ విషయమూ నాకు తెలిసినవెంటనే మీకు తెలియజేయ బడుతుంది.

ఒక్క గ్యారంటీమట్టుకు మీకు నే నివ్వగలను. శ్రీ రాజుగారు గానీ మరొకరు గాని భారతికి పంపేటప్పుడు యిలాంటి పని తెలిసి చెయ్యరు కనీసం—వారి బుద్ధి వారి స్వాధీనంలో వుండేంతవరకూ..తెలిసో తెలియకో నావల్ల నే జరిగింది. అందుకు క్షంతవ్యుడను. భవదీయుడు,

గోరంట్ల ఫణికుమార్.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7 Thambu chetty Street, Madras-1. Editor : S. Radhakrishna.

భారతి

ప్రకటన రేట్లు

కవరు పేజీలు		కాజువల్ రేట్లు	కాంట్రాక్టు రేట్లు
4 వ కవరు పేజి	...	రు. 175/-	రు. 150/-
2 లేక 3 వ కవరు పేజి ...			
ఒకే (నలుపు) రంగు	...	రు. 150/-	రు. 125/-
లోపలి పేజీలు			
పూర్తి పేజి	...	రు. 125/-	రు. 100/-
అర పేజి	...	రు. 65/-	రు. 55/-
పావు పేజి	...	రు. 40/-	రు. 35/-

ప్రత్యేక స్థానములకు 25% అదనం.

సం॥నకు వరుసగా 6 ప్రకటనలు చేయువారికి కాంట్రాక్టు రేట్లు వర్తించును.

చందా వివరములు

సంవత్సర చందా	...	రు. 12—00
6 మాసముల చందా	...	రు. 6—00
విడి ప్రతి	...	రు. 1—00

మేనేజరు, భారతి

మద్రాసు—1.